సూర్య 19 వ వసంతంలోకి ...
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శనివారం | 13 డిసెంబర్ 2025 | హైదరాబాద్

సంపుటి 19 | సంచిక 53
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - హేమంతరుతువు, మార్గశిర మాసం బహుళ పక్షం నవమి రా.7.27, ఉత్తర ఉ.9.32, వర్జ్యం సా.6.26 నుంచి 8.08 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.6.19 నుంచి 7.48 వరకు

### లాభాల్లో స్టాక్
## మార్కెట్‌లు



5 లో

- 449.53 పాయింట్ల లాభంతో స్థిరపడ్డ సెన్సెక్స్
- మెటల్ షేర్ల ర్యాలీతో సూచీలకు బలమైన మద్దతు
- 85,200 పాయింట్ల పైన ముగిసిన సెన్సెక్స్
- చరిత్రలో తొలిసారి కేజీ వెండి రూ.2 లక్షలు దాటింది

### కుదుటపడిన 'ఇండిగో'
## సంక్షోభం




6 లో

- శీతాకాలం పొగమంచుపై కేంద్రం ఫోకస్
- పొగమంచు వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు
- ప్రయాణీకులకు అవాంతరాలు కలగకుండా చూడాలి
- పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష

### 2027 జనాభా లెక్కల నిర్వహణకు కేంద్ర
# కేబినెట్ ఆమోదం

- రూ.11,718 కోట్ల బడ్జెట్‌తో రెండు దశల్లో చేపట్టనున్న ప్రక్రియ
- దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో గణన
- జనాభా గణనతో పాటు కులాల వారీగా వివరాల సేకరణకు నిర్ణయం
- ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు సెల్ఫ్-ఎన్యూమరేషన్ అవకాశం

కేంద్ర కేబినెట్ 2027 జనాభా లెక్కల నిర్వహణ కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్ను ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం తెలిపారు. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. 2026-27ల్లో దేశవ్యాప్తంగా 2 దశల్లో జనగణన జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి 2021లోనే జనగణన జరగాల్సి ఉంది. కానీ ఆనాడు కొవిడ్-19 మహమ్మారి విజృంభించడంతో జనాభా లెక్కల సేకరణను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో తదుపరి జనగణన 2027లో జరుగుతుందని కేంద్రం వెల్లడించింది. 2027 మార్చి 1ని రిఫరెన్స్ తేదీగా నిర్ణయించింది.



6 లో

## ఉప్పల్ స్టేడియం భద్రత కట్టుదిట్టం

- మెస్సీ ఫుట్‌బాల్ ఈవెంట్‌కు భారీ భద్రత..
- మెస్సీ మ్యాచ్‌కు పాస్‌లున్న వారికే స్టేడియంలో ప్రవేశం
- 450 సీసీ కెమెరాలు, డ్రోన్లతో స్టేడియం నిఘా
- భద్రతా కారణాలతోనే ఫోన్‌లకు మాత్రమే అనుమతి
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు




3 లో

### హైదరాబాద్ నగరానికి
# అఖిలేశ్ యాదవ్



3 లో

- జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో భేటీ
- అమలు చేస్తున్న పథకాల గురించి వివరించిన రేవంత్ రెడ్డి
- ప్రభుత్వ పండుగగా సదర్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన అఖిలేష్

ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ శుక్రవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి తో జూబ్లీ హిల్స్ నివాసం లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితుల పైన చర్చలు జరిపారు. తెలంగాణ లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్ కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. యాదవ్ లకు ఎంతో ఇష్టమైన సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తిస్తు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని అఖిలేష్ యాదవ్ ప్రశంసించారు. దేశం లోని యాదవ సమాజం రేవంత్ రెడ్డిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఆయన అన్నారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### జర్మనీతో సుదీర్ఘకాలంగా
# స్నేహబంధం

- ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో కలిసి పనిచేద్దాం
- జర్మనీ పార్లమెంటు బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతం, మీ లక్ష్యాలపై స్పష్టంగా ఉన్నారన్న జర్మనీ పార్లమెంట్ బృందం

జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రజాభవన్ లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు.



2 లో

### గ్రామాల అభివృద్ధికి
# అండగా ఉంటాం

- ఆయా..గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తాం
- గాంధీజీ కలలు కన్న విధంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలి
- సర్పంచ్‌లుగా గెలిపించిన గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా పని చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



2 లో

### నాకు తెలియకుండానే
## టికెట్ల ధరల పెంపు



2 లో

- ఇందుకు సంబంధించిన జీవో విడుదలైంది
- సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ-2 తాండవం' మూవీ టికెట్ల ధరల పెంపు, ప్రీమియర్ షోల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ సినిమా టికెట్ల ధరల పెంపుపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తనకు తెలియకుండానే టికెట్ల ధరలపెంపుకు సంబంధించిన జీవో విడుదలైందని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు.

## అంతా ఇంతే!




రాష్ట్ర అధ్యక్ష పదవి రాకపోతేనేం, జాతీయ అధ్యక్షుడి బరిలో ఉంటే సరిపోతుంది

### నాపై ఆరోపణలకు
## సమాధానం చెప్పాలి

- క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తా
- తప్పడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా
- వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త
- తెలంగాణ జాగృతి కవిత హెచ్చరిక



3 లో

కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త అని ఆమె హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. "కేసీఆర్‌తో పాటు ఎవరినైనా ఒక్క పనైనా అడిగామా? దమ్ముంటే నా ఆరోపణలకు సమాధానం ఇవ్వండి.

### మేడారం దేవాలయం అభివృద్ధి పనులను
# త్వరితగతిన పూర్తి చేయాలి

- నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి
- పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలి
- సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించిన మంత్రులు
- సమ్మక్క, సారాలమ్మలను దర్శించుకున్న సందర్భంగా మంత్రులు పొంగులేటి, సీతక్క

మేడారం సమ్మక్క ,సారక్కలను దర్శించుకున్న రాష్ట్ర మంత్రి వర్యులు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను పరిశీలించారు. మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను, నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.



2 లో

### ముగిసిన రెండో
# విడత ప్రచారం

- 14న 3,911 సర్పంచ్ స్థానాలకు పోలింగ్
- తొలి విడతలో కాంగ్రెస్ భారీ విజయం
- మూడో విడత పోలింగ్ 17న




2 లో

తెలంగాణ రాష్ట్రంలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియడంతో, అధికారులు పోలింగ్‌కు సన్నద్ధమవుతున్నారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

# జర్మనీతో సుదీర్ఘకాలంగా స్నేహబంధం

● ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో కలిసి పనిచేద్దాం ● జర్మనీ పార్లమెంటు బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
● 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతం, మీ లక్ష్యాలపై స్పష్టంగా ఉన్నారన్న జర్మనీ పార్లమెంట్ బృందం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రజాభవన్ లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు బృందాన్ని ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది, కలిసి పని చేద్దామని డిప్యూటీ సీఎం తెలిపారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది దీంతోపాటు మూసి పునర్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగం పైన ఆసక్తిగా ఉంది, హైదరాబాద్ ఐటీ రంగానికి హబ్ గా వెలుగొందుతుందని ఈ రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న స్కిల్ యూనివర్సిటీ లో జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని తద్వారా తెలంగాణ విద్యార్థులు జర్మనీ భాష నేర్చుకొని జర్మనీ దేశంలో పనిచేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూర దృష్టితో సైబర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని జర్మనీ పార్లమెంట్ బృందానికి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. జిల్లాల్లో కూడా సైబర్ సెక్యూరిటీ బృందాలను ఏర్పాటు చేసినట్టు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఆర్థిక నేరాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని, ఫైనాన్స్ రంగంలో సైబర్ ఫిషింగ్ ఎలా జరుగుతుంది, వాటిని అరికట్టేందుకు బెస్ట్ ఏఐ టూల్స్ వాడుతున్నట్టు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని జర్మనీ పార్లమెంటు బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించింది.

ప్రతి రంగంలో సాధించాల్సిన లక్ష్యాలను ఈ విజన్ డాక్యుమెంట్ లో స్పష్టంగా పేర్కొనడం అభినందనీయమని, రాష్ట్ర ప్రగతి పట్ల మీ నిబద్ధత ఈ డాక్యుమెంట్ ద్వారా స్పష్టంగా తెలుస్తుందని జర్మనీ పార్లమెంట్ బృందం డిప్యూటీ సీఎం, మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సైబర్ సెక్యూరిటీ, స్కిల్ లేబర్ అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కోరుకుంటున్నామని జర్మన్ పార్లమెంట్ బృందం వివరించింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు చాలామంది భారతదేశంలో పెట్టుబడులు పెట్టారని, తమ దేశానికి చెందిన బోస్ వంటి ప్రసిద్ధ కంపెనీలు ఇక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయి, తమ దేశానికి చెందిన ఇంజనీర్లు భారత దేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్నారని జర్మనీ పార్లమెంటు బృందం వివరించింది. భారతదేశానికి చెందిన 60 వేల మంది విద్యార్థులు జర్మనీలో వివిధ రకాల కోర్సులను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, స్కిల్డ్ లేబర్ కు భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో కొదవలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్మనీ బృందంతో పాటు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్కో సిఎండి హరీష్, ప్రణాళిక శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, అసెంబ్లీ సెక్రటరీ నర్సింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి అండగా ఉంటాం

● ఆయా..గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తాం ● గాంధీజీ కలలు కన్న విధంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలి
● సర్పంచ్‌లుగా గెలిపించిన గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా పని చేయాలి ● మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః గ్రామాల అభివృద్ధికి అండగా ఉంటామని, ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కరిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భీమదేవరపల్లి , ఎలకతుర్తి మండలాల సర్పంచ్ లకు ,ఉప సర్పంచ్ లకు ,వార్డు సభ్యులకు అభినందించి సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ గ్రామ పంచాయతీ మొదటి దశ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం లో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలంలో పోలింగ్ జరిగింది. గెలిచిన సర్పంచ్ లకు ఉప సర్పంచ్ లకు వార్డు సభ్యులకు శుభాకాంక్షలు. గాంధీజీ కలలు కన్న విధంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలి. ప్రజల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చేసుకోవాలి. ప్రజా పాలన ప్రభుత్వం లో గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు మొదటి దశలో మంజూరు చేసింది. రెండవ దశ త్వరలోనే ప్రారంభం అవుతాయి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం.. ఇంకా ఎవరికైనా రాకపోతే అర్హులకు ఉచిత విద్యుత్ ఇచ్చేలా చేయాలి. అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు ఇస్తున్నాం.. కొత్తగా పేర్లు కూడా చేర్చాం ఇది నిరంతర ప్రక్రియ. నూతన ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలి. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మన నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శంగా స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం..కాన్సర్ రాకుండా ప్లాస్టిక్ నిషేధిస్తూ హోటల్ లు ,ప్రతి గ్రామానికి స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగింది. అభివృద్ధికి సంబంధించిన జిల్లా అధికారులను పిలిచి త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తాం. కోడ్ ఐపోగానే మీ గ్రామాల అభివృద్ధికి సంబంధించి నా దగ్గర ఉన్న నిధులు మంజూరు చేస్తాం. భీమదేవరపల్లి లో 15 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఎలకతుర్తి లో 11 గ్రామ పంచాయతీ లకు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది.. సర్పంచ్ లు పార్టీలకు అతీతంగా గెలిచినప్పటికీ ఆయా పార్టీల నా నియోజకవర్గం లో 173 గ్రామ పంచాయతీ లకు 16 ఏకగ్రీవంగా గెలిచారు. 14 తారీకు చిగురు మామిడి ఎన్నికలు ఉన్నాయి. 17 హుస్నాబాద్, కోహెడ అక్కన్న పేట ,సైదాపూర్ మండల ఎన్నికలు జరుగుతాయి. మీ అందరి ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది. మిగిలిన మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి. ముఖ్యమంత్రి కేబినెట్ మంత్రులు అహర్నిశలు కష్టపడుతున్నాం. కళ్యాణ లక్ష్మి గతంలో ఉన్న ఏ ఒక్క పథకం తీసేయకుండా కొనసాగిస్తున్నాం. తెలంగాణ అక్కా చెల్లెలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం. మహిళలను బస్సులకు యజమానులు చేశాం.. సన్న వడ్లు కు బోనస్ ఇస్తున్నాం.. రైతు భరోసా,రైతు రుణమాఫీ చేశాం. హుస్నాబాద్ అంటే రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మీ గౌరవం పెరిగేలా చేస్తా అని చెప్పా..ఆ ప్రయత్నాలు కొనసాగిస్తున్నా. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్,బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచ్,కరీంనగర్ , జనగామ అక్కన్న పేట నాలుగు లైన్ల రోడ్డు ,250 పడకల ఆసుపత్రి, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి ,మహా సముద్రం గండి , సర్వాయి పాపన్న కోట అభివృద్ధి చేస్తున్నాం. మీరు నాకు మరింత బలాన్ని చేకూర్చండి. మీరు ఆశీర్వదించండి.. మాకు బలాన్ని ఇవ్వండి. నా తరుపున మీకు లేఖలు పంపించడం జరిగింది.. అభివృద్ధికి సహకరించాలని కోరడం జరిగింది. అన్ని రంగాల్లో నెంబర్ ఉండేలా కృషి చేస్తున్నాం. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసుకొని ఈ ప్రాంతానికి నీళ్ళు అందిస్తాం. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తాం.. నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మేము కలిసి గ్రామాల అభివృద్ధికి పని చేస్తాం. నా నియోజకవర్గంలో ఉన్న 173 మంది సర్పంచ్ లకు పంచాయితీ రాజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి ప్లాన్ ఆఫ్ యాక్షన్ పై శిక్షణ ఉంటుంది
శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి 100 కోట్లు కేటాయించండి. దానికి సంబంధించిన నివేదిక తయారు చేయాలని వైస్ చాన్సలర్ ను కోరుతున్నజిల్లా మంత్రులం కలిసి ముఖ్యమంత్రి ని కోరుతాం అని మంత్రి పొన్నం వెల్లడించారు.




# ముగిసిన రెండో విడత ప్రచారం

● 14న 3,911 సర్పంచ్ స్థానాలకు పోలింగ్
● తొలి విడతలో కాంగ్రెస్ భారీ విజయం ● మూడో విడత పోలింగ్ 17న

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియడంతో, అధికారులు పోలింగ్‌కు సన్నద్ధమవుతున్నారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ విడతలో ఇప్పటికే 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,911 సర్పంచ్ స్థానాలకు 14వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ స్థానాలకు దాదాపు 28,278 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. అనంతరం 2 గంటల నుంచి కౌంట్ ప్రక్రియ ప్రారంభం కానుంది.
ఇదిలా ఉండగా, ఇటీవల ముగిసిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. మొత్తం 3,834 సర్పంచ్, 27,600కు పైగా వార్డులకు జరిగిన తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అద్భుతమైన సత్తా చాటారు.తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఏకంగా 2,872 స్థానాల్లో విజయం సాధించారు. పల్లెపోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని ప్రకటించినా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మద్దతుదారులు కేవలం 1,160 స్థానాల్లో మాత్రమే గెలుపొందారు.
బీజేపీ మద్దతుదారులు దారుణంగా కేవలం 195 స్థానాలకే పరిమితమయ్యారు. 460 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయం సాధించారు. తొలి విడత ఎన్నికల సందర్భంగా, కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు, తొలి విడత ఫలితాల జోరుతో రెండో విడత పోలింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక మూడో విడత ఎన్నికలకు పోలింగ్ ఈనెల 17న జరుగనుంది.

# నాకు తెలియకుండానే అఖండ 2 మూవీ టికెట్ల ధరలపెంపు

● ఇందుకు సంబంధించిన జీవో విడుదలైంది ● సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ-2 తాండవం' మూవీ టికెట్ల ధరల పెంపు, ప్రీమియర్ షోల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ సినిమా టికెట్ల ధరల పెంపుపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తనకు తెలియకుండానే టికెట్ల ధరలపెంపుకు సంబంధించిన జీవో విడుదలైందని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. టికెట్ల రేట్లు పెంచొద్దని గతంలోనే అనుకున్నామని ఈ విషయాన్ని అసెంబ్లీలోనే చెప్పామన్నారు. కానీ ఈసారి పొరపాటు జరిగిందన్నారు. ఇవాళ ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన మంత్రి.. గత రాత్రే హోం సెక్రటరీతో తాను మాట్లాడానని ఇకపై టికెట్ల ధరల పెంపు, ప్రీమియర్ షోల విషయంలో ఎలాంటి అప్లికేషన్లు తీసుకోవద్దని, నా దృష్టికి తీసుకురాకుండా ఎవరూ ధరలను పెంచవద్దని ఆదేశాలు ఇచ్చానన్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లామన్నారు. ఇకపై సినిమా టికెట్ల ధరలు పెంచేది లేదని నిర్మాతలు, డైరెక్టర్లు ఎవరూ టికెట్ల ధరలు పెంచాలని మా వద్దకు రావొద్దన్నారు. కుటుంబం సినిమాలు చూడాలంటే టికెట్ల ధరలు తగ్గాలని అన్నారు. ఇది ఇందిరమ్మ ప్రభుత్వం పేదల కోసమే మా నిర్ణయాలు ఉంటాన్నారు. హీరోలకు వందల కోట్ల రెమ్యూనరేషన్లు ఎవరు ఇవ్వమన్నారని ప్రశ్నించారు. అయితే అఖండ-2 సినిమా టికెట్ల ధరలు పెంపు, ప్రీమియర్ షోలకు అనుమతి ఇస్తు తెలంగాణ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అయితే ఈ జీవోపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ ధర్మాసనం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. సింగిల్ బెంచ్ తీర్పుపై చిత్ర నిర్మాణ సంస్థ డివిజన్ బెంచ్?కు అప్పీల్ చేసుకుంది. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై ఈనెల 14 వరకు స్టే విధిస్తూ తదుపరి విచారణ ఈ నెల 15కు వాయిదా వేసింది.

# నేను ఏదో ఒక రోజు సీఎం అవుతా..

వారి చిట్టా విప్పుతా.. కవిత మాస్ వార్నింగ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నాకు కూడా టైం వస్తుంది.. నేను కూడా ఏదో ఒక రోజు సీఎం అవుతనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను సీఎం అయితే 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపై విచారణ చేయిస్తానని తెలిపారు.. తనపై ఆరోపణలు చేసిన వారికి లీగల్ నోటీసులు పంపుతనని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతల అవినీతిపై ఇంకా చిట్టా విప్పలేదు.. ఇది కేవలం టాస్ మాత్రమే అన్నారు. దీనికే ఉలిక్కి పడితే ఎలా? త్వరలోనే మీ అవినీతి, అక్రమాలపై టెస్ట్ మ్యాచ్ ఉండబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతిని తనపై రుద్దే ప్రయత్నం చేయొద్దని.. తప్పుడు ఆరోపణలు చేస్తే ఒక్కొక్కడి తోలు తీస్తా అన్నారు.
హిల్ట్ పాలసీకి కిటికీలు తెరిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అని.. గతంలో బీఆర్ఎస్ బాటలు వేస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ రహదారులు వేస్తోందని కవిత ఆరోపించారు. "కేటీఆర్ హయాంలో అనేక చెరువులు ప్రైవేట్ బిల్డర్లకు డెవలప్ మెంట్ కోసం ఇచ్చారు. అందులో ఉస్మాన్ కుంట చెరువును ప్రణీత్ బిల్డర్స్ కు ఇచ్చారు. ఇందులో మాధవరం కృష్ణారావు కొడుకు డైరెక్టర్ గా ఉన్నారు. మాధవరం కృష్ణారావు వెనుక ఉన్న గుంట నక్కను మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఈ పదేళ్లలో నేను, నా భర్త కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లబ్ధిపొందలేదు. మీకు దమ్ముంటే నేను మీ మీద చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వాలి. వెక్కిలి చేష్టలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. అవసరం అయినప్పుడు నా నగలు కుదువ పెట్టి బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించాను. తాను హరీశ్ రావుపై ఆరోపణలు చేస్తే బీజేపీ ఎందుకు మాట్లాడుతోంది." అని కవిత ప్రశ్నించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు..

సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్‌రావు..



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సిట్ ఎదుట లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిట్ ఎదుట హాజరయ్యారు. వారం రోజుల పాటు కస్టోడియల్ విచారణకు సుప్రీంకోర్టు అనుమతించింది. విచారణకు ప్రభాకర్‌రావు సహకరించడం లేదని సిట్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు సెల్‌ఫోన్ పాస్ వర్డ్‌లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి ఉన్న డేటాను ధ్వంసం చేయించారని ఫిర్యాదు చేశారు. ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేశారన్న విషయాన్ని ప్రభాకర్ దాచి పెట్టారని సిట్ కోర్టుకు వివరించింది. కస్టోడియల్‌లో విచారణలో పూర్తి విషయాలు వెలుగులోకి వస్తాయని.. ముందస్తు బెయిల్ రద్దు చేసి కస్టోడియల్ విచారణకు అనుమతించాలని కోరింది. దీంతో ముందస్తు బెయిల్‌ను సడలించిన సుప్రీం కోర్టు ప్రభాకర్‌రావును కస్టోడియల్ విచారణకు అనుమతించింది.. నేటి నుంచి వారంపాటు ప్రభాకర్‌రావును కస్టోడియల్ విచారణ చేయనున్నారు. కాగా.. ఇటీవల సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ.. 'కోర్టు పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పించడం వల్ల దర్యాప్తునకు సహకరించట్లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీనిపై మీరేమంటారు'అనిప్రభాకర్‌రావు తరఫున న్యాయవాది రంజిత్ కుమార్‌ను ప్రశ్నించారు. పిటిషనర్ దర్యాప్తునకు సహకరిస్తున్న విషయాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. ఆ అఫిడవిట్‌ను మంగళవారం సాయంత్రం 4 గంటలకు దాఖలు చేయడంతో పరిశీలించలేదని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బుధవారం జరిగిన విచారణ సందర్భంగా చెప్పారు. ఇరువైపులా వాదనల అనం తరం సిట్ అధికారి ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోవాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

ఎన్నికల్లో ఓటమి..

# సెల్ టవర్ ఎక్కి నిరసన..!

● రిగ్గింగ్ ఆరోపణలతో మాలోతు రంగా ఆగ్రహం
● హర్యా తండాలో ఉద్రిక్తత, పోలీసులు రంగంలోకి ● అభ్యర్థిని కిందకు దింపేందుకు పోలీసులు ప్రయత్నాలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : స్థానిక పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఖమ్మం జిల్లాలోని హర్యా తండాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాలోతు రంగా అనే వ్యక్తి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఎన్నికల్లో ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆయన, నిరసన వ్యక్తం చేస్తూ ఏకంగా సెల్ టవర్ ఎక్కారు. సెల్ టవర్ పై నుంచి మాలోతు రంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం తాను భారీగా ఖర్చు పెట్టానని, అయితే తమ ప్రత్యర్థి పార్టీ వారు రిగ్గింగ్‌కు పాల్పడి అక్రమంగా విజయం సాధించారని తీవ్రంగా ఆరోపించారు. మాలోతు రంగా సెల్ టవర్ పై నుంచి కిందకు దిగేందుకు ససేమిరా అంటుండటంతో హర్యా తండాలో టెన్షన్ వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఓటమి చెందిన అభ్యర్థిని సురక్షితంగా కిందకు దింపేందుకు పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.




# మేడారం దేవాలయం

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి ● పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలి ● సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించిన మంత్రులు ● సమ్మక్క సారాలమ్మలను దర్శించుకున్న సందర్భంగా మంత్రులు పొంగులేటి, సీతక్క



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మేడారం సమ్మక్క ,సారక్కలను దర్శించుకున్న రాష్ట్ర మంత్రి వర్యులు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను పరిశీలించారు. మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను, నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. శుక్రవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను, దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను,జంపన్న వాగు వద్ద పనులను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.



ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి ,పూజారులు, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ కేంద్ర మంత్రి మృతి పట్ల మంత్రి పొన్నం సంతాపం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శివరాజ్ పాటిల్ మృతి పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ,మన్మోహన్ సింగ్ క్యాబినెట్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారనీ గుర్తు చేసుకున్నారు.ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు,ఆయన అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### శివరాజ్ పాటిల్ మృతి పార్టీకి తీరని లోటు

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్




తెలంగాణ బ్యూరోప్రతినిధిః మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శివరాజ్ పాటిల్ మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. లోకసభ స్పీకర్ గా, కేంద్ర మంత్రిగా, గవర్నర్ గా శివరాజ్ పాటిల్ అనేక పదవులు నిర్వహించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రార్థించారు.

# ఏఐ టెక్నాలజీని విస్తరించాలి

మంత్రి శ్రీధర్ బాబు అభినందనలు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దేశంలోనే తొలిసారి ఆర్టిఫిషియల్ ఇటిలిజెన్స్ (ఏఐ) పై పుస్తకాలు రాసిన జర్నలిస్టు స్వామి ముద్దం ను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఏఐ ఫర్ యంగ్ మైండ్స్, ఏఐ ఇన్ మోడరన్ జర్నలిజం,ఆధునిక జర్నలిజం ఏఐ వంటి పుస్తకాలలను ముద్దం స్వామి మంత్రి శ్రీధర్ బాబుకు అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏఐ పుస్తకాల ఆవిష్కరణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర స్థాయిలో విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏఐ టెక్నాలజీ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎన్ ప్రీతం, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, మాచర్ల కుమారస్వామి, బిజిగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఏ పార్టీల్లో ఉన్నా యాదవులంతా ఒక్కటే

● యూపీ మాజీ సీఎం అఖిలేశ్ ● యాదవ సంఘాల సమ్మేళన కార్యక్రమానికి హాజరు

హైదరాబాద్ : యాదవ సంఘాల సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేర్వేరు పార్టీల్లో ఉన్నా యాదవులంతా ఒక్కటేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అఖిలేశ్ యాదవ్ చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలుసుకున్నట్లు చెప్పుకొచ్చారు. తెలంగాణలో ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పర్యటిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నేతలను కలుస్తూ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నారు. జూబ్లీ హిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన అఖిలేశ్.. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయి రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు.

భేటీ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేశ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు. ఆ తర్వాత కాసేపటికి నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి అఖిలేశ్ యాదవ్ చేరుకోగా బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావుతో భేటీ అయ్యారు.

తెలంగాణ తాజా రాజకీయ అంశాలపై నేతలంతా చర్చించారు. అనంతరం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు చేరుకున్న అఖిలేశ్.. యాదవ సంఘాల సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేర్వేరు పార్టీల్లో ఉన్నా యాదవులంతా ఒక్కటేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలుసుకున్నట్లు చెప్పుకొచ్చారు.

సదర్ సమ్మేళనానికి గొప్పగా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూపీలో బీజేపీని వెనక్కి నెడుతున్నామని.. ఏపీ సపోర్ట్ లేకపోతే కేంద్రంలో బీజేపీ వచ్చేది కాదని అఖిలేష్ యాదవ్ తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డితో భేటీ** : సీఎం రేవంత్ రెడ్డి తో జూబ్లీ హిల్స్ నివాసం లో



మర్యాదపూర్వకం గా భేటీ అయిన ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్. తాజా రాజకీయ పరిస్థితుల పైన చర్చ. తెలంగాణ లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్ కు వివరించిన సీఎం. సమావేశం లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,రామగుండం ఎంఎల్ ఏ రాజ్ ఠాకూర్,కాంగ్రెస్ సీనియర్ నేత రోహిన్ రెడ్డి.

## సీఎం రేవంత్ రెడ్డితో అఖిలేష్ యాదవ్ భేటీ

సదర్‌పై ప్రభుత్వ పండుగ, సంతృప్తి వ్యక్తం చేసిన అఖిలేష్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ శుక్రవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి తో జూబ్లీ హిల్స్ నివాసం లో మర్యాదపూర్వకం గా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితుల పైన చర్చలు జరిపారు. తెలంగాణ లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్ కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. యాదవ్ లకు ఎంతో ఇష్టమైన సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తిస్తు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని అఖిలేష్ యాదవ్ ప్రశంసించారు. దేశం లోని యాదవ సమాజం రేవంత్ రెడ్డి ని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఆయన అన్నారు. యాదవుల హృదయం లో రేవంత్ రెడ్డి ఉండిపోతారని అఖిలేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.తెలంగాణ లో ని యాదవ వర్గానికి రాజకీయంగా మంచి గుర్తింపు ఇస్తున్నందుకు ఆయన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ భేటీలో పాల్గొన్న వారిలో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎంఎల్ ఏ రాజ్ ఠాకూర్, తదితరులు ఉన్నారు.



# కాంగ్రెస్ పతనం ఇక ఖాయం

● పల్లెల నుంచే ఇక కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ షురూ!
● ఎక్స్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచక పర్వాన్ని ఎదుర్కొన్నారని పార్టీ శ్రేణులకు కేటీఆర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా గులాబీ సైనికులందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు చెప్పారు.

తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన చోట కనీసం 44 శాతం సీట్లను కాంగ్రెస్ పార్టీ దాటకపోవడం.. ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శమన్నారు. పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగిందని తెలిపారు. కానీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాల ద్వారా రుజువైందని స్పష్టం చేశారు. తొలి విడత పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు హోరాహోరీగా పోరాడి.. సర్పంచులు, వార్డు మెంబర్లుగా గెలిచారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచక పర్వాన్ని ఎదుర్కొన్నారంటూ వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా గులాబీ సైనికులందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల కోసం సాక్షాత్తూ ముఖ్యమంత్రే జిల్లాల్లో పర్యటించి ప్రచారం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇక ప్రత్యామ్నాయం కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని తొలిదశ పంచాయతీ ఫలితాల ద్వారా స్పష్టమైందన్నారు.

రానున్న మూడేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. పల్లెల్లో పైసా అభివృద్ధి పని జరగదని గ్రామస్తులు ఒక నిర్ధారణకు వచ్చేశారని చెప్పారు. అందువల్లే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇంతటి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని వివరించారు. సగం స్థానాలు కూడా కాంగ్రెస్ గెలవకపోవడం.. పలు ప్రాంతాల్లో 10, 20 ఓట్ల తేడాతోనే బయటపడటం చూస్తే కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ పల్లెల నుంచే ప్రారంభమైందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రెండేళ్లు గడిచినా ఆరు గ్యారెంటీల పేరిట.. పెన్షన్ల పెంపు, మహాలక్ష్మి, తులం బంగారం హామీ పేరిట చేసిన నయవంచనను గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా మరిచిపోలేదని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయన్నారు. యూరియా బస్తాల కోసం నెలల తరబడి పడిన అగచాట్లు, బోనస్ పేరిట చేసిన బోగస్ హామీ, చివరికి పండించిన పంటను అమ్ముకో లేక పడ్డ కష్టాలను అన్నదాతలు గుర్తు పెట్టుకున్నారని ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు.

# దువ్వాడ మాధురి అరెస్ట్?

హైదరాబాద్ : వైసీపీ నాయకుడు, వివాదాస్పద ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సహజీవన చారిణి దువ్వాడ మాధురిని హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం ఉదయం అరెస్టు చేసినట్టు తెలిసింది. గురువారం ఆమె పుట్టిన రోజు కావడతో మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో మాధురి బర్త్ డే పార్టీ ఇచ్చారు. దీనికి పలువురు వైసీపీ నాయకులు, ఇతర పార్టీలకు చెందిన వారు కూడా హాజరయ్యారు.అయితే.. ఈ పార్టీకి సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం.. మద్యం తాగి చిందులు వేయడం, ఆర్కెస్ట్రా, డీజేలు పెట్టడంపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శుక్రవారం తెల్లవారు జామునే ఫామ్ హౌస్‌పై దాడి చేసిన రాజేంద్రనగర్ ఎస్ వోటీ పోలీసులు.. మాధురి సహా పలువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదేసమయంలో పార్టీలో వినియోగించిన మద్యం సీసాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.బర్త్ డే పార్టీలో స్మగుల్డ్ విదేశీ మద్యాన్ని వినియోగించినట్టు తెలిసింది. ఆ సీసాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం సేవించి బర్త్ డే పార్టీ నిర్వహించుకున్నారని పోలీసులు తెలిపారు. దీనిపై తమకు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఇక, పార్టీలో మత్తు పదార్థాల వినియోగంపైనా దృష్టి పెట్టారు.



అయితే.. అలాంటివేవీ లేదని తెలిసింది.వైసీపీ నాయకుడైన దువ్వాడ శ్రీనివాస్.. మాధురిని రెండో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తీవ్ర వివాదాలు కూడా జరిగాయి. 2024లో తన కుటుంబాన్ని విడిచిపెట్టి దువ్వాడ మాధురి నిపెళ్లి చేసుకున్న శ్రీనివాస్.. విడిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె బిగ్‌బాస్ షోలో కూడా పాల్గొన్నారు.

# రేషన్ బియ్యంలో నూకలు, దొడ్డు బియ్యం

● లబ్దిదారుల ఆందోళన ● ఈ నవంబర్లోనూ ఇదే తీరు ● పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న అధికారులు





తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ లో రేషన్ బియ్యంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే పథకాలే ఆధారం. నిత్య జీవితంలో వారు ఎదుర్కొంటున్న ఎన్నో ఇబ్బందుల నుంచి ఒడ్డుకు చేరుస్తాయి. ఆ పథకాల లిస్టో చాలా ప్రముఖమైనది రేషన్ బియ్యం. పేదలు కూడా సన్నబియ్యం తిన్నాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. అంతే కాకుండా అర్హులైన వారందరికి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించింది. అప్పటి నుంచి పేదలతో అందరూ రేషన్ బియ్యం తినడం అలవాటు చేసుకున్నారు. కానీ ఈ రేషన్ బియ్యంతో ఇప్పుడు నూకలు, దొడ్డు బియ్యం కనిపిస్తున్నాయి.

ఆందోళనలో లబ్దిదారులు : జగిత్యాల అర్బన్ మండలంలో ఓ రేషన్ దుకాణం లబ్ధిదారుకు అందించిన సన్న బియ్యంలో 30 శాతం వరకు నూకలున్నాయి. 5 శాతం వరకు దొడ్డు బియ్యం వచ్చాయి. రేషన్ డీలర్లను ఇదే విషయం అడిగితే మాకు గోదాముల నుంచి వచ్చినవే ఇస్తున్నామని చెబుతున్నారు. గత నెలలోనూ ఇలాగే వచ్చినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. చాలా మంది దొడ్డు రేషన్ బియ్యం తినలేక, ఎక్కువ ధరకు బయటి మార్కెట్లలో తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం సన్న బియ్యం ఉచితంగా ఇస్తుందన్నపుడు చాలామంది సంతోషపడ్డారు. బియ్యం ఖర్చు మిగిలిందని ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు జగిత్యాల మండలంలో బియ్యం చూశాక లబ్ధిదారుల ఆనందం ఆవిరైంది. జిల్లాలో 592 రేషన్ దుకాణాలుండగా ఆహారభద్రత, అంత్యోదయ కార్డులు కలిసి 348,058 ఉన్నాయి. ప్రతి నెలా దాదాపు 6,391 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. అయితే రేషన్ బియ్యంతో దొడ్డు బియ్యం, నూకలు ఎవరు కలిపి ఉంటారన్న చర్చ మొదలైంది.

కల్తీ మిల్లులోనే జరుగుతుందా?

సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ద్వారా ప్రభుత్వం ధాన్యాన్ని మర ఆడించేందుకు మిల్లర్లకు ఇస్తోంది. వారు బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థకు అప్పగిస్తారు.

బియ్యాన్ని గోదాములకు తీసుకువచ్చే సమయంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించాల్సి ఉంటుంది. కానీ మిల్లర్లు ఇచ్చే మాముళ్లను తీసుకొని ఎలాంటి పరీక్షలు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

అదే సమయంలో సన్న బియ్యంలో నూకలు, దొడ్డు కలుపుతున్నరానే విమర్శలున్నాయి. నవంబర్ నెలలోనూ సన్న బియ్యంలో నూకలు వచ్చాయని డీలర్లు ఆందోళనను వ్యక్తం చేశారు.ప్రభుత్వంపై చెడు అభిప్రాయం రావచ్చు : ముఖ్యంగా పెద్దపల్లి నుంచి వచ్చే బియ్యమే కల్తీ జరుగుతున్నట్లు డీలర్లు గుర్తించారు. బియ్యాన్ని పరిశీలించకుండా ఎలా రేషన్ దుకాణాలకు పంపుతారని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రభుత్వంపై చెడు అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. అధికారులు పర్యవేక్షించి నూకలు రాకుండా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని డీలర్లు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై పౌర సరఫరాల శాఖ అధికారులు కూడా స్పందించారు.

వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. " రేషన్ బియ్యంలో నూకలు వచ్చినట్లు నా దృష్టికి రాలేదు. దుకాణాలను పరిశీలించి నూకలు ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటాం.

దుకాణాల్లో పరిశీలించి నూకలుంటే ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మరోసారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం " అని జగిత్యాల జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం ప్రసాద్ తెలిపారు.

## ఐసిసిసిలో ఫిట్నెస్ సెంటర్ ప్రారంభించిన డిజిపి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కమాండ్ %డ% కంట్రోల్ సెంటర్ లో అత్యాధునిక ఫిట్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం నాడు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ సిటీ పోలీస్, తెలంగాణా సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణా ఈగల్ ఫోర్స్ మరియు టిజిఐసిసి వంటి పనిచేసే యూనిట్లలోని సిబ్బంది శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం మెరుగుపరచడానికి ఈ కొత్త సెంటర్ను సిద్ధం చేశారు. 1900 చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పబడిన ఈ ఫిట్‌నెస్ సెంటర్లో అత్యాధునిక కార్డియో, స్ట్రెంథ్-ట్రైనింగ్ మరియు కండిషనింగ్ పరికరాల సముదాయం ఉంది. ఇందులో ట్రెడ్‌మిల్స్, లాట్ పుల్-డౌన్ యంత్రాలు, మల్టీఫంక్షనల్ వి-షేప్ ట్రైనర్‌లు, వర్టికల్ చెస్ట్-ప్రెస్ యూనిట్లు, ఒలింపిక్ ఎఫ్ఐడి బెంచీలు, సూపర్ బెంచీలు మరియు ఇతర వృత్తిపరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. క్రమబద్ధమైన శిక్షణకు మద్దతుగా, సంపూర్ణ శారీరక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ కేంద్రంలో టేబుల్ టెన్నిస్ సౌకర్యంతో పాటు వర్కౌట్ జోన్‌లు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణా పోలీస్ శాఖలోని పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. డైరెక్టర్, తెలంగాణా సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖా గోయల్ , కమీషనర్ ఆఫ్ పోలీస్ వి సి సజ్జనార్ , డైరెక్టర్, టీజీఐసీసీ విబి కమలాసన్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీస్, సైబరాబాద్ అవినాష్ మహంతి, డీఐజీ, తెలంగాణా ఈగల్ ఫోర్స్ అభిషేక్ మహంతిబీ ఎస్పీ, టీజీఐసీసీ పుష్ప మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిజిపి శ్రీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ....సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చిన టీజీఐసీసీ అధికారులను అభినందించారు. ఇటువంటి చర్యలు సిబ్బందిలో నైతిక స్థైర్యాన్ని బలోపేతం చేసి, పోలీసింగ్ విభాగంలో నిరంతర ఉత్తమ పనితీరుకు దోహదపడతాయని పేర్కొన్నారు.



## భారత రాష్ట్రపతి
# తెలంగాణ పర్యటన

మంత్రి సీతక్క 'మినిస్టర్-ఇన్-వైటింగ్'గా నియామకం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముడిసెంబర్ 17 నుండి 22 వరకు తెలంగాణలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ను రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి లిమినిస్టర్-ఇన్-వైటింగ్‌లిగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

## సాయి ఈశ్వర చారి కుటుంబాన్ని
# ఆదుకుంటాం

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ● ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయల చెక్కు అందజేత



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరచారి కుటుంబాన్ని పరామర్శించిన టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ లు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు. ఎవ్వరూ ఇలాంటి నిర్ణయాలు తీసుకోరాదు. బీసీ రిజర్వేషన్లను తప్పక సాధిస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం మీతో ఉంది" అని భరోసా ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. వీరితోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు ,చైర్మన్ లు పరామర్శించారు.

## మెస్సీ - రేవంత్ నడుమ ఫుట్ బాల్ మ్యాచ్
## తిలకించేందుకు రాహుల్ గాంధీ రాక




హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో డిసెంబర్ 13న 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనే కార్యక్రమం జరుగబోతుంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు.హైదరాబాద్: నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనేది ఓ ప్రేవేట్ ఈవెంట్ అయినప్పటికీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా హాజరు కావాల్సిందిగా కోరినట్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు ముఖ్యమంత్రి అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈనెల 13న హైదరాబాద్ వస్తున్నారని.. ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎం చెప్పారు.

ఈ కార్యక్రమానికి తననూ ప్రత్యేక అతిథిగా పిలిచారని.. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధం లేని ఈవెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. అయితే, ఈ కార్యక్రమంలో మెస్సీ వర్సెస్ రేవంత్ రెడ్డి జట్లు 5 నిమిషాలపాటు మ్యాచ్ ఆడనున్నారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వస్తున్నారా, లేదా? అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

## ఆటకే అందం తెచ్చిన ఆటగాడు మెస్సీ



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ప్రపంచ ఫుట్బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అతను సాధించిన రికార్డులు చెప్పుకోవడానికే రోజులు పడుతుంది. ఆధునిక ఫుట్బాల్లో అతనొక ప్రత్యేకమైన క్రీడాకారుడు. అంతర్జాతీయ వేదికల మీదనే కాకుండా.. క్లబ్ మ్యాచులలో కూడా ఎన్నో అసాధారణ ఘనతలు సాధించి ఫుట్బాల్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు సంపాదించుకున్నాడు. లియోనల్ మెస్సీ పూర్తి పేరు లియోనల్ ఆండ్రస్ మెస్సీ. 24 జూన్ 1987లో అర్జెంటినాలో జన్మించాడు. తండ్రిపేరు జార్జ్ మెస్సీ, తల్లి మారియా. చిన్నప్పటినుంచే మెస్సీ క్రీడలపై ఆసక్తి చూపేవాడు. మెస్సీని ఫుట్బాల్ క్రీడాకారుడిగా తీర్చి దిద్దడంలో అతని అమ్మమ్మ కీలక పాత్ర పోషించింది. మెస్సీ శిక్షణకు, మ్యాచులకు ఆమె తోడుగా వెళ్లడంతో పాటు, డబ్బులు ఇస్తుండేది. మెస్సీకి పదకొండు సంవత్సరాల వయసున్నప్పుడు ఆమె మరణించింది. ఆమె మరణాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఆ తర్వాత చాలా ప్రమాదకరమైన వ్యాధితో మెస్సీ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో చికిత్స దొరక్క చాలా ఇబ్బందులు పడ్డాడు. కుటుంబమంతా శ్రమించి అతని వైద్యానికి డబ్బులు సమకూర్చేది. దాదాపు చావు అంచుల్లోకి వెళ్లిన మెస్సీకి.. బార్సీలోనాకు చెందిన కోచ్ సాయం చేశాడు. బదులుగా బార్సీలోనా జట్టుకు మెస్సీ ఆడాల్సి ఉంటుందని కండిషన్ పెట్టాడు. దీనికి మెస్సీతో పాటు కుటుంబం మొత్తం అంగీకరించింది. మెస్సీ కోలుకున్న తర్వాత కుటుంబం మొత్తం స్పెయిన్కు షిఫ్ట్ అయింది. 2003లో మెస్సీ తన మొదటి ఫుట్బాల్ మ్యాచ్ ఆడారు. మెస్సీ ప్రదర్శనకు అవక్కాయిన సెలక్టర్లు.. అంతర్జాతీయ మ్యాచ్లో ఆడే అవకాశం కల్పించారు. 17 ఆగస్టు 2007న మెస్సీ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత మెస్సీ ఎప్పుడూ వెనుదిరిగి చూడలేదు. ఒకదాని తర్వాత ఒకటి సాధించుకుంటూ వెళ్లాడు. రికార్డులు సృష్టించాడు. 2012లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. గిన్నిస్ వరల్డ్ రికార్డులోనూ చోటు దక్కించుకుంటున్నాడు. 2022 ఫిఫా ప్రపంచ కప్, ఒలింపిక్ స్వర్ణం, అనేక క్లబ్, వ్యక్తిగత ట్రోఫీలు గెలుచుకున్నాడు. ప్రస్తుతం అతన్ని ఫుట్బాల్ రారాజుగా క్రీడా లోకం పిలుచుకుంటోంది. ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్న క్రీడాకారుడు హైదరాబాద్కు వస్తుండటం, ఇక్కడ ఓ మ్యాచ్ ఆడుతుండటం అందరినీ ఆకట్టుకుంటోంది. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే మెస్సీతో మ్యాచ్ ఆడాలనుకోవడం మెస్సీ గొప్పతనానికి నిదర్శనం.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## అపరకుబేరులున్నా పేదవాళ్ళ దేశం భారత్!

ప్రముఖ ఆర్థికవేత్తలు థామస్ పికెట్టీ, లూకాస్ చాన్సెల్ వంటి ప్రముఖుల ఆధ్వర్యంలో వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ఇటీవల విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక అసమానతల నివేదిక 2026, భారతదేశంలో నెలకొన్న తీవ్ర అసమానతలను మరోసారి స్పష్టం చేసింది. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్ ప్రయత్నిస్తున్నప్పటికీ, ఈ వృద్ధి యొక్క ఫలాలు కొద్దిమంది సంపన్నులకే పరిమితం అవుతున్నాయనే చేదు నిజాన్ని ఈ నివేదిక తేటతెల్లం చేసింది. ఈ నివేదిక ప్రకారం, ప్రపంచంలో అత్యధిక అసమానతలు ఉన్న దేశాలలో భారత్ ఒకటిగా నిలిచింది, ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో లోతైన అంతరాలను సూచిస్తోంది.

నివేదిక ప్రకారం, భారతదేశంలో సంపద మరియు ఆదాయ అసమానతలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. దేశంలోని అత్యంత ధనవంతులైన 1 శాతం మంది వద్ద దేశ మొత్తం సంపదలో దాదాపు 40 శాతం వాటా పోగుపడింది, కాగా అత్యంత సంపన్నులైన 10 శాతం మంది వద్ద దేశ మొత్తం సంపదలో దాదాపు 65 శాతం వాటా కేంద్రీకృతమై ఉంది. దీనికి విరుద్ధంగా, పేద మరియు మధ్యతరగతికి చెందిన దిగువ 50 శాతం మంది వద్ద కేవలం 15 శాతం సంపద మాత్రమే ఉంది. ఆదాయం విషయంలోనూ, దేశంలోని అత్యధిక ఆదాయం పొందుతున్న 10 శాతం మంది జాతీయ ఆదాయంలో 58 శాతం వాటాను తమ ఖాతాలో వేసుకుంటుండగా, దిగువన ఉన్న 50 శాతం మందికి జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే దక్కుతోంది.

ఈ గణాంకాలు భారతదేశంలో పేదరికం యొక్క వాస్తవ పరిస్థితిని ఎత్తి చూపుతున్నాయి. సగటు తలసరి వార్షిక ఆదాయం ఉన్నప్పటికీ, ఈ సగటు లెక్కలు ధనవంతుల ఆదాయంతో పెరిగిపోయి, వాస్తవ పేదరిక పరిస్థితిని కప్పిపుచ్చుతున్నాయి. అంతేకాకుండా, ఈ నివేదిక స్త్రీ, పురుష అసమానతలపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం దాదాపు 15.7% వద్ద చాలా తక్కువగా ఉంది. గత దశాబ్ద కాలంలో ఈ పరిస్థితిలో ఎటువంటి మెరుగుదల కనిపించకపోవడం, లింగపరమైన అసమానతలు కూడా లోతుగా పాతుకుపోయాయని స్పష్టం చేస్తోంది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, దేశంలో అత్యధిక ఆదాయ వాటా కేవలం 1% మంది వద్ద పోగుపడటం అనేది, స్వాతంత్ర్యం రాకముందున్న బ్రిటిష్ రాజ్ కాలం నాటి ఆదాయ కేంద్రీకరణ స్థాయిలతో పోలిస్తే అత్యధికంగా ఉందని నివేదిక విశ్లేషించింది.

ఈ నివేదికలోని గణాంకాలపై అంతర్జాతీయ మరియు భారతీయ ఆర్థికవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ థామస్ పికెట్టీ వంటి ప్రముఖులు, ప్రపంచ అసమానతల పెరుగుదలను ఆందోళనకరమైన ధోరణిగా అభివర్ణించారు. సామాజిక మరియు వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడానికి, అసమానతలను తగ్గించే చారిత్రక ఉద్యమాన్ని కొనసాగించడం మునుపటి కంటే ఇప్పుడు మరింత అవసరమని ఆయన ఉద్ఘాటించారు.'భారత్‌లో అసమానతలు లోతుగా పాతుకుపోవడానికి కారణం పెట్టుబడి–కేంద్రీకృతమైన వృద్ధి విధానాలు కార్పొరేట్లకు మరియు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండటం వల్ల సంపద కేంద్రీకృతమవుతోందని' భారతీయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ జయతి ఘోష్ విమర్శించారు. నోబెల్ గ్రహీత జోసెఫ్ స్టిగ్లిట్జ్ సైతం, అసమానత ఉన్నంత వరకు, పేద ప్రజల అవకాశాలు అణచివేయబడుతూనే ఉంటాయని, సంపన్నులకు పన్ను రాయితీలు ఇస్తూ పేదరికాన్ని పెంచే విధానాలు సరైనవి కావని అన్నారు.

ఈ తీవ్ర అసమానతలను తగ్గించడానికి, ఆర్థికవేత్తలు ప్రభుత్వాలకు కొన్ని కీలకమైన విధానపరమైన మార్పులను సూచించారు. సంపన్నులపై, అత్యంత అధిక ఆదాయంపై ప్రగతిశీల పన్నులు (ఉదాహరణకు, వారసత్వ పన్ను, సంపద పన్ను) విధించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని వారు సూచించారు. తద్వారా ఆ నిధులను పేద ప్రజల సంక్షేమం, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయవచ్చు. అలాగే, మానవ మూలధనాన్ని పెంపొందించడానికి విద్య మరియు ఆరోగ్య రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచడం అత్యంత కీలకం. నాణ్యమైన విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తే, దిగువ వర్గాలు కూడా వృద్ధి ఫలాలను అందుకోగలరని వారు అభిప్రాయపడ్డారు. చివరిగా, మహిళా కార్మిక భాగస్వామ్యాన్ని పెంచడానికి లక్షిత పథకాలను రూపొందించడం మరియు స్త్రీ, పురుషుల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించడానికి కఠినమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఆదాయ అసమానతలను తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు సూచించారు.

భారతదేశం ఆర్థిక అసమానతలను తగ్గించి, సమ్మిళితాభివృద్ధిని సాధించడానికి సమగ్రమైన, బహుళ రంగాల వ్యూహాన్ని అమలు చేయాలి. కేవలం వృద్ధి రేటుపై దృష్టి పెట్టడం కాకుండా, వృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు కూడా చేరేలా విధానాలను రూపొందించాలి. దీనికి మొదటి అడుగు, ఆదాయ పునఃపంపిణీని లక్ష్యంగా చేసుకున్న అధికశాతం పన్నుల విధానాన్ని పటిష్టం చేయడం. అత్యంత సంపన్నులు మరియు బిలియనీర్లపై అధిక పన్నులు విధించడం, వారసత్వ సంపదపై పన్నులు ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలి. తద్వారా సమకూరిన నిధులను సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం వంటి రంగాలపై దృష్టి సారించి, పేద మరియు మధ్యతరగతి వర్గాల కోసం కేటాయించాలి.

రెండవ కీలక చర్య మానవ వనరులలో భారీ పెట్టుబడులు పెట్టడం. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు నాణ్యతను పెంచడం ద్వారా, ముఖ్యంగా గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందడానికి వీలు కలుగుతుంది. ఉచిత లేదా తక్కువ ఖర్చుతో కూడిన వైద్య సేవలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై ఉన్న అనారోగ్య భారాన్ని తగ్గిస్తాయి. విద్య మరియు ఆరోగ్యంపై ఖర్చు చేయడం ద్వారానే పేదరికం మరియు సంపన్నత మధ్య ఉన్న అంతరాన్ని దీర్ఘకాలికంగా తగ్గించవచ్చు.

మూడవది, ఉపాధి కల్పన మరియు వేతన సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. వృద్ధి అనేది కేవలం పెట్టుబడి–ఆధారితం కాకుండా, శ్రమ–ఆధారితం అయ్యేలా చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. దీని కోసం వారికి సులభంగా రుణాలు, సాంకేతిక మద్దతు అందించాలి. గ్రామీణ ప్రాంతాలలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం కనీస వేతనాలను పెంచాలి మరియు వారికి సామాజిక భద్రతను కల్పించాలి. ఉపాధి లేమి మరియు తక్కువ వేతనాలు అనేవి అసమానతలకు ప్రధాన కారణాలు కాబట్టి, ఈ రంగంలో స్థిరమైన సంస్కరణలు అవసరం.

నాలుగవ ముఖ్యమైన అంశం లింగ (స్త్రీ, పురుష) అసమానతలను తొలగించడం. భారతదేశంలో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంది. దీనిని పెంచడానికి, మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం, వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన పని వాతావరణాన్ని కల్పించడం, మరియు పంపిణీ చేయబడని ఇంటి పనుల భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వ మద్దతుతో కూడిన శిశు సంరక్షణ కేంద్రాలను విస్తృతం చేయాలి. మహిళలు ఆర్థికంగా స్వతంత్రులు అయితేనే కుటుంబ ఆదాయం పెరిగి, దిగువ వర్గాలలో అసమానతలు తగ్గుతాయి.

చివరిది, పారదర్శకత మరియు అవినీతి నిరోధం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుకునేలా చూడాలి. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ చేయడం వంటి చర్యల ద్వారా సంక్షేమ పథకాలలో లీకేజీలను నివారించవచ్చు. ఈ చర్యలన్నీ కేవలం ఆర్థిక సంస్కరణలు మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మరియు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచే విధంగా ఉండాలి. ఈ సమగ్ర విధానాలను అమలు చేయడం ద్వారానే భారతదేశం స్థిరంగా, సమ్మిళితంగా అభివృద్ధి చెంది, ఆర్థిక అసమానతలను సమర్థవంతంగా తొలగించగలదు.

నిస్సందేహంగా, ప్రపంచ ఆర్థిక అసమానతల నివేదిక 2026 భారతదేశానికి ఒక బలమైన హెచ్చరిక. ఆర్థిక వృద్ధి రేటును సాధించడంతో పాటు, సంపద కేంద్రీకరణను తగ్గించడంలో ప్రభుత్వం విఫలమైతే, అది కేవలం ఆర్థిక సమస్యగానే కాక, సామాజిక అస్థిరతకు, మరియు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం తగ్గడానికి దారితీస్తుంది. కాబట్టి, భారతదేశం ఇకపై కేవలం సంపద సృష్టిపై మాత్రమే కాకుండా, విద్య, ఆరోగ్యం, మరియు ఉపాధి కల్పనలో భారీ పెట్టుబడుల ద్వారా సమాన అవకాశాల కల్పనపై దృష్టి సారించాలి. సంపన్నులపై ప్రగతిశీల పన్ను విధానాలను అమలు చేయడం, మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యాన్ని పెంచడం మరియు సంక్షేమ పథకాలలో పారదర్శకతను పెంచడం ద్వారా మాత్రమే, అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలను అరికట్టవచ్చు. ఈ సమగ్ర, సమ్మిళిత విధానాలను అమలు చేయడం ద్వారానే భారతదేశం తన వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిజమైన అర్థంలో సాధించి, ప్రపంచంలో ఆదర్శంగా నిలబడగలదు.

# పర్వతాల చాటున ...ప్రపంచాన్ని మార్చే శక్తులు!



తేజస్వి
హైదరాబాద్

నేటి అత్యాధునిక ప్రపంచంలో, సాంకేతికత, సైనిక శక్తికి అవసరమైన అరుదైన ఖనిజాలు, కీలక వనరుల కోసం ప్రపంచంలోని అగ్రరాజ్యాల మధ్య భౌగోళిక–రాజకీయ పోటీ తీవ్రంగా నడుస్తోంది. ఉత్తర ధ్రువంలోని మంచు కరుగుతున్న ఆర్కిటిక్ ప్రాంతంలో చైనా, రష్యా వంటి దేశాల మధ్య మైనింగ్ ఆధిపత్య పోరాటం జరుగుతుంటే, ఈ ప్రపంచ పోరాటం యొక్క ప్రభావం పరోక్షంగా మన దేశంలో అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థలపై కూడా పడుతోంది. ఎందుకంటే, అభివృద్ధి చెందుతున్న భారతదేశం తన సొంత మౌలిక సదుపాయాలు మరియు ఆర్థిక అవసరాల కోసం ఖనిజాల వెలికితీతను వేగవంతం చేయాలని చూస్తోంది. ఈ జాతీయ ఆవశ్యకత నేపథ్యంలోనే, మన దేశంలో అత్యంత పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణిలో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దాలుగా చట్టబద్ధంగా, అక్రమంగా జరిగిన మైనింగ్ కారణంగా ఆరావళి కొండలు ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్నాయి. అయితే, ఇటీవల సుప్రీంకోర్టు అరవళి కొండల నిర్వచనంపై ఒక కొత్త సాంకేతిక అంశాన్ని పరిశీలించడం, తద్వారా పర్వత శ్రేణిలోని పెద్ద భాగానికి చట్టపరమైన రక్షణ తొలగిపోయే ప్రమాదం ఏర్పడటంతో, ఈ సమస్య తాజాగా తెరపైకి వచ్చి పర్యావరణవేత్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

**ప్రపంచ శక్తి పోరాటం: అరుదైన ఖనిజాల గుత్తాధిపత్యం**

అరుదైన ఖనిజాలు అంటే స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, అధునాతన యుద్ధ పరికరాలకు కీలకమైన 17 రకాల మూలకాల సముదాయం. వీటి శుద్ధి మరియు ప్రపంచ సరఫరా గొలుసుపై చైనా దాదాపు 90% వరకు తిరుగులేని గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. ఈ ఖనిజాల ఉత్పత్తిని , శుద్ధి సాంకేతికతను చైనా నియంత్రిస్తోంది. ఈ గుత్తాధిపత్యాన్ని సవాలు చేయడానికే, అమెరికా మరియు దాని మిత్రదేశాలు, అలాగే రష్యా వంటి ఇతర శక్తులు కొత్త వనరులను, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను వెతకడంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

ఈ ప్రయత్నంలో భాగంగానే, చైనా తన రోడ్ నిర్మాణ కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఆఫ్రికా మరియు ఆసియాలోని అనేక దేశాలలో మైనింగ్ ప్రాజెక్టులకు నిధులు అందించి, ఆయా దేశాల వనరులపై పరోక్షంగా ఆర్థిక నియంత్రణ సాధిస్తోంది. ఖనిజాల వెలికితీతకు అధిక మూలధనం మరియు అత్యాధునిక సాంకేతికత అవసరం కావడంతో, చిన్న దేశాలు చైనా ఆర్థిక సహాయానికి మొగ్గు చూపుతున్నాయి. ఈ విధంగా, ఖనిజాల వేట కేవలం ఆర్థిక లావాదేవీలకు మాత్రమే కాకుండా, దేశాల మధ్య వ్యూహాత్మక ఆధిపత్య పోరాటానికి కూడా దారితీసింది.

**ఆర్కిటిక్ లో అరుదైన ఖనిజాల పోటీ :**



ఆర్కిటిక్ ప్రాంతం ప్రపంచ అరుదైన ఖనిజాల రేసులో అత్యంత కీలకమైన వేదిక. వాతావరణ మార్పుల కారణంగా మంచు కరిగిపోతుండటంతో, ఇక్కడ దాగి ఉన్న అపారమైన అరుదైన ఖనిజాల నిల్వలు ప్రపంచానికి అందుబాటులోకి వస్తున్నాయి. ఈ మార్పు కారణంగానే ఈ ప్రాంతం యొక్క భౌగోళిక–రాజకీయ ప్రాముఖ్యత పెరిగింది. ఆర్కిటిక్ వనరులపై నియంత్రణ సాధించడానికి అంతర్జాతీయంగా పోటీ పెరుగుతోంది.

ఈ ప్రాంతంలో రష్యా మరియు చైనాల మధ్య వైరుధ్యం ప్రత్యేకంగా గమనించదగినది. రష్యా ఆర్కిటిక్ తీరంపై భౌగోళికంగా, సైనికపరంగా ఆధిపత్యాన్ని కలిగి ఉంది. దీనికి తోడు, ఆర్కిటిక్‌లో రష్యాకు పెద్ద ఎత్తున ఖనిజ నిల్వలు ఉన్నాయి. అయితే, ఈ ఖనిజాలను సమర్థవంతంగా శుద్ధి చేసే అధునాతన సాంకేతికత రష్యాకు లేదు. దీనికి విరుద్ధంగా, చైనా ఒక ఆర్కిటిక్ దేశం కానప్పటికీ, పోలార్ సిల్క్ రోడ్ పేరుతో భారీ పెట్టుబడులు పెడుతోంది. ఖనిజాల వెలికితీత, శుద్ధి సాంకేతికతలో చైనాకున్న ప్రపంచ బలం కారణంగా, రష్యా తన సొంత వనరుల అభివృద్ధికి కూడా చైనాపై ఆధారపడక తప్పడం లేదు. ఇది దీర్ఘకాలంలో రష్యాపై చైనా ఆర్థికాధిపత్యానికి దారితీసే నిశ్శబ్ద పోటీని సూచిస్తోంది.

**మధ్య ఆసియాలో ఆధిపత్య పోరాటం:**

ఆర్కిటిక్‌తో పాటు, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్ వంటి మధ్య ఆసియా దేశాలు కూడా అరుదైన ఖనిజాల నిల్వలకు ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాంతం రష్యాకు తన చారిత్రక భద్రతా ప్రభావం గల ప్రాంతంగా ఉండగా, చైనాకు తన రోడ్ నిర్మాణ మార్గంలో కీలకంగా ఉంది. చైనా ఈ దేశాల్లోని అరుదైన ఖనిజాల మైనింగ్ ప్రాజెక్టులలో భారీగా పెట్టుబడి పెట్టి, తమ ఆర్థిక నియంత్రణను బలోపేతం చేసుకుంటోంది.

ఈ చర్యల ద్వారా చైనా, మధ్య ఆసియా ఆర్థిక వ్యవస్థలలో తన స్థానాన్ని స్థిరంగా పెంచుకుంటోంది. దీనికి ప్రతిగా, రష్యా తన సాంప్రదాయ భద్రతా ఒప్పందాల ద్వారా మరియు కొన్ని వ్యూహాత్మక ఖనిజాల శుద్ధి మరియు రవాణాపై ఉన్న నియంత్రణ ద్వారా తన ప్రభావాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ విధంగా, మధ్య ఆసియా దేశాలు చైనా ఆర్థిక శక్తి మరియు రష్యా భద్రతా శక్తి మధ్య నలిగిపోతూ, తమ వనరుల విషయంలో ఈ రెండు అగ్రశక్తుల మధ్య పోటీకి వేదికగా మారుతున్నాయి.

**ఆరావళి పర్వత శ్రేణి మైనింగ్**

ప్రపంచవ్యాప్తంగా వనరుల కోసం ఇలాంటి పోటీ నడుస్తుంటే, మన దేశంలో వాయువ్య ప్రాంతాన్ని థార్ ఎడారి విస్తరణ నుండి కాపాడుతున్న అత్యంత పురాతన పర్వత శ్రేణి అయిన ఆరావళి ఇప్పుడు మైనింగ్ వల్ల తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఈ కొండలు గుజరాత్ నుండి ఢిల్లీ వరకు విస్తరించి, దాదాపు 1.5 బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయి. ఈ శ్రేణి భారత ఉపఖండంలో ఒక ముఖ్యమైన భౌగోళిక లక్షణంగా ఉంది.

అరవళి పర్వత శ్రేణి భారతదేశానికి ఒక చారిత్రక వారసత్వం మాత్రమే కాదు, వాయువ్య భారతదేశ పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇవి థార్ ఎడారి నుండి వచ్చే వేడి, ఇసుకతో కూడిన గాలులు ఇండో–గంగా మైదానంలోకి, ముఖ్యంగా ఢిల్లీ–ఎన్సీఆర్ ప్రాంతంలోకి ప్రవేశించకుండా ఒక సహజ కవచం వలె పనిచేస్తాయి. అంతేకాక, ఈ కొండలు నైరుతి రుతుపవనాలను అడ్డగించి, వర్షపాతం పెంచడంలో సహాయపడతాయి.ముఖ్యంగా, ఢిల్లీ–ఎన్సీఆర్, హర్యానా మరియు రాజస్థాన్ ప్రాంతాలలో వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి, భూగర్భ జలాల నిల్వలు పెంచడంలో ఆరావళి కొండలు కీలకం. వీటిని ఆ ప్రాంతానికి ఊపిరితిత్తుల లాగా పరిగణించడం జరుగుతుంది. అపారమైన ఇనుము, రాగి, మరియు ఇతర నిర్మాణ ఖనిజాల నిల్వలు ఇక్కడ ఉన్నాయి. అయితే, ఈ ఖనిజాల కోసమే విచ్చలవిడిగా జరుగుతున్న మైనింగ్, ఈ పర్వత శ్రేణి అస్తిత్వాన్నే ప్రశ్నిస్తోంది. మైనింగ్ కారణంగా అడవుల నరికివేత, కొండల ఆకారం కోల్పోవడం జరుగుతోంది.



ఆరావళి కొండలు దశాబ్దాలుగా మైనింగ్ కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విధ్వంసంపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ, సమస్య కొనసాగుతూనే ఉంది. అయితే, ఈ వివాదానికి ప్రధాన కారణం, దీనికి తాజా ప్రాముఖ్యతను తెచ్చిన అంశం – సుప్రీంకోర్టు పరిశీలించిన ఒక కొత్త సాంకేతిక నిర్వచనం. ఈ నిర్వచనం ప్రకారం, స్థానిక మైదాన స్థాయి నుండి 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న శిఖరాలను మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని సూచించబడింది.

ఈ కొత్త నిర్వచనం ఆమోదించబడితే, పర్యావరణ నిపుణుల ప్రకారం, తక్కువ ఎత్తులో ఉన్న అరవళి శ్రేణిలోని సుమారు 90% ప్రాంతాల నుండి చట్టపరమైన పర్యావరణ రక్షణ తొలగిపోయే ప్రమాదం ఉంది. ఈ పరిణామాన్ని అదుపు చేయకపోతే, రక్షణ తొలగించబడిన వెంటనే మైనింగ్ మరియు రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఈ చట్టపరమైన సవాలే అరవళి మైనింగ్ సమస్యను మళ్లీ జాతీయ స్థాయిలో చర్చనీయాంశం చేసింది మరియు దీనిపై వెంటనే దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

ఖనిజాల నిల్వలు ఉన్న ప్రపంచంలోని ఇతర పర్వత ప్రాంతాలు

ప్రపంచంలో అరుదైన ఖనిజాలు మరియు ఇతర విలువైన ఖనిజ నిల్వలు హిమాలయాలు, ఆండీస్, రాకీ పర్వతాలు, మరియు పశ్చిమ కనుమలతో సహా అనేక పర్వత శ్రేణులలో ఉన్నాయి.

దక్షిణ అమెరికా (ఆండీస్ పర్వతాలు): చిలీ, పెరూ వంటి దేశాల్లోని ఆండీస్ పర్వత శ్రేణి ప్రపంచంలోనే అతిపెద్ద రాగి, లిథియం నిల్వలకు నిలయం. ఈ ఖనిజాల వెలికితీత ఈ దేశాల ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. ఇక్కడ మైనింగ్ ద్వారా సంపద సృష్టించబడి, పేదరికం తగ్గించడానికి ఆయా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

ఉత్తర అమెరికా (రాకీ పర్వతాలు): యునైటెడ్ స్టేట్స్ లోని రాకీ పర్వతాలలోనూ విలువైన ఖనిజాలు, అరుదైన లోహాలు ఉన్నాయి. ఇక్కడ మైనింగ్ పరిశ్రమ స్థానిక ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ముఖ్యంగా అమెరికా ప్రభుత్వం స్వదేశీ సరఫరా గొలుసును పెంచడానికి ఈ ప్రాంత మైనింగ్‌ను ప్రోత్సహిస్తోంది.

**భారత వ్యూహం:**

ప్రపంచవ్యాప్తంగా అరుదైన ఖనిజాల కోసం తీవ్ర పోటీ నెలకొన్న ఈ సమయంలో, భారతదేశం కేవలం దిగుమతులపై ఆధారపడకుండా, స్వదేశీ వనరులను అభివృద్ధి చేసుకుని, సాంకేతికతలో ముందంజ వేయాల్సిన అవసరం ఉంది. చైనా గుత్తాధిపత్యాన్ని సవాలు చేస్తూ, పర్యావరణ పరిరక్షణతో అభివృద్ధిని సమతుల్యం చేసుకోవడం భారత్‌కు అతిపెద్ద సవాలు.భారతదేశం





అరుదైన ఖనిజాలు (రేర్ ఎర్త్) మరియు లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల నిల్వలు కలిగి ఉన్న ధనిక దేశమే. అయితే, ఈ నిల్వలను వెలికితీసే మరియు శుద్ధి చేసే సామర్థ్యం ఇంకా తక్కువగానే ఉంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రభుత్వం రెండు ప్రధాన వ్యూహాలపై దృష్టి సారించాలి:

నిల్వల అన్వేషణను వేగవంతం చేయడం: తూర్పు కనుమలు, దక్కన్ పీఠభూమిలోని కొన్ని ప్రాంతాలు, మరియు హిమాలయాలలోని కొన్ని ప్రాంతాలలో అరుదైన ఖనిజాల కోసం భౌగోళిక సర్వే పనులను వేగవంతం చేయాలి. ఈ అన్వేషణ కోసం అత్యాధునిక డ్రోన్ మరియు రిమోట్ సెన్సింగ్ సాంకేతికతను ఉపయోగించాలి.

మైనింగ్ మరియు శుద్ధి సామర్థ్యం: భారతదేశం చైనాపై ఆధారపడకుండా, సొంతంగా రేర్ ఎర్త్ శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలి. దీని కోసం ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రోత్సహించాలి. స్థానికంగా మైనింగ్‌తో పాటు, శుద్ధి ప్రక్రియ చేపట్టడం ద్వారానే స్వయం సమృద్ధి సాధ్యమవుతుంది.

**సాంకేతికత మరియు రీసైక్లింగ్ పై దృష్టి:**

ఖనిజాలను వెలికితీయడం ఒక్కటే కాకుండా, వాటిని సమర్థవంతంగా వినియోగించడం, రీసైక్లింగ్ చేయడం నేటి పోటీ ప్రపంచంలో అత్యంత కీలకమైన అంశాలు.

రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం: భారతదేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు భారీగా ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో అరుదైన ఖనిజాలు పెద్ద మొత్తంలో ఉంటాయి. ఈ వ్యర్థాల నుండి విలువైన లోహాలను తిరిగి సేకరించే రీసైక్లింగ్ పరిశ్రమను బలోపేతం చేయాలి. రీసైక్లింగ్ అనేది కొత్త మైనింగ్‌పై ఒత్తిడిని తగ్గిస్తుంది, తద్వారా పర్యావరణాన్ని కూడా పరిరక్షిస్తుంది.

సాంకేతిక సహకారం: అరుదైన ఖనిజాలను శుద్ధి చేయడంలో చైనాకు ధీటుగా నిలబడటానికి, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా వంటి సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాలతో వ్యూహాత్మక సాంకేతిక సహకారం ఏర్పరచుకోవాలి. ఈ



భాగస్వామ్యాల ద్వారా అధునాతన శుద్ధి పద్ధతులను దేశంలోకి తీసుకురావడం ద్వారా చైనా గుత్తాధిపత్యాన్ని ఛేదించవచ్చు.

**పర్యావరణ పరిరక్షణతో కూడిన బాధ్యతాయుత మైనింగ్**

అరవళి వంటి సున్నితమైన ప్రాంతాల నుండి ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భారతదేశం భవిష్యత్తులో చేపట్టే ఏ మైనింగ్ కార్యకలాపమైనా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి.

కఠినమైన నియంత్రణలు: అరుదైన ఖనిజాలు ఉన్న ప్రాంతాలలో మైనింగ్‌కు అనుమతులు ఇచ్చేటప్పుడు కఠినమైన పర్యావరణ ప్రభావ అంచనా తప్పనిసరి చేయాలి. మైనింగ్ పూర్తయిన తర్వాత ఆ ప్రాంతాన్ని పునరుద్ధరించడానికి, పచ్చదనం పెంచడానికి (ఉదాహరణకు,మొక్కలు నాటే కార్యక్రమం వంటివి) చట్టపరమైన బాధ్యతను మైనింగ్ సంస్థలపై మోపాలి.

స్థానిక ప్రజల సంక్షేమం: పర్వత ప్రాంతాలలో నివసించే స్థానిక ప్రజలు, ముఖ్యంగా గిరిజనుల హక్కులను పరిరక్షించాలి. మైనింగ్ ద్వారా వచ్చే లాభాలలో వారికి భాగస్వామ్యం కల్పించాలి. వారి విద్య, ఆరోగ్యం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ద్వారా, మైనింగ్‌ను సమతుల్య అభివృద్ధికి ఒక సాధనంగా ఉపయోగించుకోవచ్చు.

పర్వత ప్రాంతాలలో మైనింగ్‌ను నిర్వహించడం ద్వారా ఆయా దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవడానికి అవకాశం దొరుకుతుంది. ఖనిజాల వెలికితీత ద్వారా భారీగా పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. ఈ ఆదాయాన్ని విద్య, ఆరోగ్యం, మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఖర్చు చేయవచ్చు.ఇంకా, అనేక దేశాలలో మైనింగ్ కంపెనీలు సామాజిక బాధ్యతలో భాగంగా ఆయా ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయి. ఉదాహరణకు, పర్వత ప్రాంతాలలో నివసించే స్థానిక ప్రజలకు శిక్షణ ఇవ్వడం, సాంకేతిక నైపుణ్యాలను పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టి వారికి మంచి ఉపాధిని కల్పిస్తున్నాయి. మైనింగ్ పరిశ్రమలో పెట్టుబడులు పెరగడం వల్ల, అంతర్జాతీయంగా మైనింగ్ సాంకేతికత, ముఖ్యంగా పర్యావరణానికి తక్కువ నష్టం కలిగించే అధునాతన మైనింగ్ పద్ధతులు అభివృద్ధి చెందుతున్నాయి.

ప్రపంచ మైనింగ్ పోటీలో భారతదేశం కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితం కాకూడదు. స్వదేశీ నిల్వలను అన్వేషించడం, సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడం, మరియు బాధ్యతాయుత మైనింగ్ పద్ధతులను అవలంబించడం ద్వారా భారత్ ఈ రంగంలో ముందంజ వేయగలదు. ముఖ్యంగా, అరుదైన ఖనిజాలపై స్వయం సమృద్ధి సాధించడం అనేది భారతదేశ రక్షణ, సాంకేతిక మరియు ఆర్థిక భవిష్యత్తుకు అత్యంత కీలకమైన అంశం.

# నియంత్రణ కోల్పోయిన ప్రజాస్వామ్యం



వెంక గారి భూమయ్య
9848559863

(ప్రజాభిప్రాయానికి విలువ లేదా? సంస్కరణల మధ్య సామాన్యుడి గొంతు అణచివేత.సమాఖ్య స్ఫూర్తికి సవాలు.. రాష్ట్రాల సమ్మతిని విస్మరించడం నియంతృత్వానికి తొలి అడుగా? విశ్వసనీయతకు విఘాతం..రాజకీయం–కార్పొరేట్ సంకీర్ణంతో ఆర్థిక అసమానతలు. )మన దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఎన్నికల సంస్కరణల చర్చ ఒక బృహత్తర సందిగ్ధతకు దారితీస్తోంది. ఒకే దేశంఒకే ఎన్నిక వంటి పరిపాలనా సంస్కరణలు ఒకవైపు; ఎన్నికల్లో క్రిమినల్ నేపథ్యం ఉన్నవారు, కార్పొరేట్ ధనబలం పెరుగుతున్న ఆధిపత్యంపై చట్టపరమైన చర్యల ఆవశ్యకత మరోవైపు ఈ రెండు కీలక అంశాలపై కేంద్రం తీసుకుంటున్న, తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలు, సామాన్య పౌరుల్లో తీవ్ర ఆందోళన, గందరగోళం నెలకొంది.

**ఏకపక్ష సంస్కరణపై రాజ్యాంగ వివాదం**

కేంద్ర ప్రభుత్వం ముందుకు తెస్తున్న ఒకే దేశంఒకే ఎన్నిక ప్రతిపాదనకు ప్రధానంగా వ్యతిరేకత వస్తున్నది దాని లక్ష్యం గురించి కాదు, అది అమలు చేయబోయే విధానంపైనే. దేశం యొక్క ఫెడరల్ నిర్మాణాన్ని, సమాఖ్య స్ఫూర్తిని ఈ సంస్కరణ ఏ విధంగా ప్రభావితం చేస్తుందనే విషయంలో రాష్ట్రాలు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు పాలక పక్షంపై విశ్వాసం ఉంచలేకపోతున్నాయి. ఒకవైపు ఈ సంస్కరణను సమర్థవంతంగా అమలు చేయాలంటే రాజ్యాంగంలోని అధికరణ 368 ప్రకారం కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోద తీర్మానం తప్పనిసరి అని రాజ్యాంగ నిపుణులు వాదిస్తుండగా, కేంద్రం మాత్రం రాష్ట్రాల పాత్రను తగ్గించి, కేవలం పార్లమెంటరీ మార్గంలోనే ముందుకు వెళ్లాలని చూస్తుండడం గమనార్హం. దీనితో తమ హక్కులకు భంగం వాటిల్లే అవకాశం ఉందని, రాష్ట్రాల సమ్మతి లేని ఈ మార్పు నియంతృత్వ పోకడలకు దారి తీసే అవకాశం ఉందని విపక్ష పాలిత రాష్ట్రాలు భయపడుతున్నాయి. అంటే, వరుస ఎన్నికల భారం తగ్గించుకోవాలనే మంచి ఆలోచన, రాజ్యాంగపరమైన విభేదాల సుడిగుండంలో చిక్కుకుపోతోంది.

**క్రిమినల్, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం చట్టం ఎందుకు మౌనం?**

మరోవైపు, దేశ ఆర్థిక, సామాజిక విధానాలను శాసిస్తున్న మరో ప్రమాదం రాజకీయాల్లో క్రిమినల్ మరియు కార్పొరేట్ శక్తుల జోక్యం. క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించే విషయంలో కఠిన చట్టాలను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ, కేవలం శిక్ష పడిన వారికి మాత్రమే అనర్హత విధించే ప్రస్తుత చట్టాన్ని మార్చడంలో పాలక పక్షాల చిత్తశుద్ధిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని కూడా చట్టసభల్లోకి అనుమతించడం, తద్వారా పారదర్శక పాలనకు విఘాతం కలగడం పట్ల ప్రజల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.

వీటితో పాటు, కార్పొరేట్ ధనబలం ప్రభావం కారణంగా దేశ ఆర్థిక విధానాలు కేవలం అగ్రశ్రేణి కంపెనీలకు అనుకూలంగా మారుతున్నాయనే భావన మెజారిటీ పౌరుల్లో బలంగా ఉంది. అజ్ఞాత ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా నిధుల ప్రవాహంపై పూర్తి పారదర్శకత లేకపోవడం, మరియు కంపెనీల విరాళాలపై సరైన పరిమితులు లేకపోవడం వలన, సామాన్య ప్రజల సమస్యలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదనే ఆందోళన ఉంది. అంటే, ఒకవైపు పాలనాపరమైన సంస్కరణ (ఒకే ఎన్నిక)పై గందరగోళం నడుస్తుండగానే, దేశాభివృద్ధికి నిజంగా అవసరమైన క్రిమినల్, కార్పొరేట్ శక్తులను అరికట్టే చట్టపరమైన సంస్కరణలు మాత్రం ఎటూ తేల్చలేని స్థితిలో ఉన్నాయి.

**సంస్కరణల వైఫల్యం విశ్వాసం సన్నగిల్లుతుందా?**

అత్యంత ముఖ్యంగా, ఈ సంస్కరణల వైఫల్యం యొక్క పర్యవసానాలను లోతుగా ఆలోచించాలి. ఎన్నికల ప్రక్రియలో ధనబలం, క్రిమినల్ బలం రాజ్యమేలడం వలన, విధాన నిర్ణయాలు సామాన్య పౌరుడికి ప్రయోజనం చేకూర్చడానికి బదులుగా, కేవలం అగ్రశ్రేణి వర్గాల ప్రయోజనాలను మాత్రమే పరిరక్షించే విధంగా వక్రీకరించబడుతున్నాయి. ప్రజలకు అనుకూలమైన చట్టాలు రూపొందించాల్సిన చట్టసభలు, తమ నేర నేపథ్యాన్ని దాచుకోవడానికి లేదా కార్పొరేట్ లాభాలను పెంచడానికి అనుకూలమైన చట్టాలను చేయడానికి ఉపయోగపడే వేదికలుగా మారితే, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం పూర్తిగా సన్నగిల్లుతుంది. ఇది అంతిమంగా, దేశంలో ఆర్థిక అసమానతలు పెరగడానికి, సామాజిక అశాంతికి మరియు పాలనా వ్యవస్థ పట్ల నిరాశ పెరగడానికి దారితీస్తుంది. అందుకే, ఒకే దేశంఒకే ఎన్నిక వంటి పరిపాలనా సౌలభ్యం కంటే, రాజకీయాన్ని శుద్ధి చేసే చట్టపరమైన సంస్కరణలు భారతదేశ భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత వహించాలి.

సామాన్య పౌరుల నుంచి, క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నాయకులకు చట్టసభల్లో స్థానం కల్పించడం ద్వారా మాత్రమే దేశ ఆర్థిక స్థితిగతులపై సరైన అధ్యయనం జరిగి, సమ్మిళిత అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని పౌర సమాజం గట్టిగా అభిప్రాయపడుతోంది. ఈ మొత్తం అంశాలను పరిశీలిస్తే, కేంద్రం కేవలం ఒకే దేశంఒకే ఎన్నిక అనే పరిపాలనాపరమైన చర్చకే పరిమితం కాకుండా, క్రిమినల్, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పటిష్టమైన చట్టాన్ని తీసుకురావడం ద్వారా దేశంలో నిజమైన రాజకీయ శుద్ధికి మార్గం సుగమం చేయాలనే ఒత్తిడి పెరుగుతోంది.

# బిజినెస్

## హైదరాబాదులో ఖండాని రాజధాని తిరిగి పునరాగమనం



కుకట్‌పల్లి లేక్‌షోర్ మాల్‌లో డిసెంబర్ 12, 2025న కొత్త శాఖను ప్రారంభిస్తూ, అసలైన గుజరాతీ మరియు రాజస్థానీ వంటకాలతో ప్రసిద్ధి చెందిన ఖండాని రాజధాని హైదరాబాదులో మళ్లీ తన సేవలను అందుబాటులోకి తెచ్చింది. సంప్రదాయం మరియు ఆధునికత కలయికతో రూపొందించిన నూతన వాతావరణం, ఆతిథ్యాన్ని మరింత ఆకర్షణీయంగా చేస్తోంది. మహారాజ్ భవర్ సింగ్ ప్రత్యేకంగా సిద్ధం చేసిన సాంప్రదాయ వంటకాలతో సురతి ఉంధియూ, గాజర్ హల్వా వంటి రుచికరమైన పదార్థాలు ఉన్న అపరిమిత థాలి అనుభవం అతిథులకు పండగభోజనాన్ని అందిస్తుంది. హైదరాబాదులో మళ్లీ అనుబంధాన్ని బలపరచుకునేందుకు ఈ ప్రారంభోత్సవం ఒక అవకాశమని, నగరం అందించిన ప్రేమను మరువలేమని సంస్థ ముఖ్య అధికారి అజీ నాయక్ తెలిపారు. సంప్రదాయం, రుచి, ఆత్మీయత కలగలిసిన ఈ కొత్త కేంద్రం థాలి ప్రేమికులకు ప్రత్యేక భోజనానుభవాన్ని అందిస్తోంది.

## కేపీఐఎల్‌కు కొత్తగా 2,003 కోట్లు విలువైన ఆర్డర్లు

ముంబైలో కేపీఐఎల్ ప్రకటించిన ప్రకారం, సంస్థ మరియు దాని అంతర్జాతీయ అనుబంధ సంస్థలు మొత్తం సుమారు 2,003 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లను పొందాయి. ఈ ఆర్డర్లు దేశీయ భవనాలు మరియు కర్మాగారాల విభాగంలో పాటు దేశీయ మరియు విదేశీ విద్యుత్ ప్రసరణవితరణ రంగాలకు చెందినవి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రధాన కార్యనిర్వాహణ అధికారి మనీష్ మొహ్నోట్ మాట్లాడుతూ, ఈ కొత్త ఆర్డర్లు నివాస మరియు ఆరోగ్య ప్రాజెక్టుల విభాగంలో సంస్థ స్థిరత్వాన్ని మరింత బలపరుస్తాయని, అలాగే విద్యుత్ ప్రసరణ రంగంలో సంస్థ దేశీయంగా మరియు అంతర్జాతీయంగా తన పాదముద్రను విస్తరించుకుంటోందని తెలిపారు. తాజా ఆర్డర్లతో ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ మొత్తం ఆర్డర్ బుక్ సుమారు 17,000 కోట్లకు చేరి, రాబోయే త్రైమాసికాల్లో వృద్ధికి మంచి ప్రగతిని సూచిస్తోందని ఆయన అన్నారు.

## కాలుష్యంపై ఆరోగ్య హెచ్చరికతో గృహ రక్షణ మార్గదర్శకాలు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా తీవ్రతలు మరింతగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఇండోర్-కార్యాలయాల్లో హెపా ప్రమాణిత గాలి శుద్ధి పరికరాలను వినియోగించాలని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆత్మీయంగా సూచన విడుదల చేసింది. హానికరమైన సూక్ష్మ ధూళికణాల ప్రభావం నుంచి రక్షించుకోవడానికి గాలి శుద్ధి పరికరాల వాడకం, తీవ్ర కాలుష్య వేళల్లో కిటికీలు మూసివేయడం, బాహ్య వ్యాయామాన్ని తగ్గించడం, బయటకు వెళ్లేప్పుడు ఎన్95 [illegible] వాడడం వంటి సూచనలు ఇవ్వబడ్డాయి. ముఖ్యంగా ఆస్తమా బాధితులు వైద్యుల సూచనలను కచ్చితంగా పాటించడం, ఇన్హేలర్లు దగ్గర ఉంచుకోవడం, శరీరంలో తేమ నిలుపుకోవడం, పోషకాహారాన్ని తీసుకోవడం అవసరమని పేర్కొంది. అదేవిధంగా ఇంటిలో ధూమం ఉత్పత్తి చేసే ధూపదీపాలు, కొవ్వొత్తులు వంటివి పూర్తిగా నివారించాలని సూచించింది. ప్రజల ఆరోగ్య భద్రత కోసం కాలుష్య స్థితిగతులను సంస్థ నిరంతరం పరిశీలిస్తూ సమయానుకూల మార్గదర్శకాలు అందిస్తుందని వెల్లడించింది.

## సాంప్రదాయ హస్తకళలకు సోభిత ధూలిపాలా కొత్త ప్రతినిధి



ఆదిత్య బిర్లా సమూహానికి చెందిన ఆద్యం హ్యాండ్వోవెన్ దేశపు నూలుబట్టల వారసత్వాన్ని సంరక్షించేందుకు చేస్తున్న ప్రయాణంలో కొత్త అడుగుగా ప్రముఖ నటి సోభిత ధూలిపాలాను బ్రాండ్ అంబాసడర్‌గా ప్రకటించింది. ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వెలువడిన ఈ ప్రకటనతో, ఆధునికత–సంస్కృతి సమన్వయాన్ని ముందుకు తీసుకెళ్లే 'సంస్కృతి ది యాన్ టెక్స్టైల్స్' భావనను ఆద్యం మరింత బలపరచింది. భారతీయ హస్తకళలపై వ్యక్తిగత అనుబంధం, ప్రత్యేక శైలి, సాంస్కృతిక అవగాహన కలిగిన సోభిత, వారసత్వాన్ని ఆధునిక రూపంలో మలుచుకునే నేటి యువ భారతీయుల ప్రతినిధిగా నిలుస్తుందని సంస్థ భావిస్తోంది. నూలువారుల జీవితాలను మెరుగుపరచడం, వారి కళను ప్రపంచానికి చేరవేయడం ఆద్యమ్ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు పేర్కొనగా, చేతిపనికి భావోద్వేగం ఉంటుందని, కళను సంరక్షిస్తూ సమాజానికి విలువ అందించే బ్రాండ్‌తో కలిసి పనిచేయడం గౌరవంగా ఉందని సోభిత తెలిపారు. అలాగే 'సంస్కృతి బియాండ్ టెక్స్టైల్స్', 'మ్యూజిక్ ఆఫ్ ఆద్యం' కార్యక్రమాల ద్వారా భారతీయ సంగీతం, సాహిత్యం, ఆహారం, రూపకళ, హస్తకళలను ఒకే సూత్రంలో కట్టి సంస్కృతిని జీవంతో ఉంచే ప్రయత్నాన్ని సంస్థ ముందుకు తీసుకెళ్తోంది.

## ప్రాచీన జ్ఞానంతో ఆధునిక విధానాలకు నూతన దిశ



ప్రాచీన భారత జ్ఞానాన్ని ఆధారంగా తీసుకుని ఆధునిక సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే లక్ష్యంతో 'భారత్ కి సోచ్' అనే కొత్త థింక్ ట్యాంక్ ఢిల్లీలో ప్రారంభమైంది. దేశ అభివృద్ధి కథనాన్ని సాంస్కృతిక, దార్శనిక మూలాలతో బలపరచాలని దీని దృష్టి. 'గ్లోబల్ అనిశ్చిత పరిస్థితుల్లో వృద్ధి, అభివృద్ధి' అనే ఆరంభ సదస్సులో పలు ప్రముఖులు భారత నాగరికతలోని ఆర్థిక, పరిపాలనా, నైతిక సిద్ధాంతాలు నేటి విధాన రచనకు ఎంతగా ఉపయోగపడతాయో వివరించారు. కౌటిల్య అర్థశాస్త్రం నుండి భారతీయ దౌత్య, పరిపాలనా, ఆర్థిక సూత్రాల వరకు అనేక అంశాలు చర్చించబడాయి. ప్రపంచ అనిశ్చితుల్లోను భారత్ వేగంగా అభివృద్ధి చెందడానికి నాగరికతా జ్ఞానం స్థిరబలంగా నిలిచిందని నిపుణులు తెలిపారు. దక్షిణాసియా జియోపాలిటిక్స్, నాగరికతా దౌత్యం, వ్యవసాయం, ఆర్థిక శాశ్వతత, పరిపాలనా నైతికత వంటి రంగాల్లో ప్రాచీన భారత బోధనలు సమకాలీన అవసరాలకు ఎలా దోహదపడగలవో ఈ వేదిక చర్చించింది. శాస్త్రవేత్తలు, విధానకర్తలు, నిపుణులతో కలిసి లోతైన పరిశోధన, అంతరశాఖ సహకారం, ప్రజా సంభాషణల ద్వారా భారత పురాతన జ్ఞానాన్ని సమయానుకూలంగా అన్వయించి వికసిత భారత్ దిశగా మార్గనిర్దేశం చేయడం 'భారత్ కి సోచ్' ప్రధాన లక్ష్యం. అర్థశాస్త్రంలో అయినా, చాణక్య నీతిలో అయినా ప్రాచీన భారతీయ జ్ఞానంలో అపారమైన అభ్యాసం పొందుపరచబడిందని, కానీ దానిని 21వ శతాబ్దానికి అనుగుణంగా ఆలోచించి సందర్భోచితంగా రూపొందించాలని, సమకాలీన కాలంలో భారతదేశాన్ని బలోపేతం చేసే విధంగా ఈ గ్రంథాల నుండి వచ్చే అంతర్దృష్టులను స్వీకరించి, అన్వయించాలని ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు, ఆయన సహ–ప్యానెలిస్ట్ శ్రీ రామ్ మాధవ్ నొక్కి చెప్పారు.

# రెండో రోజూ లాభాల్లోనే..

### మళ్లీ 26 వేల పైకి నిఫ్టీ-449.53 పాయింట్ల లాభంతో స్థిరపడ్డ సెన్సెక్స్



ముంబయి: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలను ముందుకు నడిపించింది. దీంతో ఫెడ్ ఇచ్చిన రేట్ల కోత ఉత్సాహం వరుసగా రెండో రోజూ కొనసాగింది. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 26 వేల ఎగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 85,051.03 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,818.13) లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు ఒడుదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,320.82 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 449.53 పాయింట్ల లాభంతో 85,267.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148.40 పాయింట్ల లాభంతో 26,046.95 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.42గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటెర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్అండ్‌టీ, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.09 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.. బంగారం ఔన్సు 4320 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# ఐటీసీ ఎపిక్ కలెక్షన్ జైపూర్ సంతకం

ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ కొత్త ప్రీమియం బ్రాండ్ ఎపిక్ కలెక్షన్ కింద జైపూర్, బాగ్రు లో 150 గది కలిగిన హోటల్‌ను సంతకం చేసింది. 12 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడే ఈ హోటల్ 2030 లో ప్రారంభం కానుంది. రాజస్థాన్ యొక్క సాంస్కృతిక, వాణిజ్య కేంద్రాలకు సులభమైన ప్రాక్సిమిటీతో, హోటల్ ఆర్కిటెక్చర్ మరియు ఆతిథ్య ప్రతిపాదికన ఎపిక్ కలెక్షన్ తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. హోటల్ ను ఒక అంతిమయ రిసార్ట్ గా అభివృద్ధి చేస్తూ, జైపూర్ యొక్క కోటలు, మహాలు, శిల్పకళ సంప్రదాయాలు స్థానిక సాంస్కృతిక సంపదను ప్రదర్శించేలా రూపకల్పన చేయబడుతుంది. ఇది ఐటీసీ ఎపిక్ కలెక్షన్ బ్రాండ్ యొక్క జాతీయ ప్రాప్యతను మరింత పెంచుతూ, విభిన్నమైన, సాంస్కృతికంగా ప్రత్యేకమైన గమ్యస్థలాల్లో ప్రత్యేక హోటల్ అనుభవాలను అందించడానికి కృషి చేస్తుంది.

భవిష్యత్తులో జైపూర్ మరియు పుష్కర్ తో సన్నిహిత సంబంధం కలిగిన ఈ హోటల్, కస్టమర్లకు స్థానిక సాంస్కృతిక విలువలు, ఆధునిక సౌకర్యాలు మరియు వ్యక్తిగత సేవలను అందిస్తూ, రాజస్థాన్ సారాన్ని ఆస్వాదింపజేసే ప్రత్యేక అనుభవాలను అందిస్తుంది. ఐటీసీ హోటల్స్ ప్రీమియం పోర్ట్‌ఫోలియోలో ఇది ప్రత్యేకమైన మరియు ఆధునికతను కలిగిన కొత్త మైలురాయిగా నిలుస్తుంది.

హోటల్ నిర్మాణంలో రాజస్థాన్ సంప్రదాయ కళలు, వాస్తవిక ఆర్కిటెక్చర్ శైలులను ప్రాధాన్యం ఇస్తూ, సందర్శకులకు స్థానిక సాంస్కృతిక అనుభవాలను సమగ్రంగా అందించేలా ఏర్పాట్లు చేయబడ్డాయి. అందులో ప్రాంతీయ శిల్పకళ, గోడల చిత్రలేఖనాలు, స్థానిక వస్త్రాలు మరియు ఆహార పద్ధతులు ప్రత్యేకంగా ప్రతిబింబిస్తాయి. ఇది అతి ప్రీమియం హోటల్ అనుభవాన్ని స్థానిక సంపదతో కలిపి అందిస్తున్నది.హోటల్ ఆవాసాలలో ఆధునిక సౌకర్యాలు, సౌకర్యవంతమైన గదులు, వ్యక్తిగత సేవలు, స్మార్ట్ సాంకేతికతతో కూడిన సౌకర్యాలు, రిసార్ట్‌లో ప్రత్యేకమైన స్పా, జిమ్, డైనింగ్ మరియు సమావేశ కేంద్రాలు ఉంటాయి. వీటితో ఇక్కడి అతిథులు సౌకర్యవంతమైన, సౌందర్యవంతమైన మరియు సాంస్కృతికంగా సంతృప్తికరమైన అనుభవాన్ని పొందగలరు.

భవిష్యత్తులో జైపూర్ పర్యటనను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి, ఈ హోటల్ ప్రాంతీయ ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు మరియు అనుకూల కార్యక్రమాలను కూడా నిర్వాహిస్తుంది. ఇది స్థానిక సంప్రదాయాలను ప్రోత్సహించడం మాత్రమే కాక, హోటల్ దశాబ్దాల పాటు ప్రీమియం హాస్పిటాలిటీ లో నూతన ప్రమాణాలను సృష్టిస్తు

# ముషీరాబాద్ జాబ్ మేళా 2025 కు విశేష స్పందన

### 4,200 మంది హాజరు 1,800 మందికి ఉద్యోగాలు



హైదరాబాద్: సామాజిక సేవకుడు టీ. దినకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముషీరాబాద్ జాబ్ మేళా 2025 కు అద్భుతమైన స్పందన లభించింది. ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ జాబ్ మేళాకు మెుత్తం 4,200 మంది యువత హాజరై తమ భవిష్యత్తు కోసం అవకాశాలను వెతికారు. ఈ జాబ్ మేళాలో 150 కంపెనీలు పాల్గొని ఐటీ, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఇంజనీరింగ్, హెల్త్‌కేర్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్స్, హాస్పిటాలిటీ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచాయి. 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, బి.టెక్, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ వంటి అర్హతలతో వచ్చిన అభ్యర్థులకు మంచి అవకాశాలు లభించాయి. ముఖ్యంగా, ఈ జాబ్ మేళాలో 1,800 మందికి స్పాట్ ఆఫర్ లెటర్స్ ఇవ్వబడటం విశేషం. ఇది స్థానిక యువతకు ఆర్థిక స్థిరత్వం ఇచ్చే దిశగా కీలక ముందడుగుగా నిలిచింది. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు టీ. దినకర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయాలనే తపన నన్ను ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రేరేపిస్తుంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం సమాజాన్ని బలోపేతం చేసే అత్యంత ప్రభావవంతమైన మార్గం. ముషీరాబాద్ ప్రజల కోసం మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ జాబ్ మేళా విజయవంతం మరింత ఉత్సాహం కలిగించింది అన్నారు. ముషీరాబాద్ జాబ్ మేళా 2025, దినకర్ రెడ్డి గారి సామాజిక సేవా దృక్పథానికి మరో మంచి నిదర్శనంగా నిలిచింది. యువత సాధికారత, సమాజ అభివృద్ధి, ప్రజల సంక్షేమం ఆయన ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతున్నాయి.

# అనంత్ యూనివర్శిటీ ఏడవ డిగ్రీ సమారోహం జరుపు




అనంత్ నేషనల్ యూనివర్శిటీ 299 విద్యార్థులకు బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ డిజైన్, సస్టైయినబిలిటీ, క్లైమేట్ యాక్షన్ ఫెలోషిప్‌లలో డిగ్రీలు పంచుతూ ఏడవ డిగ్రీ సమారోహాన్ని జరిపింది. ముఖ్య అతిథిగా జోహో కంపెనీ సహ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ డాక్టర్ శ్రీధర్ వేము పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ అధ్యక్షుడు అజయ్ పిరమాల్, ప్రొవోస్ట్ డాక్టర్ సంజీవ్ విద్యార్థి మరియు బోర్డు సభ్యులు హాజరయ్యారు. డాక్టర్ వేము విద్యార్థులకు భవిష్యత్తుకి అనుకూలమైన సృజనాత్మకత, సమస్యల పరిష్కార దృక్పథాన్ని అవగాహన చేసుకోవాలని ప్రసంగంలో చెప్పారు.

డాక్టర్ వేము మాట్లాడుతూ, అనంత్ యూనివర్శిటీ విద్యార్థుల డిజైన్లు నన్ను ప్రభావితం చేశాయి. భవిష్యత్తుకు దృష్టితో సృష్టించండి, స్వయంకృతికతను మానవీయతతో కలిపి ఉపయోగించండి. సమస్యలపై దృష్టి పెట్టినప్పుడు అసాధారణ పని సహజంగా వస్తుంది అని పేర్కొన్నారు. యూనివర్శిటీ అధ్యక్షుడు అజయ్ పిరమాల్ మాట్లాడుతూ, డిజైన్ సమాజాన్ని, పరిశ్రమలను, వాతావరణాన్ని పునర్నిర్మాణం చేయడానికి ఒక సాధనం. అనంత్ యూనివర్శిటీలో మనం సృజనాత్మకతను వృత్తిగా మార్చే విద్యార్థులను శిక్షిస్తున్నాం అని చెప్పారు.

ప్రొవోస్ట్ డాక్టర్ సంజీవ్ విద్యార్థులను అభినందిస్తూ, ఇది భారతదేశం కోసం సృజనాత్మకతను ప్రయోగించే, సుస్థిర, సమాజానుకూల, అంతర్జాతీయ గుర్తింపు పొందిన భవిష్యత్తును నిర్మించడానికి సరైన సమయం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రత్యేక ప్రతిభలను గుర్తిస్తూ, అతి ఉత్తమ అకాడమిక్ ప్రదర్శన, ఆవిష్కరణలు, గ్రాడ్యుయేషన్ ప్రాజెక్ట్, థీసిస్, లైవ్–ఆక్షన్ ప్రాజెక్ట్‌లలో అవార్డులు ఇవ్వబడ్డాయి. యూనివర్శిటీ క్యాంపస్ మొత్తం ఒక ప్రదర్శన కేంద్రంగా మారి విద్యార్థుల ప్రయాణాన్ని, సృజనాత్మకతను ప్రతిబింబించింది.

# హైదరాబాద్‌లో నీయో స్ట్రెచ్ 5వ ఔట్ లెట్ ప్రారంభం

### చీఫ్ గెస్ట్‌గా పాల్గొన్న బంధన్ బ్యాంక్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సంతాను ముఖర్జీ , నీయో స్ట్రెచ్ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్




హైదరాబాద్‌లోని కొత్తగా ప్రారంభమైన లేక్‌షోర్ వై జంక్షన్ మాల్‌లో ప్రీమియం మెన్స్‌వేర్ బ్రాండ్ నీయో స్ట్రెచ్ తన 5వ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ ఔట్ లెట్ ను గురువారం ప్రారంభించింది. డోనియర్ గ్రూప్ ఆధ్వర్యంలో 2023లో ప్రారంభమైన ఈ బ్రాండ్, తక్కువ కాలంలోనే 'ఫ్రీడమ్ టు మూవ్' సిద్ధాంతంతో దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. పనిలో కానీ, ప్రయాణంలో కానీ, రోజువారీ జీవనశైలిలో కానీ సౌకర్యానికి అనుగుణంగా తయారైన పురుషుల కోసం ప్రత్యేకమైన దుస్తుల ఎంపికగా ఎదిగింది. పూణే, బెంగళూరు తర్వాత హైదరాబాద్‌లో అడుగు పెట్టిన నీయో స్ట్రెచ్, 500 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ స్టోర్‌ను ఆధునిక, మినిమలిస్టిక్ డిజైన్‌తో నిర్మించి, ఎవ్రీడే, లేజర్, ట్రావెల్ వేర్ సెక్షన్లతో వినియోగదారులకు ప్రత్యేక రిటైల్ అనుభవాన్ని అందిస్తోంది. ప్రారంభోత్సవానికి అతిథిగా బంధన్ బ్యాంక్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సంతాను ముఖర్జీ హాజరై రిబ్బన్ కట్ చేసి స్టోర్‌ను ప్రారంభించారు. మాల్‌లో ప్రత్యేక యాక్టివేషన్స్, పర్ఫార్మెన్స్–ఇంజనీరింగ్ డెమోలతో ఈవెంట్లను ఆకర్షించనుంది. ఎంవీపీ ప్యాంట్స్, మెషీన్‌వాషబుల్ బ్లజులు, షాకెట్స్, స్ట్రెచ్ షర్ట్స్ వంటి ప్రధాన ఉత్పత్తులను స్టోర్‌లో ప్రవేశపెట్టినట్లు నీయో స్ట్రెచ్ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్ తెలిపారు. వచ్చే ఏడాదిలో 10 స్టోర్లు, రెండో ఏడాదిలో 50 స్టోర్లు, ఐదేళ్లలో 300 స్టోర్ల ఏర్పాటు లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. "ప్రీమియం మెన్స్‌వేర్‌కు హైదరాబాద్ వేగంగా ఎదుగుతున్న ప్రధాన మార్కెట్. యువత, కొత్త వృత్తిజీవుల అభిరుచులకు సరిపోయే కమ్ఫర్ట్–ఆధారిత లైఫ్స్టైల్‌కు నగరం పెద్దపీట వేస్తోంది. నీయో స్ట్రెచ్ దుస్తులు నిజజీవితానికి సరిపోయే సౌకర్యం, నమ్మకం, అనువర్తనాన్ని అందిస్తాయి" అని వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్ తెలిపారు.

# ఆధునిక జీవనశైలికి ఆయుర్వేదం: డాబర్ కొత్త కార్యక్రమం




డాబర్ ఇండియా లిమిటెడ్ ఆధునిక జీవనశైలికి ఆయుర్వేదాన్ని చేరువ చేస్తూ, యువతకు మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెంచే వ్యూహంతో, డాబర్ మూడు ప్రధాన అంశాలపై దృష్టి పెట్టింది ప్యాకేజింగ్ ఆధునీకరణ, "ఆయుర్వేద సంభాష్" ద్వారా అవగాహన, మరియు ఆరోగ్య శిబిరాల ద్వారా సామాజిక సేవ. ఈ ప్రయత్నం ఆయుర్వేదాన్ని నేటి సమాజానికి దగ్గరగా చేసేందుకు రూపొందించబడింది.

డాక్టర్ దుర్గా ప్రసాద్, మార్కెటింగ్ హెడ్–ఎథికల్స్, "డాబర్ మొత్తం ఆయుర్వేద ఔషధాలను ఆధునిక, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్‌లో విడుదల చేసింది. బోల్డ్ బ్రాండ్ గుర్తింపు, చదవగలిగే అక్షరాలు వినియోగదారులతో బలమైన అనుసంధానాన్ని కల్పిస్తాయి. సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో మేళవిస్తూ, ఆయుర్వేద ప్రామాణికతను కాపాడడం డాబర్ నిబద్ధత" అని అన్నారు.

"ఆయుర్వేద సంభాష్" కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, పరిశోధకులు, అభిప్రాయ నాయకులు ఒక వేదికపై చేరి ఆయుర్వేద పునాదులు, ఆచరణాత్మక అన్వయాలు, ఆధునిక జీవనశైలిలో దాని పాత్రపై చర్చలు నిర్వహిస్తారు. రోజువారీ జీవితంలో ఆయుర్వేదాన్ని అమలు చేయడానికి వ్యూహాలను రూపొందించడం, కొత్త పరిశోధనా అవకాశాలను తెరవడం ఈ కార్యక్రమ లక్ష్యం.

సామాజిక బాధ్యత కొనసాగిస్తూ, డాబర్ దేశవ్యాప్తంగా ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఆయుర్వేద ఔషధాలు, డయాగ్నోస్టిక్ పరీక్షలు, చికిత్స అందించే ఆరోగ్య శిబిరాలను విస్తరించేందుకు ప్రణాళికలు ప్రకటించింది. ఈ చర్య సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకువెళ్తుంది.

డాక్టర్ ప్రసాద్ వివరించిన విధంగా, "ఆయుర్వేదం కేవలం సంప్రదాయం మాత్రమే కాదు; అది ఆధునిక శాస్త్రం కూడా. పురాతన జ్ఞానాన్ని క్లినికల్ ట్రయల్స్, నాణ్యతా పరీక్షలతో మేళవించడం ద్వారా వినియోగదారులకు విశ్వసనీయమైన ఆరోగ్య పరిష్కారాలను అందిస్తున్నాం.

డాబర్ వైద్యం, వ్యక్తిగత సంరక్షణ, ఆహార రంగంలో అనేక ప్రసిద్ధ బ్రాండ్‌లతో నేటి జీవితానికి అనుగుణంగా ఆధునిక ఆరోగ్య వ్యవస్థను అందిస్తోందిఆయుర్వేదం కేవలం పురాతన సంప్రదాయం మాత్రమే కాదు; డాబర్‌లో మాకు అది ఆధునిక శాస్త్రం.

ఈ మహోన్నత జ్ఞానానికి మేము కాపలాదారులమే కానీ, దాని ప్రయోజనాలను ఘనమైన ఆధారాలతో నిరూపించే బాధ్యత కూడా మాదే.

అందుకే పురాతన గ్రంథాల జ్ఞానాన్ని అత్యాధునిక పరిశోధన, క్లినికల్ ట్రయల్స్, కఠిన నాణ్యతా పరీక్షలతో మేళవిస్తాము. మా ఉత్పత్తులు 'వారసత్వంతో ధృవీకరించబడినవి, శాస్త్రంతో సమర్థించబడినవి'.

సంప్రదాయం–ఆధునిక ఆధారాల మేళవింపే ఈ కలయికే ఆయుర్వేదాన్ని నేటి కొత్త తరానికి నమ్మదగినదిగా, ప్రభావవంతంగా మారుస్తోంది" అని డాక్టర్ ప్రసాద్ అన్నారు.

## వీ బిజినెస్ స్మార్ట్ గ్యాస్ మీటరింగ్ పరిష్కారాలు విస్తరించింది



వీ బిజినెస్, భారత దేశంలోని ప్రముఖ టెలికాం సంస్థ విఐ యొక్క ఎంటర్ప్రైజ్ విభాగం, అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పోర్ట్‌ఫోలియోను స్మార్ట్ గ్యాస్ మీటరింగ్ పరిష్కారాలతో విస్తరించింది. 2018 లో భారతదేశంలో స్మార్ట్ మీటర్ల ప్రారంభాన్ని చేయడం ద్వారా ఎనర్జీ ఎకోసిస్టంలో పయనించిన వీ బిజినెస్, ఇప్పుడు వేగంగా పెరుగుతున్న సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ రంగానికి తన ఐఓటి మరియు అడ్వాన్స్‌డ్ మీటరింగ్ సామర్థ్యాలను అందిస్తోంది. ఈ పరిష్కారం ప్రభుత్వం యూటిలిటీల ఆధునీకరణ, ఆపరేషనల్ ప్రమాణాల మెరుగుదల, డిజిటల్ మీటరింగ్ విస్తరణలో చేయవలసిన ప్రయత్నాలను మద్దతు ఇవ్వడానికి దోహదపడుతుంది. స్మార్ట్ గ్యాస్ మీటరింగ్ ద్వారా లీకేజీ, చోరీ, మాన్యువల్ బిల్లింగ్ లోపాలు, అనూహ్య నష్టాలు తగ్గించబడతాయి. నారోబ్యాండ్–ఐఓటి సాంకేతికతను ఉపయోగించి, సిజిడి ఆపరేటర్లు ఆపరేషనల్ సమర్థతను పెంచి, బిల్లింగ్ ఖచ్చితత్వాన్ని మెరుగుపరచగలుగుతారు. వీ బిజినెస్ అధికారి అర్విండ్ నెవాటియా ప్రకారం, స్మార్ట్ గ్యాస్ మీటరింగ్ భారత యూటిలిటీల ఆధునీకరణలో కొత్త దశను ప్రారంభిస్తోంది మరియు విస్తరణ సాధ్యమైన, భవిష్యత్ సిద్ధమైన పరిష్కారాలతో ఇండియాలో యూటిలిటీ రంగాన్ని మద్దతు ఇస్తుందని తెలిపారు.

# బిట్సాట్ 2026 పరీక్ష షెడ్యూల్

అబిట్స్ పిలానీ ప్రకటించిన బిట్సాట్ 2026 పరీక్ష వివరాల ప్రకారం, దరఖాస్తుల స్వీకరణ డిసెంబర్ 15, 2025 నుంచి ప్రారంభమై మార్చి 16, 2026తో ముగుస్తుంది. ఏప్రిల్ 15 నుంచి 17 వరకు సెషన్–1, మే 24 నుంచి 26 వరకు సెషన్–2 జరుగనున్నాయి. అభ్యర్థులు ఒకటి లేదా రెండు సెషన్లలో పాల్గొనవచ్చు; రెండు ప్రయత్నాలు ఇచ్చినవారికి ఉత్తమ స్కోరు ఆధారంగా ప్రవేశం కల్పించబడుతుంది. ప్రతిభ, పారదర్శకత కేంద్రబిందువులుగా బిట్స్ పిలానీ దేశవ్యాప్తంగా విద్యార్థులను దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానించింది. ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయాలు, స్కాలర్‌షిప్‌లు విస్తృతంగా లభ్యమని, ప్రతిభ ఉంటే విద్యా సహాయం ఖచ్చితమని సంస్థ ఉపకులపతి రామ్‌గోపాల్ రావు తెలిపారు. బిట్సాట్ 2026కు సంబంధించిన తాజా సమాచారాన్ని తెలుసుకోవడానికి అభ్యర్థులు సంస్థ అధికారిక ప్రవేశ వేదికను మాత్రమే ఉపయోగించాలని సూచించింది.

## ఈకామర్స్ ఒత్తిడిలో కిరాణా వ్యాపారాలకు రక్షణ అవసరమని ఎఫ్ఆర్ఏఐ విజ్ఞప్తి



దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న ఈకామర్స్, క్విక్‌కామర్స్ ప్రభావంతో లక్షలాది కిరాణా దుకాణాలు ఆదాయం కోల్పోతున్న నేపథ్యంలో, చిన్న రిటైలర్లకు ప్రభుత్వ మద్దతు అత్యవసరమని ఎఫ్ఆర్ఏఐ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో పేర్కొంది. భారీ రాయితీలు, వేగవంతమైన డెలివరీలు, దూకుడు మార్కెటింగ్ కారణంగా వినియోగదారుల ప్రవర్తన మారిపోవడంతో అనేక కిరాణా దుకాణాలు అమ్మకాల పతనం, కస్టమర్ తగ్గుదలను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. పెద్ద కంపెనీలు చిన్న దుకాణాదారులను వ్యాపార భాగస్వాములుగా కాకుండా డెలివరీ కార్మికులుగా మార్చే విధానాలు స్థానిక సాహసోపేత వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమైంది. ఈ పరిస్థితిని మార్చేందుకు కిరాణా దుకాణాలకు సమాన పోటీ వాతావరణం కల్పించే ప్రభుత్వ జోక్యం తప్పనిసరి అని సంస్థ భావిస్తోంది. వినియోగదారుల వేగం, సౌకర్యం, సరసమైన ధరల డిమాండ్‌ను గుర్తించిన రిటైలర్లు, సరైన సాంకేతిక వేదిక ఉంటే డిజిటల్ మార్పులను అంగీకరించడానికి సిద్ధమని తెలిపారు. ఇందుకోసం సమీప దుకాణాలకు ఆర్డర్లు పంపించే 'భారత్ టాక్సీ' తరహా డిజిటల్ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. చిన్న వ్యాపారాలను శక్తివంతం చేయడంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఓఎన్‌డీసీ కీలకమని, ఇది పెద్ద ప్లాట్‌ఫారమ్ ఆధారిత ఆధిపత్యాన్ని తగ్గించి, కిరాణా దుకాణాలకు విస్తృత కస్టమర్ ప్రాప్తి, తక్కువ వ్యయం, సమాన అవకాశాలు అందిస్తుందని ఎఫ్ఆర్ఎఐ పేర్కొంది. సరళీకృత ఆన్‌బోర్డింగ్, మెరుగైన శిక్షణ, ఏకరీకృత సేవా ప్రమాణాలు, లాజిస్టిక్స్ భాగస్వామ్యాలు, విక్రేతఖరీదుదారుల ఉత్సాహవంతమైన ప్రోత్సాహాలు మరియు విశ్వసనీయ రేటింగ్ వ్యవస్థ వంటి చర్యలతో ఓఎన్‌డీసీ మరింత బలపడతుందని, దీనివల్ల దేశంలోని లక్షల చిన్న రిటైలర్లు, కిరాణా కుటుంబాల జీవనాధారాలు రక్షించబడతాయని సంస్థ వెల్లడించింది.

## ట్రూకాలర్ లాంచ్ చేసింది ఫ్యామిలీ ప్రొటెక్షన్ ఫీచర్




ట్రూకాలర్ కొత్తగా ఫ్యామిలీ ప్రొటెక్షన్ అనే ఫీచర్‌ను ప్రారంభించింది, ఇది కుటుంబ సభ్యులందరినీ ఫోన్లలో స్కామ్ కాల్స్ నుండి రక్షించడానికి రూపొందించబడింది. ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్లోకి నేరుగా ఇంటిగ్రేట్ అయిన ఈ ఫీచర్ ద్వారా, ఒకటికి ఐదు మంది వరకు కుటుంబ సభ్యులు ఒక ట్రస్టెడ్ గ్రూప్‌లో చేరి, స్కామ్ మరియు అవాంఛనీయ కాల్స్ పై రియల్–టైమ్ రక్షణ పొందవచ్చు. ఫ్యామిలీ అడ్మిన్లోఆండ్రాయిడ్ ఇతర సభ్యులకు స్కామ్ కాల్ సంభవించినప్పుడు అలర్ట్‌లు అందుకొని ఆ కాల్‌ను రిమోట్‌గా ముగించగలుగుతాడు. అడ్మిన్ రక్షణ స్థాయిలను సెట్ చేయడం, బ్లాక్‌లిస్ట్‌లను నిర్వహించడం మరియు అనుమానాస్పద కాల్స్ కోసం రిమోట్ మద్దతు ఇవ్వడం వంటి సౌకర్యాలను పొందుతాడు, దీని ద్వారా కుటుంబంలోని తక్కువ సాంకేతిక పరిజ్ఞానం గల సభ్యులను సులభంగా రక్షించవచ్చు. ఫ్యామిలీ ప్రొటెక్షన్ ద్వారా కుటుంబ సభ్యుల మధ్య డిజిటల్ సేఫ్టీ భాగస్వామ్యంగా మారుతుంది, ఇది ట్రూకాలర్ యొక్క దైనందిన కమ్యూనికేషన్‌లో భాగంగా ఉండటానికి మరియు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌లకు ప్రేరేపించడానికి సహాయపడుతుంది. ఈ ఫీచర్ మొదట స్వీడన్, చిలీ, మలేషియా, కెన్యా మార్కెట్లలో ప్రారంభం కానుంది, భారతదేశంలో 2026 మొదటి త్రైమాసికంలో లాంచ్ చేయడం జిప్లాంట్. ట్రూకాలర్ దీన్ని ఫ్యామిలీ కమ్యూనికేషన్ సేఫ్టీని మరింత బలపరచడానికి మరియు రియల్–టైమ్ రక్షణతో భవిష్యత్ కమ్యూనికేషన్‌ను స్మార్టుగా, సురక్షితంగా, సమర్థవంతంగా మారుస్తుంది.

## కోటక్ మహింద్రా ఎసిట్రెక్ తో సహకారం ప్రారంభించింది

కోటక్ మహింద్రా ప్రైమ్ లిమిటెడ్ (కె.ఎం.పి.ఎల్.) మరియు టాటా మెమోరియల్ సెంటర్ (ఎసిట్రెక్) కలిసి నవీ ముంబైలో ఖార్ఘర్ ప్రోటన్ థెరపీ సెంటర్‌లో ఎస్డిఎక్స్ వాలంటరీ బ్రెత్ హోల్డ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు, దీని ద్వారా ఊపిరి తీసుకునే సమయంలో కేన్సర్ రోగులను గైడ్ చేసి, గరిష్ఠ ఖచ్చితత్వంతో రేడియేషన్ చికిత్స అందించవచ్చు. ముఖ్యంగా ఊపిరి వల్ల కదలే కేన్సర్‌లు (ఫెఫసు, కాలేయం, పాంక్రియాస్, ఉమ్ము) కోసం ఇది ఉపయోగకరం. ఎస్డిఎక్స్ సిస్టమ్ ఆరోగ్యమైన అవయవాలను రక్షించి, చికిత్స ఫలితాలను మెరుగుపరుస్తుంది. ఈ సాంకేతికత ఎసిట్రెక్ ప్రోటన్ థెరపీకి అనుకూలంగా ఉంటుంది మరియు స్టీరియోటాక్టిక్ బాడీ రేడియేషన్ థెరపీవంటి అధిక–ఖచ్చితత్వ, అధిక–డోస్ చికిత్సలకు అవకాశాన్ని ఇస్తుంది. ఎసిట్రెక్ ప్రతి సంవత్సరం 35,000 మందికి పైగా రోగులను చికిత్స చేస్తుంది, వీరిలో ఎక్కువ మంది ఆర్థికంగా బలహీనులే. కె.ఎం.పి.ఎల్. ఈ సిఎస్ఆర్ కార్యక్రమం ద్వారా ఆధునిక కేన్సర్ చికిత్సలను సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని అందించడంలో సహకరిస్తోంది. డాక్టర్ రాహుల్ కృష్ణాత్రి మరియు డాక్టర్ పంకజ్ చతుర్వేదీ ప్రకారం, ఈ సిస్టమ్ కేన్సర్ చికిత్సలో రోగుల జీవన రేటు పెంచే మరియు ప్రతికూల ప్రభావాలను తగ్గించే మైలురాయి సాధనం. కె.ఎం.పి.ఎల్. ఈ భాగస్వామ్యాన్ని సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో ఆరోగ్యంపై దృష్టి పెట్టిన కార్యక్రమంగా చూడటంతో, ప్రపంచ ప్రమాణాలకు తగిన కేన్సర్ కేర్ అందించడంలో ఎసిట్రెక్కు మద్దతు ఇస్తోంది.

## ఎలూరులో మొబైల్ నెట్‌వర్క్ పనితీరు విలువాంకనం

ట్రై నవంబర్ 2025లో ఆంధ్రప్రదేశ్ లైసెన్స్ సర్వీస్ ప్రాంతంలో ఎలూరు నగర మరియు పరిసర ప్రాంతాల్లో 348.6 కిమీ డ్రైవ్ టెస్ట్ ద్వారా మొబైల్ నెట్‌వర్క్ పనితీరు పరిశీలించింది. పట్టణ, గ్రామీణ, విద్యాసంస్థల హాట్‌స్పాట్స్ వంటి వాడుక వాతావరణాల్లో 2జి, 3జి, 4జి, 5జి సేవల నాణ్యతను అంచనా వేశారు. వాయిస్ సేవల్లో కాల్ సెట్ అప్ సక్సెస్ రేట్ ఎయిర్టెల్ 100%, ఆర్‌జెఐఎల్ 100%, విల్ 96.9%, బిఎస్ఎన్ఎల్ 92.84%; డ్రాప్ కాల్ రేట్లు అత్యల్పంగా ఉన్నాయి. కాల్ సెట్ టైమ్, కాల్ సైలెన్స్, ఎంఓఎస్ స్కోర్లు కూడా కొలిచారు. డేటా సేవల్లో సగటు డౌన్‌లోడ్ ఆర్‌జెఐఎల్ 250.84 ఎంబిపిఎస్, ఎయిర్టెల్ 151.23 ఎంబిపిఎస్, విల్ 22.87 ఎంబిపిఎస్, బిఎస్ఎన్ఎల్ 6.2 ఎంబిపిఎస్; అప్‌లోడ్ ఎయిర్టెల్ 21.61 ఎంబిపిఎస్, ఆర్‌జెఐఎల్ 20.45 ఎంబిపిఎస్, విల్ 4.85 ఎంబిపిఎస్, బిఎస్ఎన్ఎల్ 4.89 ఎంబిపిఎస్. లాటెన్సీ ఆర్‌జెఐఎల్ 23.21 ఎంఎస్, ఎయిర్టెల్ 45.12 ఎంఎస్, బిఎస్ఎన్ఎల్ 41.87 ఎంఎస్, విల్ 57.05 ఎంఎస్. పరీక్షలు బస్ స్టేషన్‌లు, రైల్వే స్టేషన్‌లు, కాలెక్టరేట్, కళాశాలలు, ఆసుపత్రులు, ఆలయాలు వంటి ప్రదేశాల్లో నడిపించి, వాస్తవ వాడుక పరిస్థితులను అంచనా వేశారు.



# జన గణనకు రూ.11,718 కోట్లు

● నిధుల కేటాయించిన కేంద్ర ప్రభుత్వం ● కేంద్రమంత్రివర్గం ఆమోదం కేటాయింపులు

న్యూఢిల్లీ : కేంద్ర కేబినెట్ 2027 జనాభా లెక్కల నిర్వహణ కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్ను ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం తెలిపారు. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. 2026-27ల్లో దేశవ్యాప్తంగా 2 దశల్లో జనగణన జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.వాస్తవానికి 2021లోనే జనగణన జరగాల్సి ఉంది. కానీ ఆనాడు కొవిడ్-19 మహమ్మారి విజృంభించడంతో జనాభా లెక్కల సేకరణను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో తదుపరి జనగణన 2027లో జరుగుతుందని కేంద్రం వెల్లడించింది. 2027 మార్చి 1ని రిఫరెన్స్ తేదీగా నిర్ణయించింది.భారతదేశంలో 150 ఏళ్లకు పైగా జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది. అందుకు సంబంధించిన రికార్డులు అన్నీ మన వద్ద ఉన్నాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దానికి కొనసాగింపుగా 2027 జనగణన చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా చూసుకుంటే ఈ జనగణన భారత్లో 16వది అవుతుంది. స్వతంత్ర్యం వచ్చిన తర్వాత అయితే 8వది అవుతుంది.ఈ జనగణనలో దేశంలోని మొత్తం జనాభా, గృహాలు, సౌకర్యాలు, విద్య, ఆర్థిక కార్యకలాపాలు, వలసలు లాంటి అనేక అంశాల డేటాను సేకరించనున్నారు. వార్డు, గ్రామం, పట్టణం స్థాయిల్లో ఈ జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. 1948 జనాభా లెక్కల చట్టం, 1990 జనాభా లెక్కల నియమాల ఆధారంగా ఈ సెన్సెస్-2027 జరగనుంది.

**2 దశల్లో జనగణన :** 2025 జూన్ 16న విడుదల చేసిన గెజిట్ ప్రకారం, ఈ జనగణన మొత్తం 2 దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశ 2026 ఏప్రిల్-



సెప్టెంబర్ మధ్య జరుగుతుంది. ఆయా రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సౌలభ్యాన్ని అనుసరించి 30 రోజుల వ్యవధిలో ఇది నిర్వహించబడుతుంది. ఈ దశలో హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ నిర్వహిస్తారు.రెండో దశ 2027 ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈ దశలో జనాభా గణన చేస్తారు. అయితే లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి మంచు ప్రాంతాల్లో, అక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి 2026 సెప్టెంబర్లో జనాభా లెక్కల సేకరణ చేస్తారు.

**డిజిటల్ జనగణన :**భారత్లో మొదటిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో జన గణన చేయనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మొబైల్ అప్లికేషన్స్ (ఆండ్రాయిడ్, ఐఓఎస్) ద్వారా డేటాను సేకరించి, దానిని మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా రియల్ టైమ్లో పర్యవేక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు స్వయంగా ఎన్యూమరేషన్ చేసుకోవడం కోసం, హౌస్లిస్టింగ్ కోసం ప్రత్యేక టూల్స్ (హౌస్లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ వెబ్ మ్యాప్ టూల్)ను కూడా ప్రవేశపెడుతున్నట్లు ఆయన చెప్పారు.

**కుల గణన కూడా అందులోనే! :** ఈ జనాభా లెక్కల సేకరణలో భాగంగానే కుల గణన కూడా చేయాలని గతంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయించింది. అందువల్ల ఈసారి కులాల డేటాను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరించనున్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇలా కుల గణన చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.భారత్లో జనగణన అనేది చాలా పెద్ద విషయం. అందుకే దీనిలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఆఫీసర్లు, సూపర్వైజర్లు, మాస్టర్ ట్రైనర్లు సహా లక్షల మంది ఫీల్డ్ ఫంక్షనరీలు పాల్గొంటారని ఓ అంచనా. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులే ఎక్కువ మంది ఉంటారు. వీరు తమ దైనందిన విద్యా బోధన కార్యకలాపాలు నిర్వహిస్తూనే, అదనంగా ఈ జనగణన కూడా చేయాల్సి ఉంటుంది. అయితే ఈ అదనపు పనికి వారికి గౌరవ వేతనం లభిస్తుంది. దేశంలో మొదటిసారిగా డిజిటల్ పద్ధతిలో జనాభా లెక్కల సేకరణ చేస్తున్నారు కాబట్టి, ఈ డిజిటల్ కార్యకలాపాల పర్యవేక్షణ, డేటా నిర్వహణ కోసం పెద్ద సంఖ్యలో సాంకేతిక సిబ్బందిని నియమించనున్నారు. కనుక వారికి తాత్కాలిక ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# కుదుటపడిన 'ఇండిగో' సంక్షోభం

● శీతాకాలం పొగమంచుపై కేంద్రం ఫోకస్ ● పొగమంచు వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు
● ప్రయాణీకులకు అవాంతరాలు కలగకుండా చూడాలి ● పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష

న్యూఢిల్లీ : ఇండిగో సంక్షోభం వల్ల వేల సంఖ్యలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇండిగో సంక్షోభం ఇప్పుడిప్పుడే కుదుటపడుతుండగా, పౌరవిమానయాన శాఖకు శీతాకాలం రూపంలో మరో సవాల్ ఎదురుకాబోతోంది. శీతాకాలంలో ఏర్పడే పొగమంచు ప్రభావం విమాన సర్వీసులపై తీవ్రంగా పడుతోంది. ఈ క్రమంలో పొగమంచు వల్ల ప్రయాణికులకు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపై కేంద్రం ఫోకస్ పెట్టింది.ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి ఎయిర్లైన్స్తో పాటు డీజీసీఏ, ఏఏఐ, సీఐఎస్ఎఫ్ వంటి నిర్వహణ సంస్థలతో సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు విమానయాన, నిర్వహణ సంస్థలకు దిశా నిర్దేశం చేశారు. విమాన సర్వీసులపై పొగమంచు ప్రభావాన్ని తగ్గించేందుకు తగిన ఎస్ఓపీలను అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విమానయాన కార్యకలాపాలను సజావుగా నిర్వహించాలని, రియల్ టైమ్ డేటా మార్పిడి, వార్ రూమ్ యాక్టివేషన్, కాట్ కంప్లైంట్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి రామ్మోహన్ తెలిపారు. ప్రయాణికులకు ఏదైనా అసౌకర్యం కలిగితే స్పష్టమైన జవాబుదారీతనంతో వ్యవహరించాలని చెప్పారు.

**ఇండిగో సంక్షోభం- రూ. 1,000 కోట్ల నష్టం!**

ఇదిలా ఉండగా ఇండిగో సంక్షోభం వల్ల దిల్లీలో వ్యాపార, పర్యాటక, పారిశ్రామిక రంగాలకు రూ. 1,000 కోట్ల నష్టం వాటిల్లిందని 'ది ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' వెల్లడించింది. విమాన రాకపోకల్లో అంతరాయం వల్ల వ్యాపారులు, పర్యాటకులు, బిజినెస్ ట్రావెలర్స్ రాకపోకలకు అంతరాయం కలిగిందని తెలిపింది. గత 10 రోజుల్లో దిల్లీ మార్కెట్లలో జనసంచారం దాదాపు 25% తగ్గిందని వివరించింది. దిల్లీ విమానాశ్రయం నుంచి నిత్యం 1.5 లక్షల ప్యాసింజర్లు ప్రయాణిస్తుంటారని, అందులో సుమారు 50 వేల మంది వ్యాపారులు, బిజినెస్ ట్రావెలర్స్ ఉంటారని పేర్కొంది. మరోవైపు ఇండిగో విమానాల రద్దు సంక్షోభానికి సంబంధించి డీజీసీఏ ఇప్పటికే చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఇండిగో స్లాట్లలో కోత విధించింది. నలుగురు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్స్పెక్టర్లపై సస్పెన్షన్ వేటు పడింది.



**'విమానాల రద్దు ఎంతో బాధను కలిగించింది' :** అంతకుముందు ఇండిగో సర్వీసుల అంతరాయంపై సంస్థ 'బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్' ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా స్పందించారు. ఇండిగో సంక్షోభం వల్ల చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ప్రతి అంశాన్నీ పరిశీలిస్తామని ఓ వీడియో ప్రకటనలో తెలిపారు. విమానాల రద్దు వల్ల వేలాది మంది ప్రయాణికులు ఎయిర్ పోర్టుల్లోనే చిక్కుకుపోయారని, ఇది తనకు ఎంతో బాధను కలిగించిందని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీని కోసం మేనేజ్మెంట్తో కలిసి పనిచేసేందుకు, సమస్య మూలాలను గుర్తించేందుకు బయటి నుంచి సాంకేతిక నిపుణులను చేర్చుకోవాలని బోర్డు నిర్ణయించిందని మెహతా చెప్పారు.



# జనవరి 30 నుంచి నిరాహార దీక్ష..

● ప్రకటించిన అన్నా హజారే ● లోకాయుక్త చట్టం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అసంతృప్తి
● మహారాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతూ దీక్ష

న్యూఢిల్లీ : ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే మరోసారి నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు. మహారాష్ట్రలో లోకాయుక్త చట్టం అమల్లో జాప్యం జరుగుతున్నందుకు నిరసనగా వచ్చే ఏడాది జనవరి 30న తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేపట్టనున్నారు .లోకాయుక్త చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నా హజారే మండిపడ్డారు. ప్రజాసంక్షేమానికి కీలకమైన ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. చట్టం అమలుకు గతంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు.లోకాయుక్త చట్టాన్ని తీసుకురావాలంటూ హజారే 2022లో నిరాహార దీక్ష చేపట్టారు. అయితే, అప్పటి ముఖ్యమంత్రి జోక్యంతో ఆయన దీక్షను విరమించారు. అనంతరం మహారాష్ట్ర అసెంబ్లీ లోకాయుక్త బిల్లుకు ఆమోదం కూడా తెలిపింది.అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం చట్టం అమలు జరగట్లేదని హజారే అన్నారు. ముఖ్యమంత్రి ఫడణవీస్కు ఈ విషయంలో 7 లేఖలు రాసినా స్పందన కరువైందని ఆక్షేపించారు. 'ఈ చట్టం ప్రజాసంక్షేమానికి ఎంతో అవసరం. నేను ఈ విషయంపై ఏడు లేఖలు రాశాను. కానీ అవతలి వైపు నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఇలా ఎందుకో నాకు అర్థం కావట్లేదు. ప్రభుత్వం ఉన్నదే ప్రజాసంక్షేమానికి, కేవలం ప్రదర్శనకు కాదు' అంటూ హజారే ఘాటు వ్యాఖ్యలు చేశారు. పరిస్థితి ముదరక మునుపే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు.

# నరేగా పేరు మార్పు



● కేంద్ర కేబినెట్ ఆమోదం ● పలు సంచలన నిర్ణయాలు తీసుకున్న కేంద్రం
● ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జనగణన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వంటి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రివర్గంలో తీసుకున్న అంశాలను వివరించారు.

**కీలక నిర్ణయాలు ఇవే..**

1. 2027లో రెండు విడతల్లో జరగనున్న జనగణన కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్ను కేబినెట్ ఆమోదించింది.ఈ జనగణనను డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి నిర్వహించనున్నారు.
2. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు 'పూజ్య బాపు గ్రామీణ రోజ్గార్ యోజన' (Pujya Bapu Grameen Rozgar Yojana)గా మారుస్తూ నిర్ణయం
3. ఈ పథకం కింద ఒక కుటుంబానికి ఏడాదికి ఉన్న గరిష్ఠ పని దినాలను 100 నుంచి 120 రోజులకు పెంచింది. రోజు కూలీని రూ.240గా నిర్ణయించింది. రూ.1.51 లక్షల కోట్లు కేటాయింపు.
4. బొగ్గు గనుల్లో పలు సంస్కరణలు తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.
5. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన.. ఈ పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది.
6. దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాల(Kendriya Vidyalayas) ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు 4, ఆంధ్రప్రదేశ్ కి 4 మంజూరు చేసింది.
7. నాలుగు కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం
8. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి NCDC కింద రూ.2,000 కోట్ల ఆర్థిక సహాయం
9. పీఎం కిసాన్ సంపద యోజన.. ఈ పథకానికి రూ.6,520 కోట్లు కేటాయింపు.
10. క్వాంటం టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి అదనంగా రూ.4,000 కోట్ల నిధులు కేటాయింపు
11. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ (MSME)లకు బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు లభించేందుకు వీలుగా రూ.15,000 కోట్లతో కొత్త క్రెడిట్ గ్యారెంటీ పథకానికి గ్రీన్ సిగ్నల్
12. దేశంలోని డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించడానికి సైబర్ దాడులను నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీ పాలసీకి ఆమోదం.
13. సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించేందుకు రూ.12,000 కోట్లు కేటాయింపు. కొత్త సెమీకండక్టర్ తయారీ కర్మాగారాలను నెలకొల్పే సంస్థలకు ఆర్థిక సహాయం పెంపు.
14. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అదనంగా 1.5 కోట్ల గృహాలను నిర్మించడానికి ఆమోదం
15. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి వీలుగా తమిళనాడులోని కులశేఖరపట్నం వద్ద కొత్త ప్రయోగ వేదిక (Launch Pad) నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
16. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని రక్షణ రంగంలో బలోపేతం చేయడానికి, రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(FDI) పరిమితి పెంపు
17. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలను అందించడానికి నేషనల్ టెలి-మెడిసిన్ నెట్వర్క్ ఏర్పాటుకు ఆమోదం
18. నీటిపారుదల పథకాలకు జాతీయ మిషన్ ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 ప్రధాన, మధ్యస్థ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి రూ.35,000 కోట్లతో ఒక కొత్త జాతీయ మిషన్ను ప్రారంభించేందుకు కేబినెట్ లైన్ క్లియర్ చేసింది.
19. భారత్ నెట్ ప్రాజెక్ట్ కింద ఇంటర్నెట్ సేవలు. ఇందుకోసం అదనంగా రూ.8,000 కోట్ల నిధులు కేటాయింపు
20. రాష్ట్రాల ఆర్థిక బలోపేతం కోసం ప్రత్యేక ప్యాకేజీ. ఇందులో భాగంగా రాష్ట్రాలు తమ మూలధన పెంచుకోవడానికి.. వడ్డీ లేని రుణాల రూపంలో రూ.1.3లక్షల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీకి గ్రీన్ సిగ్నల్

## కూటమి నిర్ణయాధికారం విజయ్‌దే..

**టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశంలో నిర్ణయం**



చెన్నై: వచ్చే శాసనసభ ఎన్నికల్లో కూటమి ఏర్పాటుపై నిర్ణయాధికారం పార్టీ అధ్యక్షుడు విజయ్‌కు అప్పగిస్తూ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) జిల్లా కార్యదర్శుల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కరూర్ దుర్ఘటనానంతరం విజయ్ మళ్లీ ప్రచారం కోసం ముమ్మర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18వ తేదీన ఈరోడ్లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వంలో గురువారం జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది.ఈ సమావేశం నాలుగు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ ఎన్నికల్లో(Assembly Elections) కూటమి ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకునే అధికారం పార్టీ అధ్యక్షుడు విజయ్కు అప్పగించింది. అదే విధంగా డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపి 'సరికొత్త తమిళనాడు' ఏర్పాటు చేయడం, కూటమి ఏర్పాటుపై చర్చలు, పార్టీ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు,కమిటీల్లో చోటుచేసుకునే సభ్యుల ఎంపిక అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు విజయ్కే కట్టబెట్టింది. అదే సమయంలో, జిల్లా కార్యదర్శులు, బూత్ కమిటీలు ప్రజలతో తరచూ సమావేశమవుతూ వారిని చైతన్యవంతం చేసి ఓట్లు పొందేలా కృషిచేయాలని ఆనంద్ పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు ఆదర్వ అర్జున, నాంజిత్ సంపత్, సెంగోట్టయన్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో సత్తాచాటిన తెలుగు వ్యక్తి

**భారతీయుల అతిపెద్ద సంస్థ ఎఫ్ఐఏ అధ్యక్షుడిగా శ్రీకాంత్ అక్కపల్లి**

అమెరికాలో భారతీయులు.. అందులోనా తెలుగు వారు గొప్ప ఖ్యాతి గడిస్తున్నారు. అమెరికాలోని అతిపెద్ద భారతీయుల సమూహానికి వచ్చే ఏడాదికి గానూ తెలుగు వ్యాపారవేత్త శ్రీకాంత్ అక్కపల్లి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఇక ఈ పదవి దక్కించుకున్న తొలి తెలుగు వ్యక్తిగా కూడా ఆయన రికార్డుల్లోకి ఎక్కారు. గత 50 ఏళ్లుగా ఎఫ్ఐఏ అమెరికాలోని భారతీయులకు సేవలు అందిస్తోంది. ఈ సంస్థకు అమెరికన్ కాంగ్రెస్లో గుర్తింపుతోపాటు.. పలు అవార్డులు కూడా ఉన్నాయి.అమెరికాలో తెలుగు వ్యక్తికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోనే భారతీయుల అతిపెద్ద సంస్థ అయిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆఫ్ యూఎస్ఏ-ఎఫ్ఐఏ అధ్యక్షుడిగా శ్రీకాంత్ అక్కపల్లి ఎన్నికయ్యారు. 2026 ఏడాదికి సంబంధించి ఎఫ్ఐఏ కొత్త కార్యనిర్వాహక బృందాన్ని ప్రకటించింది. స్వతంత్ర ఎన్నికల కమిషన్ నేతృత్వంలో జరిగిన వార్షిక అంతర్గత సమీక్ష, ఎంపిక ప్రక్రియ తర్వాత.. ప్రముఖ వ్యాపారవేత్త అయిన శ్రీకాంత్ అక్కపల్లి 2026 ఎగ్జిక్యూటివ్ టీమ్కు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీన ఎఫ్ఐఏ కొత్త అధ్యక్షుడిగా శ్రీకాంత్ అక్కపల్లి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.ఎఫ్ఐఏ స్వతంత్రంగా నియమించిన అలోక్ కుమార్, జయేష్ పటేల్, కెన్నీ దేశాయ్లతో కూడిన ఎన్నికల కమిషన్ 2026 నేతృత్వంలో జరిగిన వార్షిక అంతర్గత సమీక్ష, ఎంపిక ప్రక్రియ తర్వాత.. కమిషన్ సిఫార్సులకు ఎఫ్ఐఏ బోర్డు ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పడిన 2026 కార్యనిర్వాహక బృందం.. 2026 జనవరి 1వ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరిస్తుంది. ఈ ఏడాది ఎఫ్ఐఏ పునర్వ్యవస్థీకరణలో భాగంగా.. ఎన్నికల కమిషన్, ఎఫ్ఐఏ బోర్డు కలిసి కార్యనిర్వాహక బృందాన్ని క్రమబద్ధీకరించాలని.. ఈ కౌన్సిల్ను విస్తరించాలని నిర్ణయం తీసుకున్నాయి.ఇక ప్రస్తుత ఎఫ్ఐఏ అధ్యక్షుడు సౌరిన్ పారిఖ్ తర్వాత శ్రీకాంత్ అక్కపల్లి ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. వైస్ ప్రెసిడెంట్గా ప్రీతి రే పటేల్.. జనరల్ సెక్రటరీగా సృష్టి కౌల్ నరులా



కొనసాగనున్నారు. రియల్ ఎస్టేట్, టెక్నాలజీ, మీడియా వంటి పలు రంగాల్లో అపార అనుభవం ఉన్న శ్రీకాంత్ అక్కపల్లి.. ఎఫ్ఐఏ సంస్థ ప్రాంతీయ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ.. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పదవిని పొందిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 50 ఏళ్లకు పైగా అమెరికాలో సేవలు అందిస్తున్న ఈ ఎఫ్ఐఏ స్వచ్ఛంద సంస్థకు కాంగ్రెషనల్ రికార్డ్లో గుర్తింపుతోపాటు.. ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డు, రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు కూడా ఉండటం విశేషం.ఇక ఎఫ్ఐఏ కొత్త అధ్యక్షుడు శ్రీకాంత్ అక్కపల్లి.. ఒక బిజినెస్మెన్. ఆయన బిజినెస్లు అమెరికాలోనే కాకుండా భారత్లోనూ విస్తరించి ఉన్నాయి. రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్, టెక్నాలజీ, మీడియా, ప్రవాస భారతీయ భాగస్వామ్యం వంటి రంగాల్లో ఆయన వ్యాపారాలను విస్తరించారు. మల్టీ నేషనల్ సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, ట్రాన్సిట్ టెక్నాలజీ కన్సల్టింగ్, లైఫ్ సైన్సెస్, ఐటీ, క్లౌడ్ కంప్యూటింగ్, క్రీడా సామగ్రి తయారీ, ప్రీమియం ఫర్నిచర్ డిజైన్ వంటి విభిన్న రంగాల్లో ఉన్నాయి.ఇక ఎఫ్ఐఏ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మాట్లాడిన శ్రీకాంత్ అక్కపల్లి.. తనకు మద్దతు తెలిపిన బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్కు ధన్యవాదాలు తెలిపారు. ఇది అదృష్టంగా భావిస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాలోని తూర్పు తీరంలో ఉన్న 8 రాష్ట్రాల్లో భారతీయ సమాజాన్ని ప్రతిబింబిస్తూ.. 1970లో లాభాపేక్ష లేకుండా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆఫ్ యూఎస్ఏను ఏర్పాటు చేశారు. గత 50 ఏళ్లుగా అమెరికాలో ఈ సంస్థ తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

# ప్రపంచంలో మరో సరికొత్త కూటమి 'సీ-5'?

● కోర్ -5 గ్రూప్ ఏర్పాటుకు ట్రంప్ ప్లానింగ్
● భారత్, చైనా, రష్యా, జపాన్తో జట్టు సాధ్యమేనా?
● అమెరికా రూటు మార్చుకుంటోందంటూ కథనాలు



వాషింగ్టన్ మారిపోతున్న అంతర్జాతీయ సమీకరణాలకు అనుగుణంగా సరికొత్త కూటమి ఏర్పాటు దిశగా అగ్రరాజ్యం అమెరికా కసరత్తు చేస్తోంది. ఆ కూటమికి 'కోర్ 5' లేదా 'సీ5' అని పేరు పెట్టే అవకాశం ఉందంటూ అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇందులో అమెరికా, భారత్, రష్యా, చైనా, జపాన్ సభ్యదేశాలుగా ఉంటాయని కథనాల్లో ప్రస్తావించారు. ఇప్పటికే ప్రపంచ అగ్రరాజ్యాలు, సంపన్న దేశాలతో 'జీ7' కూటమి ఉంది. అమెరికా, ఐరోపా దేశాలతో 'నాటో' కూటమి ఉంది. ఈ రెండు కూటములపైనా ఐరోపా దేశాల ప్రభావం ఎక్కువగా ఉంది. మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల నేపథ్యంలో ఐరోపా దేశాల ప్రభావం నుంచి బయటికొచ్చే ప్రయత్నాలను అమెరికా మొదలుపెట్టింది. ఈక్రమంలోనే భారీ జనాభా, అత్యాధునిక సైనిక సంపత్తి, భౌగోళిక ప్రాధాన్యత, అతిపెద్ద వాణిజ్య మార్కెట్ కలిగిన అతి ముఖ్యమైన దేశాలతో ఒక కొత్త కూటమిని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ సర్కారు రూపొందించిన 'జాతీయ భద్రతా వ్యూహం' ముసాయిదా ప్రతుల్లో సీ5 కూటమి ఏర్పాటు ప్రతిపాదన ఉందని అమెరికా మీడియా పేర్కొంది.

**రష్యా, చైనాలతో అమెరికా దోస్తీ సాధ్యమేనా? :** రష్యా లాంటి శత్రుదేశాన్ని కలుపుకొని అమెరికా కూటమిని ఏర్పాటు చేయడం అసాధారణ అంశంగా కనిపిస్తున్నప్పటికీ, అది షాకింగ్ విషయమేం కాదని అమెరికా మీడియా కథనాల్లో విశ్లేషించారు. సైద్ధాంతికంగా చైనా, రష్యాలతో అమెరికాకు పొసగదు. అయినప్పటికీ సీ5 కూటమిలో ఈ రెండు దేశాలు ఉండాలని అగ్రరాజ్యం కోరుకుంటోందట. తద్వారా ఆయా దేశాలతోనూ దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని ట్రంప్ సర్కారు భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి సున్నిత అంశాల్లో తాము సత్వర ఫలితాలను సాధించేందుకు సీ5 కూటమి ఉపయోగపడుతుందని అమెరికా అంచనా వేస్తోంది. సున్నిత అంశాలపై వీలైనంత త్వరగా భారత్, చైనా, రష్యా, జపాన్ దేశాల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ కూటమి వేదికగా ఉపయోగపడుతుందని కోరుకుంటోంది.

**సీ5 కూటమి ఎలా పనిచేస్తుంది? :** అమెరికా మీడియా కథనాల ప్రకారం, అంతర్జాతీయ స్థాయి సున్నిత అంశాలపై చర్చించే వేదికగా సీ5 కూటమి ఉండాలని అమెరికా కోరుకుంటోంది. అయితే ఈ కూటమిని ఎలా నిర్వహించాలి? దీనిలో ఏ సభ్య దేశం ప్రభావశీలత ఎంతమేర ఉండాలి? అనే దానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఏటా ఏదైనా ఒక నిర్దిష్ట అజెండాపై చర్చించేందుకు శిఖరాగ్ర సమావేశాలను నిర్వహించాలనే ప్రతిపాదన ముసాయిదాలో ఉంది. పశ్చిమాసియా ప్రాంత భద్రత, ఇజ్రాయెల్ - సౌదీ అరేబియా సంబంధాల బలోపేతం, శాస్త్ర సాంకేతిక విభాగాల్లో పోటీ వంటి ఏదైనా ఒక టాపిక్పై ఏటా శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించాలని అమెరికా యోచిస్తోంది.

**సీ5 కూటమితో అమెరికాకు ప్రయోజనమేంటి? :** ఐరోపా దేశాల ప్రభావంలో చిక్కుకోకుండా, సరికొత్త ప్రపంచ శక్తులుగా అవతరించిన భారత్, చైనా, రష్యా, జపాన్లతో చేతులు కలపడం దీర్ఘకాలంలో ప్రయోజనకరంగా ఉంటుందని ట్రంప్ సర్కారు భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆశాజనక ఫలితాలను సాధించేందుకు నూతన ప్రపంచ శక్తులతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకొని తీరాల్సిందే అనే వాస్తవాన్ని అమెరికా గుర్తించిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. భారత్, చైనాల్లో చెరో 142 కోట్లకుపైగా జనాభా ఉండగా, అమెరికాలో 34 కోట్లు, రష్యాలో 14 కోట్లు, జపాన్లో 12 కోట్ల జనాభా ఉంది. ఈ దేశాలు వ్యూహాత్మకంగా యావత్ ప్రపంచానికి చాలా కీలకమైనవి. చాలావరకు ప్రపంచ దేశాలు వీటిలో ఏదో ఒక దేశంతో వ్యూహాత్మక వాణిజ్య, సైనిక, ఆర్థిక సంబంధాలను కలిగి ఉన్నాయి. అందుకే సీ5 కూటమి ఏర్పాటు తమకూ ప్రయోజనకరంగానే ఉంటుందని అమెరికా ఆశిస్తోంది.

**ఐరోపాపై రష్యాకు పట్టు- చైనా విషయంలో అమెరికా యూటర్న్ :** అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకుల ప్రకారం, ఒకవేళ సీ5 కూటమిని అమెరికా ఏర్పాటు చేస్తే, ఐరోపా ఖండంపై రష్యా ప్రభావాన్ని అగ్రరాజ్యం గుర్తించినట్లు అవుతుంది. అదే జరిగితే ఐరోపా దేశాల్లో నాటో కూటమి, జీ7 కూటమి ప్రాధాన్యత తగ్గిపోవచ్చు. ఈ కూటమి ఏర్పాటైతే, చైనా విషయంలో ట్రంప్ సర్కారు యూటర్న్ తీసుకున్నట్లుగా భావించాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఇండో-పసిఫిక్ సముద్ర జలాల్లో అంతర్జాతీయ సమీకరణాలు మారిపోతాయి. జాతీయ ప్రయోజనాలకు, నాటో, జీ7 కూటములకు విఘాతం కలిగించని రీతిలో సీ5 కూటమిని ముందుకు తీసుకెళ్లే సమగ్ర వ్యూహం ఉంటేనే ఈ ప్రయత్నంలో అమెరికా సక్సెస్ అవుతుంది. భారత్, చైనా, రష్యాలు ఈ కొత్త కూటమిలో చేరేందుకు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అవి ఈ కూటమి కోసం తమ ప్రాంతీయ ప్రయోజనాలను, సమీకరణాలను ఫణంగా పెట్టవు.

**అలాంటి 'వ్యూహమేం' లేదు : వైట్ హౌస్ :** 'జాతీయ భద్రతా వ్యూహం' ముసాయిదా ప్రతులను ట్రంప్ సర్కారు సిద్ధం చేసిందనే వార్తా కథనాలను వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ అన్నా కెల్లీ ఖండించారు. అలాంటి డాక్యుమెంట్ ఏదీ రూపొందించలేదని ఆమె తేల్చి చెప్పారు. ప్రైవేటు విజన్ లేదా రహస్య విజన్తో 33 పేజీల డాక్యుమెంట్ను తయారు చేశారనే వార్తల్లో వాస్తవికత లేదన్నారు.

జెన్ జెడ్ నిరసనలతో

# కుప్పకూలిన మరో ప్రభుత్వం..

**రాజీనామా చేసిన బల్గేరియా ప్రధాని**



బల్గేరియా : బల్గేరియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పెరిగిన అవినీతి ఆరోపణలు, దేశవ్యాప్త నిరసనల కారణంగా ప్రధాని రొసెన్ జెలియాజ్కోవ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రాజీనామా చేసింది. ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్లో ఓటింగ్ జరగడానికి ముందే.. నిరసనకారుల గళాన్ని గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ముఖ్యంగా జనవరి 1న బల్గేరియా యూరోజోన్లో చేరేందుకు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్న కీలక తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం దేశ రాజకీయాల్లో అనూహ్య మలుపుగా మారింది. బల్గేరియాలో జెన్ జెడ్ సాగించిన అవినీతి వ్యతిరేక ఆందోళనల ధాటికి ప్రధాని రొసెన్ జెలియాజ్కోవ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకముందే.. తమ ప్రభుత్వం రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని గురువారం ప్రకటించారు. పార్లమెంట్లో ప్రతిపక్షం ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగడానికి కొద్దిసేపటి ముందే ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు.

**ఆందోళనలకు కారణాలివే..! :** బల్గేరియాలో అవినీతికి వ్యతిరేకంగా వేలాది మంది యువజనులు బుధవారం దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ నిరసనలకు ప్రధాన కారణం ప్రభుత్వం రూపొందించిన 2026 ముసాయిదా బడ్జెట్. ఈ బడ్జెట్ అవినీతిని కప్పిపుచ్చేందుకు రూపొందించిందని యువతరం తీవ్రంగా మండిపడింది. ఈ ముసాయిదాపై ఆగ్రహించిన నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం గత వారం ఈ ముసాయిదా బడ్జెట్ను ఉపసంహరించుకున్నప్పటికీ.. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఏ మాత్రం చల్లారలేదు. యువతరం అవినీతి, పాలన లోపాలపై నిరసన కొనసాగించడంతో.. జెలియాజ్కోవ్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీవ్రమైంది.ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షం ప్రవేశ పెట్టడం, దేశవ్యాప్త నిరసనలతో ప్రజాగ్రహం పెరగడంతో ప్రధాని రొసెన్ జెలియాజ్కోవ్.. అధికార పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశం అనంతరం ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రాజీనామా చేయడమే సరైన నిర్ణయమని ప్రకటిస్తూ.. గురువారం తన రాజీనామాను సమర్పించారు. ఈ పరిణామం బల్గేరియా రాజకీయాల్లో అస్థిరతకు దారి తీసింది. పూర్తిస్థాయి ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి చేయకుండానే కూలిపోవడంతో.. దేశంలో ఆకస్మిక ఎన్నికలు అనివార్యం కానున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2020 నుంచి ఇప్పటి వరకు 7 సార్లు ఎన్నికలు 2020లో బొయికో బోరిస్సోవ్ ప్రభుత్వాన్ని అవినీతి వ్యతిరేక నిరసనలు కూల్చినప్పటి నుంచి దేశంలో ఏడు ఎన్నికలు జరిగాయి. ఈసారి రాజీనామా చేయకముందు కూడా జెలియాజ్కోవ్ ప్రభుత్వం ఐదు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని గట్టెక్కింది. రాజీనామా తర్వాత కూడా మంత్రులు కొత్త మంత్రివర్గం ఎన్నికయ్యే వరకు తమ పాత్రలను కొనసాగిస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.




# నా పై ఆరోపణలకు సమాధానం చెప్పాలి

- క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తా
- తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా
- వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త
- కవిత హెచ్చరిక



తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త అని ఆమె హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. "కేసీఆర్‌తో పాటు ఎవరినైనా ఒక్క పనైనా అడిగామా? దమ్ముంటే నా ఆరోపణలకు సమాధానం ఇవ్వండి. నాకు ఎవరితోనూ అవగాహన లేదు.. వ్యాపారాలు లేవు. మాధవరం కృష్ణారావుకు నోటీసులు పంపుతున్నా. వారంలో క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తాను. ఏవీరెడ్డితో పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి భూలావాదేవీలు ఉన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి నిరంతరం కేటీఆర్ వద్ద ఉంటారు. ఆయన ఎవరి బినామీనో చెప్పాలి. మాధవరం కృష్ణారావు చాలా చిన్న వ్యక్తి. ఓ గుంట నక్క ఆయన వెనక ఉండి ఆడిస్తోంది. కృష్ణారావు బాధితులు చాలామంది నాకు ఫోన్లు చేస్తున్నారు. ప్రణీత్, ప్రణవ్ కంపెనీల్లో కృష్ణారావు కుమారుడు డైరెక్టర్. ఆ కంపెనీల విల్లాలన్నీ కబ్జాల్లో కట్టినవే. వెంచర్ మధ్యలోని 10 ఎకరాల చెరువు 6 ఎకరాలకు ఎలా తగ్గింది? సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా ఆ చెరువు సంగతి చూడాలి. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి పేరిట చెరువునే మింగేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో నాకు సంబంధం లేదు. ఎంపీగా ఉన్నప్పుడు దిల్లీ, నిజామాబాద్‌కే పరిమితమయ్యా. పార్టీ నుంచి వెళ్లగొట్టారు కదా.. ఇంకా కళ్లు చల్లబడలేదా? హిల్ట్ పాలసీకి బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే.. కాంగ్రెస్ ద్వారాలు తెరుస్తోంది. నాతో పాటు నా భర్తపై బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తోంది. గత ప్రభుత్వంలో చాలా తప్పిదాలు జరిగాయి. దేవుడి దయతో నేను ముఖ్యమంత్రి అవుతాను. 2014 నుంచి జరిగిన అన్ని అన్యాయాలను వెలికితీస్తాను" అని కవిత వ్యాఖ్యానించారు

## కేబినెట్ హోదాలపై పిల్

### హైకోర్టు కీలక ఆదేశాలు

తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలతో సహా కొందరికీ కేబినెట్ హోదా కల్పిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓ జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత ఏరోళ్ల శ్రీనివాస్ తెలంగాణ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై శుక్రవారం విచారణ జరిగింది.
కాంగ్రెస్ నేతలు కేశవరావు , పోచారం శ్రీనివాసరెడ్డి , సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డిలతోపాటు మరో తొమ్మిది మందికి కేబినెట్ హోదా చట్ట విరుద్ధమని పిటిషన్‌లో ప్రస్తావించారు. రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంతో చీఫ్ జస్టిస్ బెంచ్ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యేల సంఖ్యలో 15 శాతం మాత్రమే కేబినెట్ హోదా ఇవ్వాలని వాదనలు వినిపించారు.
ముఖ్యమంత్రి, మంత్రులకు మాత్రమే కేబినెట్ హోదా ఉంటుందని వివరించారు ఏరోళ్ల శ్రీనివాస్. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసి పుచ్చి ఓ నెంబర్ కేటాయించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కల్పించడాన్ని సవాల్ చేస్తూ 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్ దాఖలు చేశారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వేసిన పిల్‌తో పాటు బీఆర్ఎస్ పిటిషన్లను కలిపి వచ్చే వారంలో విచారణకు తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది తెలంగాణ హైకోర్టు.

### పంచాయతీ రాజ్ పర్యవేక్షణాధికారికి అభినందనలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరేట్ లో సూపరింటెండెంట్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కాసుల క్రాంతి కిరణ్ కు పలువురు జర్నలిస్టు నేతలు అభినందనలు తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, రాష్ట్ర నాయకులు జే.ఉదయ్ భాస్కర్ రెడ్డి తదితరులు శుక్రవారం ఆయనను కలిసి బొకే శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. మొన్నటి వరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దగ్గర పీఏగా పనిచేసిన క్రాంతి కిరణ్ బదిలీ పై పంచాయతీరాజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

## తెలంగాణ కుంభమేళా

- మేడారం మహా జాతర
- మంత్రి కొండా సురేఖ పర్యవేక్షణలో అభివృద్ధి పనులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కోట్లాది భక్తులు కొంగు బంగారంగా పిలిచే తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి కొండా సురేఖ పర్యవేక్షణలో రూ. 251 కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.
సమ్మక్క-సారక్క గద్దెల పునర్నిర్మాణం, రహదారి విస్తరణ, సమగ్ర పార్కింగ్ సౌకర్యాలు, భక్తుల కోసం ఆధునిక వసతుల ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయి.సమ్మక్క-సారక్కల ఘనతను ప్రపంచానికి చాటి చెప్పేలా, మేడారం జాతరకు శాశ్వత ముద్ర వేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

## కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు.. బీఆర్ఎస్, బీజేపీ ఒకటయ్యాయి..

- సొంత ఊరిలో కాంగ్రెస్ ఓటమిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందన
- బీఆర్ఎస్-బీజేపీ కుమ్మక్కు అని ఆరోపణ
- అభ్యర్థుల ఎంపికలో లోపాల స్వీకారం
- రెండో విడతకు కాంగ్రెస్ సిద్ధత



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తన సొంత గ్రామంలో కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ అభ్యర్థి ఓటమికి బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై, తమ వెనుక కొన్ని శక్తులను ఉంచి నడిపించాయని ఆయన ఆరోపించారు. ఓటమిపై సమీక్ష నిర్వహించి, రెండో విడత స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.
సర్పంచ్ ఎన్నికలలో ప్రజలు పార్టీ సింబల్స్ కాకుండా వ్యక్తిని చూసి ఓటు వేస్తారని అనిరుధ్ రెడ్డి అన్నారు. ఇప్పుడు గెలుపొందిన అభ్యర్థి గత రెండు ఎన్నికల్లో కూడా ఓటమిపాలవడం, ఈసారి ఆ వ్యక్తికి ప్రజలు ఒక అవకాశం ఇచ్చి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఓటమికి స్వయం విమర్శ చేసుకుంటూ, తాను ఇతర గ్రామాల ఇష్యూస్‌లో ఎక్కువగా దృష్టి పెట్టడం వల్ల, సొంత ఊరే కదా సపోర్ట్ చేస్తారులే అనుకొని కొంచెం నిర్లక్ష్యం జరిగిందేమోనని అనుకుంటున్నానని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.
రాజాపూర్, నవాబ్‌పేట మండలాల్లోని స్థానిక ఎన్నికల ఫలితాలపై వచ్చిన విమర్శలకు ఆయన బదులిచ్చారు. నవాబ్‌పేట మండలంలో కాంగ్రెస్ అభ్యర్థులు 50 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధించారని తెలిపారు. చాలా గ్రామాల్లో బీఆర్ఎస్ అసలు అభ్యర్థులనే నిలబెట్టలేదని, గతంలో ఓడిపోయిన ఇండిపెండెంట్ అభ్యర్థులను బీఆర్ఎస్ వెనుక ఉండి నడిపించిందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, సర్పంచ్ ఎన్నికలలో ఎవరైనా గెలవవచ్చు అని తాను స్టేట్‌మెంట్ ఇవ్వడం వల్ల కొన్నిచోట్ల కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు నిలబడటం వల్ల కొన్ని స్థానాలు కోల్పోవాల్సి వచ్చిందని, అయితే ఓవరాల్‌గా కాంగ్రెస్ మంచి ఫలితాలే సాధించిందని నొక్కి చెప్పారు.రెండో విడత ఎన్నికల కోసం తమ పార్టీ సిద్ధమవుతున్నట్లు అనిరుధ్ రెడ్డి తెలిపారు. మొదటి విడతలో జరిగిన మిస్టేక్స్, ముఖ్యంగా ఒకే స్థానంలో ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులు నిలబడటం వంటి లోపాలు రెండో, మూడో విడతల్లో జరగకుండా చూస్తామని, దీని కోసం ఇమ్మీడియట్‌గా రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసుకుంటున్నామని ఆయన ప్రకటించారు. చివరగా, "గెలిచిన వాళ్లంతా మా వాళ్లే, ఓడిన వాళ్లు కూడా మా వాళ్లే. అన్ని గ్రామాలు నావే" అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు.

## సీఎం రేవంత్ గ్లోబల్ సమ్మిట్‌లో ఫుట్ బాల్ ఆడడం ఏమిటి

- సీఎం రేవంత్ ఫుట్ బాల్ పేరుతో ఆర్థిక నేరానికి పాల్పడుతున్నారు
- 100 కోట్లు దుర్వినియోగం చేస్తున్నారు
- దీని మూలంగా ఏ శాఖకు మేలుకు జరుగుతుందో చెప్పాలి
- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడుతున్నారు
- సింగరేణి కార్మికులను ఆదుకోవచ్చు కదా
- బీజేఎల్‌పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఎవడబ్బ సొమ్మని సీఎం రేవంత్ రెడ్డి తన ఫుట్ బాల్ సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు, ఇది ముమ్మాటికీ ఆర్థిక నేరమే అవుతుందని బిజెపి నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్ను ఫుట్ బాల్ ఆడుకుంటారు, సీఎం ఫుట్ బాల్ సరదా కోసం రూ.100 కోట్లకుపైగా ఖర్చు పెట్టడం ప్రజాధనం దుర్వినియోగం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడానికి ప్రభుత్వం రూ.ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోందో, ఏ యో శాఖల నుంచి ఖర్చు చేస్తోందో, ఎందుకు ఖర్చు చేస్తోందో సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ టీమ్ ను సింగరేణి స్పాన్సర్ చేస్తోందని మీడియాలో చూసాను. ఈ ఫుట్ బాల్ ఆట కోసం సింగరేణి డబ్బులను ఎంత ఖర్చు చేస్తున్నారు. ఎందుకు ఖర్చు చేస్తున్నారు.
ఇవే డబ్బులను సింగరేణిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి లేదంటే కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయవచ్చు కదా అని అన్నారు. ప్రభుత్వ శాఖలేవైనా దుబారా ఖర్చులు చేస్తే ను కట్టడి చేయాల్సిన సీఎం, స్వయంగా తన సరదా కోసం దుబారా చేయడం ఆర్థిక నేరమే అవుతుందన్నారు. మెస్సీ టీమ్ తో రేవంత్ టీమ్ ఫుట్ బాల్ ఆడడం వల్ల రాష్ట్రానికి వచ్చే ప్రయోజనమేంటో సీఎం చెప్పాలన్నారు. మరి మెస్సీకి ఇచ్చే అప్పీయరెన్స్ ఫీజు ఏ ప్రభుత్వ శాఖ ఇస్తోంది. దాని వల్ల కలిగే ప్రయోజనమేంటి అని ప్రశ్నించారు.
ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో ఈ మూడు శాఖలకు కలిగే ప్రయోజనమేంటి దేశంలోనే అత్యుత్తమ పది క్రికెట్ గ్రౌండ్లలో ఒకటైన ఉప్పల్ స్టేడియానికి ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ తో తూట్లు పొడుస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం ఉప్పల్ క్రికెట్ గ్రౌండును ఫుట్ బాల్ గ్రౌండుగా మార్చాలి. మ్యాచ్ ముగిసాక మళ్లీ దాన్ని క్రికెట్ గ్రౌండుగా మార్చాలి. దీని కోసం రూ.10 కోట్ల వరకు ఖర్చు కావచ్చుట. మరి ఇదంతా దుబారా కాదా, దీని వల్ల ఉప్పల్ క్రికెట్ గ్రౌండ్ నాణ్యత దెబ్బతినదా అని ప్రశ్నించారు. కానీ గ్లోబల్ సమ్మిట్ మూడు నెలల క్రితం డిసైడ్ అయింది. మరి వాస్తవాలు ఇలా ఉంటే సీఎం, మంతులు గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా ఫుట్ బాల్ మ్యాచ్ అనడం సిగ్గుచేటు అని అన్నారు. సీఎం రేవంత్ తన సరదా కోసం ఫుట్ బాల్ ఆడుకునేట్టయితే, అందుకు స్పాన్సర్లను చూసుకోవాలి. కానీ సర్కార్ సొమ్ముతో ఫుట్ బాల్ ఆడడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమే అని అన్నారు.
సర్కార్ ఈ కార్ రేసింగ్ ఈవెంట్ ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందంటున్న రేవంత్ సర్కార్ ... మరి ఇపుడు ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడం ప్రజాధనం దుర్వినియోగం కాదా. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి శిక్షార్హుడు కాదా అని ప్రశ్నించారు. ఫుట్ బాల్ మ్యాచ్ నిర్వహణ కోసం ప్రజాధనం ఖర్చు చేయడంపై క్యాబినెటు భేటీలో చర్చ జరిగిందా. మరి రూ.వంద కోట్లకు పైగా జనం సొమ్మును ఖర్చు చేస్తున్నపుడు క్యాబినెట్ అనుమతి అవసరం లేదా అని ప్రశ్నించారు. మేం లేవనెత్తిన ఈ ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పిన తర్వాతనే ఫుట్ బాల్ మ్యాచ్ ఆడాలి. లేదంటే ఈ ఫుట్ బాల్ మ్యాచ్ కు వ్యతిరేకంగా మరిన్ని బిజెపి నిరసన కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో వీళ్లే అదృష్టవంతులు

## ఒక్క ఓటుతో బయటపడ్డ అభ్యర్థులు వీరే




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణలో తొలి దశ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయి. తొలివిడతకు సంబంధించి మొత్తం 4,236 పంచాయతీలకు నోటిఫికేషన్ ఇవ్వగా గురువారం 3,836 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ విడతలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు సత్తా చాటారు. మొదటి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థులు ఉండగా.. బీఆర్ఎస్ రెండో స్థానానికి పరిమితమైంది. మరోవైపు.. బీజేపీ కంటే ఇతరులకు ఎక్కువ సీట్లు రావడం గమనార్హం. తొలి విడతలో మొత్తం పోలింగ్ శాతం 84.28 కాగా.. యాదాద్రిలో అత్యధికంగా 92.88 శాతం పోలింగ్ నమోదైంది. అయితే.. తొలి విడతలో చాలా మంది అదృష్టవంతులు ఉన్నారు. అనేక మంది కేవలం ఒక్క ఓటు తేడాదితో గెలుపొందారు. పూర్తి వివరాల గురించి తెలుసుకుందాం..
1.కుమురం భీం జిల్లా: జిల్లా పరిధిలోని కెరమెరి మండలంలోని పరందొలి గ్రామ సర్పంచిగా రాథోడ్ పుష్పలత ఒక్క ఓటుతో విజయ ఢంకా మోగించింది. ప్రత్యర్థి దిలీప్‌పై ఒకే ఓటు ఆధిక్యంతో గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఈ ఊర్లో ఉన్న 873 ఓట్లకుగానూ.. దిలీప్‌కు 101 ఓట్లు, పుష్పలతకు 102 ఓట్లు సాధించారు. ఈ గ్రామ పంచాయతీలో మొత్తం ఏడుగురు అభ్యర్థులు బరిలో దిగారు. చివరికి పుష్పలకు అదృష్టం వరించింది.
2. కామారెడ్డి జిల్లా: రాజంపేట మండలంలోని నడిమి తండా గ్రామ పంచాయతీలో ఇదే తరహా ఘటన జరిగితంది. ఇక్కడ సైతం కేవలం ఒక్క ఓటు తేడాతో బానోత్ లక్ష్మి తన సమీప ప్రత్యర్థి బానోత్ సునీతపై గెలిచింది. లక్ష్మికి 290 ఓట్లు రాగా సునీతకు 289 ఓట్లు వచ్చాయి. దీంతో ఒకే ఓటు తేడాతో లక్ష్మి విజయం సాధించినట్లు అధికారులు స్పష్టం చేశారు.
3. నిర్మల్ జిల్లా: నిర్మల్ జిల్లా కడెం మండలం కల్లెడలో తాటి రుక్మిణీదేవి, వెంబడి లక్ష్మి అనే ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో రుక్మిణికి 343, లక్ష్మికి 343 ఓట్లు వచ్చాయి. కానీ.. ఇక్కడ లక్ష్మిని దురదృష్టం వెంటాడింది. లక్ష్మికి వచ్చిన ఓట్లలో ఒక ఓటు చెల్లుబాటు కాలేదు. దీంతో రిటర్నింగ్ అధికారులు ఆ ఓటు తిరస్కరించారు. అనంతరం రీ కౌంటింగ్ నిర్వహించారు. అభ్యర్థుల సమక్షంలోనే అధికారులు చెల్లని ఓటును గుర్తించి లెక్కింపు చేపట్టారు. దీంతో ఒకే ఓటు ఆధిక్యంతో రుక్మిణీదేవి విజయం సాధించింది.
4. జనగామ జిల్లా: జిల్లా పరిధిలో చెల్లని ఓటు ఓ గ్రామ సారథిని మార్చేసింది. ఈ కథ రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా గంపల నర్సయ్య, అదే పార్టీ నుంచి రెబల్‌గా పోటీ చేసిన గడ్డం జోజిది. ఓట్ల లెక్కింపులో జోజికి 211 ఓట్లు, నర్సయ్యకు 210 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడా రావడంతో తిరిగి లెక్కించాలని నర్సయ్య, ఆయన తరపు నాయకులు పట్టుబట్టారు. అధికారులు అభ్యర్థుల ముందే లెక్కించారు. దీంతో జోజికి పడిన ఓట్లలో ఒకటి చెల్లనిదిగా అధికారులు గుర్తించారు. దీంతో చెరో 210 ఓట్లు వచ్చినట్లు అధికారులు తేల్చారు. ఇరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చినప్పుడు ఫలితం కోసం డ్రా తీశారు. దీంతో ఆ డ్రాలో జోజి గెలిచారు.
5. నిజామాబాద్ జిల్లా మూడు సార్లు కౌంటింగ్: జిల్లా పరిధిలోని బోధన్ మండలం కల్దుర్కి గ్రామ పంచాయతీలో ఆసక్తికరం, ఉత్కంఠగా ఓట్ల లెక్కింపు కొనసాగింది. అధికార్లు ఎంతో ఓపికగా మూడు సార్లు లెక్కింపు చేపట్టారు. మొదటిసారి లెక్కింపులో కాంగ్రెస్ మద్దతుదారు నరేందర్‌రెడ్డికి 866, మరో అభ్యర్థి శ్రీనివాస్‌కు 863 ఓట్లు వచ్చాయి. దీంతో తక్కువ ఓట్లు వచ్చిన శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో సారి లెక్కింపు చేపట్టాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు రెండో మారు లెక్కింపు చేపట్టారు. క్షుణ్ణంగా పరిశీలించి లెక్కించిన అధికారులు నరేందర్‌రెడ్డికి పోలైన వాటిలో 5, శ్రీనివాస్‌కు పడిన వాటిలో 3 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. దీంతో నరేందర్‌రెడ్డికి 861, శ్రీనివాస్‌కు 860 ఓట్లు దక్కాయి. కానీ.. అభ్యర్థి శ్రీనివాస్ నిరాశ వ్యక్తం చేస్తూ.. మూడో సారి లెక్కింపు జరపాలని డిమాండ్ చేశారు. చేసేదేమి లేక అధికారులు అభ్యర్థుల ముందే లెక్కింపు చేపట్టారు. ఈసారి సైతం నరేందర్‌రెడ్డి 861 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయనే గ్రామ సర్పంచ్‌గా రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు.

# ఉప్పల్ స్టేడియం భద్రత కట్టుదిట్టం

- మెస్సీ ఫుట్‌బాల్ ఈవెంట్‌కు భారీ భద్రత..
- మెస్సీ మ్యాచ్‌కు పాస్‌లున్నవారికే స్టేడియంలో ప్రవేశం
- 450 సీసీ కెమెరాలు, డ్రోన్లతో స్టేడియం నిఘా
- భద్రతా కారణాలతోనే ఫోన్‌లకు మాత్రమే అనుమతి
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నేడు ఉప్పల్ స్టేడియంలో జరగబోయే అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఈవెంట్ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ (సీపీ) సుధీర్ బాబు వెల్లడించారు. ఈవెంట్‌కు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మెస్సీకి జడ్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని, ఆయన్ని గ్రీన్ ఛానల్ ద్వారా స్టేడియంకు తీసుకువస్తామని సీపీ తెలిపారు. అయితే, వాహనంలో ఉన్నప్పుడు కూడా మెస్సీని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదని, కాబట్టి అనవసరంగా రోడ్డుపైకి వచ్చి చూసే ప్రయత్నం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.
స్టేడియం సామర్థ్యం 39 వేలు అని, దానికి తగ్గట్టుగానే నిర్వాహకులు పాస్‌లు అమ్ముతున్నారని, అయితే స్టేడియం దగ్గర ఎలాంటి పాస్‌లు అమ్మబడవని, కేవలం ఆన్‌లైన్ లోనే పాస్‌లు అమ్మబడతాయని క్లారిటీ ఇచ్చారు. పాసులు ఉన్నవారు మాత్రమే రావాలని, లేనివారు స్టేడియం వద్దకు రావద్దని స్పష్టం చేశారు సీపీ. భద్రత కోసం స్టేడియం పరిసరాల్లో 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మోస్ట్ అడ్వాన్స్‌డ్ డ్రోన్‌లతో కూడా నిఘా పెడుతున్నట్లు చెప్పారు. రేపు సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందని, సాయంత్రం 4 గంటల నుంచే ప్రేక్షకులను లోపలికి అనుమతిస్తామని సీపీ పేర్కొన్నారు.
మెస్సీ కొద్దిసేపు మాత్రమే ఆడతారు కాబట్టి, ప్రేక్షకులు ముందస్తుగానే స్టేడియం చేరుకోవాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ల్యాప్ టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరెట్లు, గొడుగులు, లైటర్లు, బైనాకులర్లు, బ్యాటరీలు, షార్ప్ ఆబ్జెక్ట్స్, హెల్మెట్, బ్యాగ్ వంటి వస్తువులకు స్టేడియం లోపలికి అనుమతి లేదని, కేవలం మొబైల్ ఫోన్‌లను మాత్రమే అనుమతిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు.

### ప్రస్తుత జాతీయ సంక్షోభాలపై

## పార్లమెంట్‌లో చర్చ అవసరం



తెలంగాణ బ్యూరో్ప్రతినిధిః దేశం ప్రస్తుతం తీవ్ర అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలకు నేరుగా ప్రభావం చూపే అంశాలు పార్లమెంట్‌లో చర్చకు రాకపోవడం విచారకరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎంపీ మాట్లాడుతూ, డిజిసిఏ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన రెండు సంవత్సరాలు అవుతున్నా, ఇండిగో మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసింది. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఈ అంశంపై చర్చ తప్పనిసరి" అన్నారు. అలాగే, ఢిల్లీలో కాలుష్యం 500కి పైగా ఏక్యూఐ చేరి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుండగా, దీనిపై కూడా ప్రభుత్వం మౌనం వహిస్తున్నదని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ, "రూపాయి విలువ పడిపోవడం ఆందోళనకరం. రూపాయి ఐసియూలో ఉన్నట్టువుంది. నిరుద్యోగం పెరిగింది.
మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఎక్కడ?" అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో చర్చించాల్సిన అసలు సమస్యలను పక్కన పెట్టి, 150 సంవత్సరాల క్రితం అంశాలపై చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఎంపీ అన్నారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇవ్వకుండా దారి మళ్లించడాన్ని కూడా ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషనర్ ఎంపికలో ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారు? న్యాయవ్యవస్థపై గౌరవం ఎందుకు చూపడం లేదు?" అని ప్రశ్నించారు.ఈ విషయాలను ప్రభుత్వం వ్యక్తిగతంగా కాకుండా దేశ ప్రయోజనంగా తీసుకొని చర్చకు రావాలి" అని ఎంపీ వంశీకృష్ణ అన్నారు.

## వికసిత్ భారత్‌తోనే దేశ అభివృద్ధి

- ప్రధాని అన్ని రంగాలను ప్రోత్సహిస్తున్నారు
- అథ్లెటిక్ పోటీలు జరగడం అభినందనీయం
- ఒకప్పుడు బ్రాండ్ మెడల్ గెలవడం కష్టంగా ఉండేది
- గత కొన్నేళ్లుగా గోల్డ్, సిల్వర్ మెడల్స్ సైతం గెలుస్తున్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన 41వ జాతీయ సీనియర్ క్యోరుగి ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన
అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ లాంటి దేశం నలుమూలల నుంచి వచ్చి పాల్గొంటున్న ప్రతీ అథ్లెట్‌కు హృదయపూర్వక స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ మీ క్రీడలతో పాటు హైదరాబాదును కూడా చూసి, హైదరాబాదు అతిథ్య సత్కారాన్ని ఆస్వాదించాలి. హైదరాబాదు బిర్యానీ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి అని కొనియాడారు. 14వ నేషనల్ యూత్ సీనియర్ పోటీలు జరుగుతున్నాయి%ౌ% ప్రతి టీంకీ శుభాకాంక్షలు తెలిపారు.
ఇప్పుడు స్పోర్ట్స్ మన జీవితంలో, దేశ కార్యకలాపాల్లో ఒక ముఖ్య భాగంగా గుర్తింపు పొందింది, మునుపు మనం బ్రాంజ్ మెడల్ కూడా గెలవలేకపోయేవాళ్లం కానీ ఇప్పుడు మన క్రీడాకారులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను ఒలింపిక్స్‌లో కూడా గెలుస్తున్నారు. ప్రస్తుత భారత ప్రభుత్వం క్రీడలపై 2014తో పోలిస్తే 130 రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తోంది. కో కుడోక్, కో ఇండియా లాంటి కార్యక్రమాలు యువత క్రీడా నైపుణ్యాలను మెరుగుపరిచాయన్నారు. ఈ పోటీలు మీలో మరింత ప్రతిభను వెలికితీస్తాయి%ౌ% జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఇస్తాయి అని అన్నారు. ఈ స్టేడియం 2001%-%02లో నిర్మించబడింది. ఇక్కడ ఆఫ్రో%-%ఏషియన్ గేమ్స్, నేషనల్ గేమ్స్ వంటి అనేక అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లు జరిగాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వివరించినట్లుగా, 'వికసిత్ భారత్%-%2047 లక్ష్య సాధనలో యువత అభివృద్ధి క్రీడల బలోపేతం కీలక పాత్ర పోషిస్తున్నాయి. వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, జాతీయ ఏకీకరణ-ఈ మూడు అంశాలను బలపరిచే శక్తిగా క్రీడలను మరింత మెరుగుపరచే దిశగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కీలక చర్యలు తీసుకుంటోందన్నారు. దేశ నిర్మాణంలో క్రీడలు ఒక శక్తివంతమైన మార్గదర్శక శక్తిగా నిలవాలనే సంకల్పం ఈ కార్యక్రమాల ద్వారా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

### బీసీ గురుకులాల్లో అవినీతిపై

## విచారణ జరిపించాలి

- బీసీ ఆజాది ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్
- బీసీ గురుకులాల అవినీతిపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయాలని జాతీయ బీసీ కమిషన్‌కు వినతి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:తెలంగాణ రాష్ట్రంలోని బీసీ సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే బిసి రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ సొసైటీలో రాష్ట్ర కార్యదర్శి ఐఎఫ్‌ఎస్ అధికారి బి. సైదులు పర్యవేక్షణ, నిబద్ధత లోపంతో అడుగడుగునా అవినీతి జరుగుతుందని, పీఎం శ్రీ నిధుల కింద మంజూరైన 20 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని దీనిపై స్పందించి కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయించి బీసీ గురుకులాల కార్యదర్శి బి సైదులు పై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ కార్యదర్శి, పర్సన్ ఇంచార్జ్ మీత రాజీవ్ లోచన్ కు బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, కార్యదర్శి నిబద్ధత లోపం వల్ల రాష్ట్రంలోని గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థులు సరియైన సౌకర్యాలు లేక, నాణ్యమైన ఆహారము లేక, ఆహార కల్తి వల్ల, 72 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇందుకు కారణమైన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషన్కు ఫిర్యాదు చేసిన అనంతరం తెలంగాణ భవన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుడికాల భాస్కర్, విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్, వివిధ జిల్లాల అధ్యక్షులు వడ్నాల రవీందర్, ఊర్లగొండ మురళి, బొంగోని అభిలాష్, వరాల అనిల్, ఉట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కాగ్నిజెంట్ తాత్కాలిక క్యాంపస్

# విశాఖ సాగర తీరంలో
# ఐటీ విప్లవం

**తొమ్మిది సంస్థలకు శంఖుస్థాపనలు చేసిన మంత్రి లోకేష్**

**దాదాపు 50 వేల మంది నిరుద్యోగులకు ఉపాధికి అవకాశం**

ఒక విజన్‌తో ముందుకెళ్తూ అద్భుతాలు సాధిస్తున్న కూటమి సర్కార్ . నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి విశాఖపట్నం కేంద్రంగా మారచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.
ఈ క్రమంలోనే . విశాఖపట్నంలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి సీఎం, ఐటీ మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. కాగ్నిజెంట్, సత్వా సంస్థతో పాటు మరో ఏడు ఐటీ సంస్థలకు భూమిపూజ చేశారు. .విశాఖ ఎకనామిక్ రీజియన్ సమావేశంలో 9 ఐటీ కంపెనీలకు శంకుస్థాపన తో విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు చేస్తున్న కృషి ఫలించిందని వ్యాఖ్యానించడం గమనార్హం .
మధురవాడ, రుషికొండ ఐటీ జోన్ ప్రాంతాల్లో 9 ఐటీ కంపెనీలకు, వాటి సంబంధిత యూనిట్లకు శంకుస్థాపనలు చేయగా ఏపీఐఐసీ ద్వారా కేటాయించిన 69.97 ఎకరాల భూముల్లో ఈ ఐటీ కంపెనీలకు శంకుస్థాపన లు జరిగాయి. మధురవాడ, రుషికొండలో భూమి ధర ఎకరానికి కనీసం గరిష్ఠంగా రూ.4 కోట్ల వరకు పలకనుంది.
తాజా పరిణామంతో యువతకు సుమారు 41,967 ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. పెనీల్లో కాగ్నిజెంట్ టెక్నాలజీ, సామ్వర్ధన మోథర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇమాజినోవేట్ టెక్‌సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లూయెంట్‌గ్రిడ్ లిమిటెడ్, శ్రీ టెక్ తమ్మినా, నాన్‌రెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఏసీఎన్ హెల్త్‌కేర్ ఆర్‌సిఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు విశాఖపట్నం రాకతో, త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. మరిన్ని వివరాలలోకి వెళితే....



విశాఖపట్నంలో ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ తాత్కాలిక క్యాంపస్ ను విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా ఫిన్ టెక్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు వేదమంత్రోచ్చారణల మధ్య ఘనస్వాగతం పలికారు. అనంతరం కాగ్నిజెంట్ తాత్కాలిక క్యాంపస్ ను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరిం చారు. మధురవాడ హిల్ నెం-2లోని మహతి ఫిన్ టెక్ భవనంలో వెయ్యి మంది సీటింగ్ కేపాసిటీతో ఈ తాత్కాలిక క్యాంపస్ ను ఏర్పాటుచేశారు. కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ మొదటి దశ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఫిన్ టెక్ భవనంలో కార్యకలాపాలను కొనసాగించనున్నారు. ఈ కేంద్రం కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై దృష్టి సారించనుంది. 2 టెక్ తమ్మిన సంస్థకు శంకుస్థాపన విశాఖ మధురవాడలోని హిల్ నెంబర్-2లో టెక్ తమ్మిన ఐటీ సంస్థ క్యాంపస్ నిర్మాణానికి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ చేశారు. ముందుగా హిల్ నెం-2లోని సంస్థ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం టెక్ తమ్మిన సంస్థ భవన నిర్మాణానికి మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు.

**టెక్ తమ్మిన సంస్థ విశాఖ**



యూనిట్ ద్వారా రూ.62 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 500 మందిగి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం అమెరికాలో ఉంది. నెదర్లాండ్స్, దుబాయ్, ఇండియాలో తన సేవలను అందిస్తోంది

**నాన్‌రెల్ టెక్నాలజీస్ కు భూమిపూజ**

విశాఖ నాన్ ఐటీ సెజ్, హిల్ నెంబర్-2లో నాన్ రెల్ టెక్నాలజీస్ యూనిట్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు హిల్ నెంబర్-2లోని సంస్థ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు



నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. విశాఖలో ఏర్పాటుకానున్న నాన్ రెల్ టెక్నాలజీస్ సంస్థ రూ.50.60 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 567 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి

**ఏసీఎన్‌ఇన్ఫోటెక్ కు శంకుస్థాపన**



విశాఖ ఐటీ సెజ్ హిల్ నెం-2లో ఏసీఎన్ ఇన్ఫోటెక్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్ సీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విశాఖ యూనిట్ ద్వారా రూ.30 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ 12 నెలల్లో తన వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది.

**ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్**



విశాఖ భీమిలిలోని కాపులుప్పాడలో ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ సంస్థకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ సంస్థ విశాఖ యూనిట్ ద్వారా రూ.140 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2,600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**ఫ్లూయెంట్ గ్రిడ్‌లిమిటెడ్‌సంస్థ**



విశాఖ భీమిలి మండలం కాపులుప్పాడలో ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ఐ టీ సంస్థ క్యాంపస్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ విశాఖ యూనిట్ ద్వారా రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**మదర్సన్‌టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్‌**

విశాఖపట్నం కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్క్ లో మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఐటీ సంస్థ క్యాంపస్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ విశాఖ



యూనిట్ ద్వారా రూ.109.73 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 1,775 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**క్వార్క్స్ టెక్నోసాఫ్ట్‌ప్రైవేట్ లిమిటెడ్‌**



విశాఖ కాపులుప్పాడలో క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ భవన నిర్మాణానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విశాఖ యూనిట్ ద్వారా రూ.115 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్**



దేశంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్, కన్సల్టింగ్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో విశాఖ మధురువాడలోని హిల్ నెంబర్-4లో నిర్మించనున్న సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ క్యాంపస్ ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పరోక్షంగా 40వేల నుంచి 50వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్‌లో గ్లోబల్ ప్రమాణాల గ్రేడ్- కార్యాలయాలు, ప్రీమియం నివాసాలు, ఇంటిగ్రేటెడ్ రిటైల్, హాస్పిటాలిటీ సౌకర్యాలు, స్మార్ట్ మొబిలిటీ, పునరుత్పత్తి శక్తి సమీకరణ, పట్టణ జీవన విధానానికి అనుగుణంగా ఆధారిత మౌలిక వసతులు కల్పించనున్నారు. విశాఖలో మొదటి మూడేళ్లలో మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్ ను సత్వా సంస్థ అభివృద్ధి చేయనుంది. వచ్చే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్ ను అభివృద్ధి చేయనుంది.

**గొట్టిపాటి నాగేశ్వరరావు - సూర్య బ్యూరో ప్రతినిధి**
**ఒంగోలు - 70360 00444**




## హైదరాబాద్ లో చేసిన మ్యాజిక్కే విశాఖలో రిపీట్

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మీరు చూస్తున్నది అంతా చరిత్ర. గతంలో హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు గారు కృషి చేశారు. అలాంటి మ్యాజిక్కే మళ్లీ చంద్రబాబు గారు ఏపీలోని విశాఖలో చేస్తున్నారు. లోకల్ అంత్రపెన్యూర్స్ ను మేం ప్రోత్సహిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో మేం ముందుకు వెళ్తున్నాం. విశాఖలో గాజువాక, భీమిలి ఎమ్మెల్యేలకు అత్యధిక మెజార్టీని ప్రజలకు కట్టబెట్టారు. నాకు మూడో అత్యధిక మెజార్టీ వచ్చింది. ప్రజలు మాపై ఎంతో విశ్వాసం ఉంచారు. వారు నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడున్న ఎండీలను నేను మొదటిసారి కలుస్తున్నా. శంకుస్థాపన కార్యక్రమంలోనే నేను కలుస్తానని చెప్పా. అదీ పెట్టుబడుల పట్ల మా కమిట్ మెంట్. గత 18 నెలల్లో మేం 190 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాం. మాకు ఏదైనా వదిలిపెడతారా అని ఇతర రాష్ట్రాల వారు ప్రశ్నిస్తున్నారు. దేశంలో ప్రతి పెట్టుబడికి మేం పోటీ ఇస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉంటే.. ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ప్రధాని మోడీ గారు, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు గారు అద్భుతమైన నాయకులు. 75 ఏళ్ల వయసులోనూ పరిగెడుతున్నారు. వీరి నాయకత్వం భారతదేశం, ఏపీకి ఎంతో అదృష్టం. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. ఏపీ, విశాఖ, తెలుగు ప్రజలను గర్వపడేలా చేస్తాం. యువత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి. కష్టపడి పనిచేయాలి. విజయానికి దగ్గరి దారులు లేవు. చంద్రబాబు గారు 19 గంటల వరకు కష్టపడతారు. విశాఖ గౌరవాన్ని పెంచే విధంగా మీరు పనిచేయాలి. ముందుండి నడిపించాలి. తర్వాతి తరాలకు మార్గదర్శకంగా ఉండాలి. నేను విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తా. విశాఖ మ్యాజికల్ సిటీ. మీరు రౌడీలను తరిమికొడతారు. రౌడీల చుట్టూ రౌడీలే ఉంటారు. దేశానికి నడిపించాలి అనుకునే వారి చుట్టూ పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నవారే ఉంటారు. అందరం కలిసి విశాఖకు గర్వకారణంగా నిలుద్దాం. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్లు, విశాఖను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలంటే నైతిక విలువలు కూడా ముఖ్యమే అని గుర్తించాలని అన్నారు. విశాఖపట్నం ఏపీకి ఎకనామిక్ ఇంజన్ . విశాఖకు ఇదో ఉద్వేగభరిత ప్రయాణం. హైదరాబాద్ అభివృద్ధిలో సత్వా గ్రూప్ తనవంతు పాత్ర పోషించింది. వారి ప్రయాణం అద్భుతం. ఏపీలో పెట్టుబడులకు 2018 నుంచి నేను సత్వా గ్రూప్ వెంట పడుతున్నాను. ఇప్పటికి సాకారమైంది. మాపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు. విశాఖ అందమైన నగరం. అందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం. ఇక్కడున్న వారంతా చంద్రబాబునాయుడు గారు హైదరాబాద్ అభివృద్ధి చేసిన తర్వాత పుట్టినవారు. చంద్రబాబు గారి నాయకత్వంలో విశాఖలో అదే విధమైన అభివృద్ధి జరుగుతుంది. బెంగళూరు, గోవా కలయిక విశాఖ. ఇక్కడ విద్యావంతులతో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయి. సత్వా గ్రూప్ రాక ఆర్థిక అభివృద్ధికి ఉత్ప్రేరకం కానుంది. ఇప్పటికే విశాఖకు గూగల్ సంస్థ వచ్చింది. సత్వా గ్రూప్ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 25వేల మందికి ఉద్యోగాలు ఇవ్వనుంది. విశాఖ ప్రజలు మాకు ఎప్పుడూ స్వాగతం పలుకుతారు. మా విజన్ కు మద్దతుగా నిలుస్తారు. 2019లోనూ టీడీపీని ఇక్కడ గెలిపించారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. విశాఖపట్నం ఏపీకి ఎకనామిక్ ఇంజన్ గా నిలుస్తుంది. అనకాపల్లి నుంచి విశాఖ వరకు ఎకనామిక్ రీజియన్ వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా రూపుదిద్దుకుంటుంది. వచ్చే మూడున్నరేళ్లలో విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తాంఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ పెట్టుబడుల కోసం విశేషంగా కృషిచేస్తున్నారు. చంద్రబాబు గారి నాయకత్వంలో వచ్చే మూడున్నరేళ్లలో విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తాం. విశాఖలో ప్రపంచస్థాయి విద్యాప్రమాణాలు నెలకొల్పుతాం. అందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం. హైదరాబాద్ అభివృద్ధికి 30 ఏళ్లు పడితే విశాఖకు పదేళ్ల సమయం చాలు. భవిష్యత్ భారతదేశానిదే. ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తోంది. మేం మరిన్ని ఐటీ కంపెనీలు నెలకొల్పుతాం. ఇక్కడున్న యువతే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్లు. మీ పనితీరుతో భవిష్యత్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. కష్టపడి



పనిచేయాలని యువతకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో విపిన్ వింద్యాల్, డైరెక్టర్ అశు తోష్ కౌశిక్, ఎంపీ శ్రీ భరత్, జిల్లా ఇంఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గన్నారు.

### కోహ్లీ-రోహిత్ రిటైర్ షాక్....

# జియో హాట్‌స్టార్ ఒప్పందం రద్దు!

- జియో హాట్ స్టార్ భారత్‌లో ఐసీసీ మీడియా హక్కుల ఒప్పందం నుంచి అర్థాంతరంగా వైదొలికింది
- మూడు సంవత్సరాల కోసం కుదుర్చుకున్న 3 బిలియన్ డాలర్ల భారీ ఒప్పందాన్ని రద్దు చేయడం పరిశ్రమలో పెద్ద చర్చ



భారత్లో ఐసీసీ టోర్నీలకు సంబంధించి మీడియా హక్కుల ఒప్పందం నుంచి జియో హాట్స్టార్ సంస్థ తప్పుకోవడం ఇటీవల చర్చనీయాంశం అయింది. భారత్లో క్రికెట్ మ్యాచ్ల ప్రసారం కోసం సంస్థలు ఎగబడటమే చూస్తుంటాం. కానీ ఇలా మధ్యలో ప్రసారదారు ఒప్పందం నుంచి తప్పుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇందులో పరోక్షంగా విరాట్ కోహ్లీ రోహిత్ శర్మల పాత్ర ఉందనే చర్చ జరుగుతోందిప్పుడు.

**మరి ఈ ఒప్పందం రద్దుకు, వారికి ఉన్న సంబంధమేంటి?**

ప్రపంచంలో క్రికెట్కు అత్యధిక ఆదరణ ఉన్న దేశం భారత్ అని కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఇక్కడ క్రికెట్ మ్యాచ్లకు సంబంధించి ప్రసార హక్కుల కోసం ఎప్పుడూ విపరీతమైన పోటీ ఉంటుంది. ప్రపంచంలో ఐసీసీ (ICC) ఈవెంట్లు ఎక్కడ జరిగినా భారత్లో వీక్షణలు భారీగానే ఉంటాయి. ఆ ఒప్పందాల విలువ ఎప్పటికప్పుడు పెరుగుతూ ఉంటుంది కూడా. గత ఏడాది జియో హాట్స్టార్ సైతం భారత్లో ఐసీసీ ఈవెంట్ల మీడియా హక్కుల కోసం మూడేళ్ల కాలానికి ఏకంగా 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.27 వేల కోట్లు) చెల్లించేలా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)తో ఒప్పందం చేసుకుంది. కానీ ఏడాదిన్నర తిరిగేసరికే ఆ ఒప్పందం నుంచి తప్పుకోవాలని జియో హాట్స్టార్ నిర్ణయించుకోవడం ఐసీసీకి పెద్ద షాక్.దీంతో 2026-29 కాలానికి గాను ఐసీసీ కొత్తగా బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. 2024-27 కాలానికి చేరుకున్న ఒప్పందంతో పోలిస్తే.. కొత్త ఒప్పందం విలువ తక్కువ కావడం గమనార్హం. ఈసారి 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21.6 వేల కోట్లు) ఆదాయాన్ని అంచనా వేస్తోంది ఐసీసీ. జియో హాట్స్టార్ అర్ధంతరంగా ఒప్పందం రద్దు చేసుకోవడానికి, వచ్చే మూడేళ్లకు మీడియా హక్కుల విలువ తగ్గడానికి కోహ్లీ, రోహిత్ టెస్టులు, టీ20ల నుంచి రిటైరవడం ఓ కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వాళ్లు లేక స్టేడియాలు వెలవెల!**

గత ఏడాది టీ20 ప్రపంచకప్ విజయానంతరం రోహిత్, కోహ్లీ ఒకేసారి పొట్టి క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించారు. భారత్ కప్పు గెలవడం, అందులో రో-కో భాగం కావడంతో ఆదరణ పరంగా సూపర్హిట్ అయింది. ఈ టోర్నీలో టీమ్ఇండియా మ్యాచ్లకు వ్యూయర్షిప్ భారీగా వచ్చింది. కానీ ఆ టోర్నీతో రో-కో రిటైరవడంతో టీ20 జట్టుకు ఆకర్షణ తగ్గిపోయింది. తర్వాత భారత టీ20 జట్టు సిరీస్ల మీద సిరీస్లు గెలుస్తోంది. కానీ రో-కో ఉండగా అభిమానుల్లో ఉన్న ఉత్సాహం ఇప్పుడు లేదన్నది వాస్తవం. టీ20 మ్యాచ్లు అంటే ఎవరు ఆడినా స్టేడియాలు నిండుతాయి కానీ.. రోహిత్, కోహ్లీ ఆడుతుంటే స్టేడియాల్లో ఉండే సందడి వేరు. ఈ ఏడాది వీళ్లిద్దరూ టెస్టులకు కూడా గుడ్బై చెప్పారు. వీళ్లిద్దరూ రిటైరయ్యాక భారత టెస్టు జట్టు మ్యాచ్లు ఆడుతుంటే స్టేడియాలు జనాల్లేక వెలవెలబోతున్నాయి. టెస్టులపై అంతకంతకూ ఉత్సాహం తగ్గుతున్నప్పటికీ.. రో-కోలను చూడ డానికి స్టేడియానికి అభిమాను లు వచ్చేవారు.కానీ వారు రిటైరయ్యాక టెస్టులపై విముఖత ఇంకా పెరిగిపోయింది. వెస్టిండీస్తో సిరీస్ సందర్భంగా వెయ్యి మంది కూడా స్టేడియంలో లేని పరిస్థితి చూశాం. దక్షిణాఫ్రికాతో సిరీస్కు టికెట్ల ధరలు బాగా తగ్గించి అభిమానులను రప్పించే ప్రయత్నం చేశారు. కానీ అంతకంతకూ పడిపోతున్న టీవీ వ్యూయర్షిప్పు మాత్రం పెంచలేకపోతున్నారు.

**ఆశించిన ఆదాయం వస్తుందనే అంచనాలు లేవు!**

వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత్ టీ20 ప్రపంచకప్పుకు ఆతిథ్యమివ్వబోతోంది. అయినా జియో హాట్స్టార్ మీడియా హక్కుల ఒప్పందం నుంచి తప్పుకోవడం వెనక రో-కో ఎఫెక్ట్ ఉందంటున్నారు విశ్లేషకులు. జియో హాట్స్టార్ ఓటీటీకి మామూలుగానే నష్టాలు వస్తున్నాయి. ఇటు చూస్తే ఐసీసీ ఈవెంట్ల మీడియా హక్కుల కోసం భారీగా డబ్బులు చెల్లించాలి. కానీ మ్యాచ్ల ప్రసారం ద్వారా ఆశించిన ఆదాయం వస్తుందనే అంచనాలు లేవు. రో-కో ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. వాళ్లు ఆడిన మ్యాచ్లకు వీక్షణలు ఎక్కువ ఉంటున్నాయి. అందుకు తగ్గట్లే ప్రకటనల ఆదాయమూ ఉంటోంది. సొంత గడ్డపై జరగనున్న టీ20 ప్రపంచకప్లో వీళ్లిద్దరూ ఉంటే ఆ కళే వేరుగా ఉండేది. కానీ రో-కో లేని టోర్నీకి వీక్షణలు, ప్రకటనల ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చని.. తాము పెడుతున్న భారీ పెట్టుబడికి తగ్గ లాభం రాదనే అంచనాతోనే జియో హాట్స్టార్ తప్పుకొందని ట్రేడ్ పండితులు అంటున్నారు. ఈ పరిణామం తర్వాత రో-కో 2027 వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగాలనే డిమాండ్ మరింత ఊపందుకుంటుందనడంలో సందేహం లేదు. ఆలోపే వాళ్లిద్దరూ రిటైరైతే మాత్రం ప్రపంచకప్ కళ తప్పడం ఖాయం. వ్యూయర్షిప్ కూడా తగ్గిపోతుంది. అందుకే అభిమానులతో పాటు ప్రసారదారులు, స్పాన్సర్లు కూడా ఈ దిగ్గజాలిద్దరూ ఆ మెగా టోర్నీలో ఆడాలని గట్టిగా డిమాండ్ చేసే అవకాశాలున్నాయి.

# ఓలింపిక్ కోసం తిరిగి రింగ్‌లోకి

### వినేశ్ ఫొగాట్



ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తన రిటైర్మెంట్ను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. ఒలింపిక్ కలను నెరవేర్చుకోవడానికి మళ్లీ రెజ్లింగ్ రింగ్లోకి అడుగుపెట్టాలనుకుంటున్నట్లు తెలిపింది. 2028లో లాస్ఏంజిల్స్ ఒలింపిక్స్లో పోటీ పడేందుకు సిద్ధమవుతున్నట్లు 'ఎక్స్' వేదికగా ఆమె వెల్లడించింది.2024లో ప్యారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కేజీలో విభాగంలో ఫైనల్కు చేరిన వినేశ్ రజతం ఖాయం చేసుకుంది. కానీ, రెండో రోజు బరువు చూసే సమయానికి 100 గ్రాములు అదనంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు పడింది. ఈ ఆవేదనతో ఆమె రెజ్లింగ్కు రిటైర్మెంట్ ప్రకటించింది.ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసింది. జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందింది. ఈ జూలైలో ఆమె ఒక బాబుకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని కూడా ఆమె పోస్టులో పేర్కొంది. ఈసారి తాను ఒంటరిగా ప్రయాణించడం లేదని, తన జట్టులో ఇప్పుడు తన కుమారుడు కూడా ఉన్నాడని వెల్లడించింది. వాడు తనకు అసలైన ప్రేరణ అని తెలిపింది. తన లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ ప్రయాణంలో తన చిట్టి చీర్ లీడర్ ఉంటాడని తెలిపింది.వినేశ్ ఫొగాట్ మూడుసార్లు ఒలింపిక్స్లో పాల్గొంది. 2016లో ఒలింపిక్స్కు ఎంట్రీ ఇచ్చిన వినేశ్, అప్పుడు మోకాలి గాయంతో క్వార్టర్స్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2021లో భారీ అంచనాలతో టోక్యో ఒలింపిక్స్కి అడుగుపెట్టినప్పటికీ క్వార్టర్స్లో ఓడిపోయింది. 2024లో తృటిలో పతకం చేజార్చుకుంది.

### 433 పరుగుల

# సునామీతో భారత్ దుమ్మురేపింది

- యూఏఈపై 433/6 పరుగుల రికార్డు స్కోరు చేసిన భారత యువ జట్టు
- యూత్ వన్డేల్లో భారత్కు ఇదే అత్యధిక స్కోరు
- వైభవ్ సూర్యవంశీ 95 బంతుల్లో 171 పరుగులతో విధ్వంసం సృష్టించాడు
- యూత్ వన్డేల్లో మూడుసార్లు 400పైగా స్కోర్లు చేసిన ఏకైక జట్టుగా భారత్ రికార్డు



అండర్-19 ఆసియా కప్ 2025 టోర్నమెంట్లో భారత యువ జట్టు ప్రత్యర్థి జట్లకు గట్టి హెచ్చరిక పంపింది. యూఏఈతో జరుగుతున్న ఆరంభ మ్యాచ్లో టీమిండియా కుర్రాళ్లు విధ్వంసకర బ్యాటింగ్తో చెలరేగి, యూత్ వన్డే ఇంటర్నేషనల్ (ODI) క్రికెట్ చరిత్రలోనే తమ అత్యధిక స్కోరును నమోదు చేశారు. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 433 పరుగుల భారీ స్కోరు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు.ఈ మ్యాచ్లో 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 95 బంతుల్లోనే 171 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు ఆరోన్ జార్జ్ (69), విహాన్ మల్హోత్రా (69) చక్కటి సహకారం అందించడంతో పరుగుల వరద పారింది.

**అరుదైన ప్రపంచ రికార్డు**

ఈ స్కోరుతో భారత యువ జట్టు ఓ అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. యూత్ వన్డేల చరిత్రలో మూడుసార్లు 400కు పైగా స్కోర్లు చేసిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది. ఇంతకుముందు 2004లో స్కాట్లాండ్పై 425/3, 2022లో ఉగాండాపై 405/5 పరుగులు చేసింది. యూత్ వన్డేల్లో అత్యధిక స్కోరు రికార్డు మాత్రం ఆస్ట్రేలియా (480/6, కెన్యాపై 2002లో) పేరిట ఉంది.

### ప్రీమియర్ లీగ్ మోసం హెచ్‌సీఏపై

# టీసీఏ తీవ్ర ఆరోపణలు



హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్లో అవినీతి జరుగుతూనే ఉందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపించింది. ప్రీమియర్ లీగ్ పేరుతో మరోసారి మోసం చేయాలని చూస్తే హెచ్సీఏ అధికారులను బయట తిరగనివ్వబోమని హెచ్చరించింది. హెచ్సీఏలో అక్రమాల గురించి ప్రస్తావిస్తూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (TCA) శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించింది. అండర్ -14 టీమ్ అనే ప్రస్తావన లేదు ఈ సందర్భంగా.. "ప్రీమియర్ లీగ్ పేరుతో మళ్లీ మోసం చేయాలని చూస్తే హెచ్సీఏ అధికారులను బయట తిరగ నివ్వం. ప్రీమియర్ లీగ్ కూడా TCA నిర్వహిస్తుంది. అండర్ 14 సెలక్షన్ పేరుతోనూ అవినీతి కి పాల్పడ్డారు. 3500 మంది క్రీడాకారులను ఇబ్బంది పెట్టారు. BCCIలో అసలు అండర్ -14 టీమ్ అనే ప్రస్తావన లేదు.అయినా సెలక్షన్కు అని పిలిచి జింఖాన గ్రౌండ్ లో కనీసం సౌకర్యాలు కల్పించలేదు. సొంతంగా అసోసియేషన్లు పెట్టుకొని.. 15 మంది ని సెలెక్ట్ చేయడానికి ఐదు వేల మందిని నిలబెట్టారు. అవకతవకలపై హ్యూమన్ రైట్స్తో పాటు డీజీపి కి ఫిర్యాదు చేస్తాం. ఎన్నిసార్లు కోర్టు మొట్టకాయలు వేసినా తీరులో మార్పు లేదు. మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం" అని టీసీఏ పేర్కొంది.

**BCCI గుర్తింపు కోసం :** టీసీఏ జనరల్ సెక్రటరీ గురువా రెడ్డి మాట్లాడుతూ.. BCCI గుర్తింపు కోసం మేము ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. ముఖ్యమంత్రి సుమోటోగా HCAపై విచారణ జరపాలి. BCCI నిబంధనలను HCA పాటించడం లేదు" అని పేర్కొన్నారు. ఇక అడ్వకేట్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "సెలక్షన్ పేరిట పిల్లల్ని, వారి కుటుంబాలను ఇబ్బంది పెట్టారు. ఈ విషయంపై జాతీయ, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కు ఫిర్యాదు చేస్తున్నాం" అని తెలిపారు.

# మెస్సీ కోసం ఉప్పల్ స్టేడియం గోల్స్‌కు సిద్ధం



ఉప్పల్ స్టేడియం అనగానే క్రికెట్ అభిమానులకు గుర్తొచ్చేది ఐపీఎలే. అత్యధిక స్కోర్లు.. శతకాలు.. భారీ భాగస్వామ్యాలు.. రికార్డులతో ఐపీఎల్లో ఉప్పల్ స్టేడియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దేశంలోనే అత్యుత్తమ మైదానంగా ఐపీఎల్లో ఎన్నోసార్లు అవార్డులు అందుకుంది. బీసీసీఐ వ్యవస్థాపక మెంబర్గా.. ప్రముఖ టెస్టు వేదికగా హైదరాబాద్కు గొప్ప చరిత్రే ఉంది. అయితే మొదటిసారిగా ఉప్పల్లో క్రికెట్కు బదులు ఫుట్బాల్ అభిమానులతో నిండిపోనుంది. 'ద గోట్ టూర్'లో భాగంగా అర్జెంటీనా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సి హైదరాబాద్కు వస్తుండమే ఇందుకు కారణం. అయితే టెస్టు వేదిక ఉప్పల్ స్టేడియంలో ఫుట్బాల్ మ్యాచ్ నిర్వహిస్తే పిచ్ పరిస్థితేంటి? ఆటగాళ్లు స్పైక్స్ బూట్లు ధరించి పరుగెత్తుతే వికెట్లు పాడవుతాయి కదా? అసలు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఫుట్బాల్ మ్యాచ్ నిర్వహించడమేంటి? అన్న ప్రశ్నలు తలెత్తక మానవు. స్టేడియంలోని అయిదు పిచ్లకు, మైదానానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్సీఏ) అన్ని చర్యలు తీసుకుంటోంది. నిజానికి ఇది '7 ఎ సైడ్' ఫుట్బాల్ మ్యాచ్ కావడంతో మైదానం మొత్తం అవసరం లేదని తెలుస్తోంది. స్టేడియంలో కొంత భాగంలో మాత్రమే ఫుట్బాల్ మ్యాచ్ నిర్వహిస్తారు. సౌత్ స్టాండ్ ముందు.. క్రికెటర్లు కూర్చొనే డగౌట్ల దగ్గరి నుంచి 35 మీటర్ల వెడల్పు.. 50 మీటర్ల పొడవుతో ఫుట్బాల్ కోర్టును ఏర్పాటు చేయనున్నారు! 35 మీటర్ల వెడల్పునకే పరిమితమవడంతో ఫుట్బాల్ కోర్టు.. పిచ్లకు 20 అడుగుల దూరం ఉండనుంది. అయిదు పిచ్లను భద్రంగా ఉంచేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోనున్నారు. శనివారం పూర్తిగా పిచ్లను కప్పి ఉంచుతారు. ఆటగాళ్లు పిచ్లపై పరుగెత్తినా ఇబ్బంది ఉండదని సమాచారం. నిర్వాహకులు ప్రకటించిన దాని ప్రకారం ఎగ్జిబిషన్ మ్యాచ్ 20 నిమిషాల పాటు జరుగనుంది. పిల్లలు ఈ మ్యాచ్ ఆడతారు కాబట్టి పిచ్లపై పెద్దగా ప్రభావం పడకపోచ్చవని హెచ్సీఏ భావిస్తోంది. చిన్నారులకు మెస్సి చిట్కాలు అందించే ఫుట్బాల్ క్లినిక్లో పరుగెత్తే అవసరం ఉండదు. మిగతా కార్యక్రమాలు పిచ్ దగ్గర లేకుండా జాగ్రత్త పడుతున్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఏదేమైనా సిక్సర్లు.. బౌండరీలతో అలరించిన ఉప్పల్ స్టేడియం శనివారం గోల్స్తో సందడి చేయనుంది.

### ఆసియా టీమ్ ఈవెంట్‌కు

# భారత్ రెడీ



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ పోటీలకు స్టార్ ఆటగాళ్లతో భారత్ సిద్ధమైంది. ఫిబ్రవరి 3 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ మెగా ఈవెంట్లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) గురువారం ప్రకటించింది. రెండేళ్లకోసారి జరిగే ఈ పోటీల్లో మహిళల విభాగంలో భారత జట్టు డిఫెండింగ్ చాంపియన్గా... పురుషుల విభాగంలో టీమిండియా రెండుసార్లు కాంస్య పతకాలు సాధించింది. 'ర్యాంకింగ్, ప్రదర్శన, అనుభవం ఆధారంగా జట్లను ఎంపిక చేశాం. మహిళల జట్టును రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సింధు ముందుండి నడిపిస్తుంది' అని 'బాయ్' ఒక ప్రకటనలో తెలిపింది. పురుషుల జట్టులో భారత నంబర్వన్, ప్రపంచ 13వ ర్యాంకర్ లక్ష్య సేన్తోపాటు ప్రపంచ మాజీ నంబర్వన్ కిడాంబి శ్రీకాంత్, రైజింగ్ స్టార్స్ ఆయుశ్ శెట్టి, హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి ఉన్నారు. భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు: పీవీ సింధు, ఉన్నతి హుడా, తన్వీ శర్మ, రక్షిత శ్రీ, మాళవిక బన్సోద్, ట్రెసా జాలీ, పుల్లెల గాయత్రి, ప్రియా కొంజెంగ్బమ్, శ్రుతి మిశ్రా, తనీషా క్రాస్టో. భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు: లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి, కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, తరుణ్ మన్నేపల్లి, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, పృథ్వీ కృష్ణమూర్తి రాయ్, సాయిప్రతీక్, హరిహరన్.

# "జడేజా భార్య ప్రశంసల్లో రివాబా సంచలనం"



టీమిండియా ఆల్ ఫార్మాట్ ఆల్రౌండర్గా తన కంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాడు రవీంద్ర జడేజా. టీ20 ప్రపంచకప్-2024లో భారత్ చాంపియన్గా నిలిచిన తర్వాత అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్కు రిటైర్మెంట్ ప్రకటించిన జడ్డూ.. ప్రస్తుతం వన్డే, టెస్టుల్లో కొనసాగుతున్నాడు. స్వదేశంలో సౌతాఫ్రికాతో టెస్టు, వన్డే సిరీస్లు ముగించుకున్న జడేజా ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇదిలా ఉంటే.. జడ్డూ భార్య, గుజరాత్ మంత్రి రివాబా సోలంకి తన భర్తను ప్రశంసించే క్రమంలో టీమిండియాను ఉద్దేశించి ఆమె చేసిన కామెంట్స్ వైరల్గా మారాయి.

**ఇంటికి దూరంగా ఉన్నా :** క్రికెటర్గా ఉన్న తన భర్త విదేశాలకు వెళ్లడం సహజమని.. అయితే, జట్టులోని మిగతా అందరిలా తన భర్త కాదని తెలిపారు. ఎక్కడున్నా నైతిక విలువలు కోల్పోడంటూ రివాబా వ్యాఖ్యానించారు. ఆయనకు ఎలాంటి చెడు అలవాట్లు లేవని.. పన్నెండు ఏళ్లు ఇంటికి దూరంగా ఉన్నా తన వ్యక్తిత్వాన్ని కోల్పోలేదని చెప్పుకొచ్చారు.ద్వారకలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న రివాబా తన భర్త రవీంద్ర జడేజా గురించి ప్రస్తావిస్తూ.. "నా భర్త.. క్రికెటర్ రవీంద్ర జడేజా.. లండన్, దుబాయ్, ఆస్ట్రేలియా అంటూ ఆట నిమిత్తం వివిధ దేశాలు తిరగాల్సి వస్తుంది. అయినప్పటికీ ఆయన ఎలాంటి చెడు వ్యసనాలకు ఆకర్షితుడు కాలేదు.

**వాళ్లు ఎన్నో దుర్గుణాలు కలిగి ఉంటారు :** ఆయనకు తన బాధ్యతలు ఏమిటో తెలుసు. కానీ మిగతా జట్టంతా అలా కాదు. వాళ్లు ఎన్నో దుర్గుణాలు కలిగి ఉంటారు. అయినా వారిపై ఎవరూ ఎలాంటి ఆంక్షలు విధించలేరు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.అదే విధంగా.. "నా భర్త పన్నెండు ఏళ్లు ఇంటికి దూరంగా ఉండాల్సి వచ్చింది. కావాలంటే ఆయన ఎలాంటి చెడ్డ పనైనా చేసి ఉండవచ్చు. కానీ నైతిక విలువలు అంటే ఏమిటో ఆయనకు బాగా తెలుసు" అంటూ జడ్డూపై రివాబా ప్రశంసలు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్కాగా.. రివాబా వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

**భర్తను మెచ్చుకోవడంలో తప్పు లేదు.. కానీ :** తన భర్తను మెచ్చుకోవడంలో తప్పు లేదని.. అయితే, అందుకోసం మిగతా అందరి ఆటగాళ్ల వ్యక్తిత్వాలను కించపరచడం సరికాదని టీమిండియా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రిగా బాధ్యతాయుత పదవిలో ఉన్న వారు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.కాగా సాధారణ కుటుంబం నుంచి వచ్చిన జడేజా క్రికెటర్గా అత్యుత్తమ స్థాయికి ఎదగడంలో అతడి తల్లి పాత్ర కీలకం. ఈ విషయాన్ని జడ్డూనే స్వయంగా అనేక సందర్భాల్లో చెప్పాడు. ఇక తన అక్క కూడా తన విజయానికి బాటలు వేసిన వారిలో ఒకరని గతంలో ప్రశంసించాడు.

**కుటుంబంలో విభేదాలు? :** ఇదిలా ఉంటే.. జడ్డూ తండ్రి, అక్క కాంగ్రెస్ పార్టీలో ఉండగా.. భార్య రివాబా బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. రివాబా వచ్చిన తర్వాత జడ్డూ తమను పూర్తిగా దూరం పెట్టాడని అతడి తండ్రి ఆరోపించగా.. జడ్డూ మాత్రం భార్యకు మద్దతు తెలిపాడు.ఒకవైపు మాటలు మాత్రమే విని ఇంటర్వ్యూ చేయడం సరికాదని.. తన భార్యను తప్పుబట్టే విధంగా వ్యవహరిస్తే ఎవరినీ సహించబోనని మీడియాకు వార్నింగ్ ఇచ్చాడు జడ్డూ. కాగా జడేజా అక్కకు రివాబా స్నేహితురాలు. ఈ క్రమంలోనే జడ్డూ - రివాబాలకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లికి బాటలు వేసింది. వీరికి కుమార్తె నిధ్యానా ఉంది.

సూర్య
www.suryaa.com

# సినిమా

# చిరు, వెంకీ "నాటు నాటు"

ఇద్దరు హీరోలు కలిసి సినిమా చేస్తుంటే ఆ హంగామా వేరే లెవెల్ ఉంటుంది. ముఖ్యంగా ఫ్యాన్స్ అంతా తెర మీద ఆ ఇద్దరు హీరోలు చేసే యాక్షన్‌ని సూపర్ ఎంజాయ్ చేస్తారు. స్క్రీన్ షేరింగ్ ఒక్కటే సూపర్ హై ఇస్తే ఇక ఇద్దరు హీరోలు అలా కలిపి స్టెప్పులు వేస్తే అది నెక్స్ట్ లెవెల్ ఉంటుంది. ఆల్రెడీ ట్రిపుల్ ఆర్‌లో నాటు నాటు సాంగ్ తో అదరగొట్టారు ఎన్టీఆర్, రామ్ చరణ్. ఆ సాంగ్ ఇంటర్నేషనల్ లెవెల్ లో కూడా సెన్సేషన్ అయ్యింది. ఆర్.ఆర్.ఆర్ లోని ఆ సాంగ్ కి ఆస్కార్ కూడా వచ్చింది. మన శంకర వరప్రసాద్ సినిమాలో విక్టరీ వెంకటేష్.. ఐతే నెక్స్ట్ వార్ 2లో ఎన్ టీ ఆర్, హృతిక్ రోషన్ కూడా కలిసి కాలు కదిపారు. ఆ సాంగ్ కూడా ఫ్యాన్స్‌ని అలరించింది. ఐతే నెక్స్ట్ ఇలాంటి ట్రీట్ మరోసారి ఫ్యాన్స్‌కి ఉండబోతుందని తెలుస్తుంది. సీనియర్ స్టార్స్ ఇద్దరు కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమాలో విక్టరీ వెంకటేష్ ఒక స్పెషల్ రోల్ చేస్తున్నారు. సినిమాలో ఒక సాంగ్ కూడా ప్లాన్ చేస్తున్నారట. ఈ సాంగ్‌లో చిరంజీవి, వెంకీ ఇద్దరు అదరగొట్టేస్తారని టాక్. అంతేకాదు ఇద్దరికి ఒక హుక్ స్టెప్ ఉం టుందని ఆ సాంగ్ రిలీజ్ అయ్యాక ఫ్యాన్స్ అంతా ఆ హుక్ స్టెప్పుతో సోషల్ మీడియా సెన్సేషన్‌గా చేస్తారని అంటున్నారు. సిల్వర్ స్క్రీన్ పై ఇద్దరు సీనియర్ స్టార్స్ చేసే ఈ హంగామా ఫ్యాన్స్ కే కాదు సినీ లవర్స్ కి కూడా సూపర్ ట్రీట్ ఇస్తుందని అంటున్నారు. సంథింగ్ స్పెషల్‌గా వెంకీ, చిరు సాంగ్.. ఆడియన్స్ పల్స్ తెలిసిన డైరెక్టర్ గా అనిల్ రావిపూడికి ఇప్పటికే సూపర్ క్రేజ్ ఉంది. సంక్రాంతికి అతని సినిమా వస్తే తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుంది. ఇక మన శంకర వరప్రసాద్ లో మెగా బాస్ తో పాటు విక్టరీ వెంకటేష్ కూడా సర్ ప్రైజ్ చేయబోతున్నారు. వెంకీ, చిరు కలిసి చేసే ఈ సాంగ్ సంథింగ్ స్పెషల్‌గా ఉంటుందని తెలుస్తుంది. భీమ్స్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సాంగ్ బీట్స్ కూడా ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్ అందిస్తాయని తెలుస్తుంది. హఠాత్తుగా వచ్చిన రాజసాబ్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న మన శంకర వరప్రసాద్ సినిమాను షైన్ స్క్రీన్ బ్యానర్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్ కలిసి నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేసేందుకు వస్తుంది. వెంకటేష్ తో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న అనిల్ ఆ హిట్ మేనియా కొనసాగించేలా చిరంజీవి సినిమాలో కూడా ఆయన స్పెషల్ రోల్ ప్లాన్ చేశారు.





# "స్పెషల్" డిజప్పాయింట్..!

స్టార్ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ అనేవి ఎప్పుడు సంథింగ్ స్పెషల్ అనిపిస్తాయి. ఆ సాంగ్స్ ని ఎందుకు పెడతారనే వాళ్లు ఉన్నారు కానీ అది ఉంటే ఎంజాయ్ చేసే వాళ్లు ఎక్కువ శాతం మంది ఉంటారు. అందుకే కమర్షియల్ సినిమాల్లో స్పెషల్ సాంగ్ ఆనవా యితీ తరాలుగా కొనసాగుతూ వస్తుంది. ఐతే లాస్ట్ ఇయర్ కూడా ఈ స్పెషల్ సాంగ్స్ కొన్ని సెసేషనల్ అనిపించాయి. కానీ 2025లో మాత్రం స్పెషల్ సాంగ్ ఒక్కటంటే ఒక్కటి అదుర్స్ అనిపించేలా రాలేదు. ఆడియన్స్ ని స్టెప్పులు వేయించే స్పెషల్ సాంగ్స్.. హఠాత్తుగా వచ్చిన రాజసాబ్ సినిమాలు వస్తున్నాయి వెళ్తున్నాయి స్పెషల్ సాంగ్స్ కూడా వచ్చాయి కానీ ఏది కూడా ఆడియన్స్‌ని స్టెప్పులు వేయించేలా చేయలేదు. కనీసం విజిల్స్ మోత కూడా వేయించలేదంటే షాక్ అవ్వాల్సిందే. ఈ ఇయర్ కొన్ని సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ఎట్రాక్ చేస్తాయని అంచనా వేయగా అవి కూడా నిరాశపరిచాయి. అర్జున్ రెడ్డి హీరోయిన్ షాలిని పాండే రాహు కేతు సినిమాలో మధిర అనే సాంగ్ చేసింది. పులకిత్ సామ్రాట్, వరుణ్ శర్మతో చేసిన ఈ సాంగ్ పెద్దగా ఆకట్టుకోలేదు. షాలిని గ్లామర్‌తో ఎంత ఎట్రాక్ట్ చేయాలని చూసినా కూడా సాంగ్ ఆడియన్స్‌ని ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇదే క్రమంలో ఒకప్పటి స్టార్ హీరోయిన్ శ్రీయ శరన్‌తో కనకం అనే స్పెషల్ ఆంగ్ ప్లాన్ చేశారు నాన్ వైలెన్స్ టీం. కానీ ఆ సాంగ్ కూడా ఆకట్టుకోవడంలో విఫలమైంది. మెట్రో శిరీష్ చేసిన ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందించాడు. ఐతే అసలేమాత్రం ఆకట్టుకోలేని ఈ స్పెషల్ సాంగ్ ఆడియన్స్ ఎట్రాక్షన్ ని సంపాదించలేదు. ప్రేక్షకుల మనసులు గెలుచుకోలేని స్పెషల్ సాంగ్.. నెక్స్ట్ అందాల భామలు కృతి శెట్టి, కళ్యాణి ప్రియదర్శన్ చేసిన జినీ స్పెషల్ సాంగ్ కూడా ప్రేక్షకుల మనసులు గెలుచుకోలేదు. రవి మోహన్ హీరోగా చేస్తున్న ఈ సినిమాలో ఈ సాంగ్ ఎట్రాక్ట్ చేస్తుందని అనుకోగా టార్గెట్ మిస్ అయ్యింది. అందాల భామలు ఇద్దరు గ్లామర్ ట్రీట్ చేసినా కూడా లాభం లేకపోయింది. ఇక ఇదే దారిలో బాగి 4లో జాకీ ష్రాఫ్ కోసం సోనం బజ్వా చేసిన స్పెషల్ సాంగ్ కూడా అసలేమాత్రం ఆకట్టుకోలేదు. సోనం లుక్స్ పరంగా ఇంప్రెస్ చేసినా సాంగ్ మాత్రం ఎలాంటి బజ్ క్రియేట్ చేయలేదు. స్పెషల్ సాంగ్‌కి కేరాఫ్ అడ్రస్ అయిన మలైకా అరోరా చేసిన థమ సాంగ్ కూడా ఈసారి ఆడియన్స్‌ని ఇంప్రెస్ చేయలేకపోయింది. సాంగ్‌లో మలైకా అందాల మాయ చేసినా కూడా సాంగ్ పరంగా ఆడియన్స్‌ని ఆకట్టుకోలేదు. ఐతే ఈ సాంగ్స్ అన్నీ కూడా స్పెషల్ అప్పియ రెన్స్‌గా వచ్చినా అవి ఆడియన్స్ హృదయాలను చేరడంలో ఫెయిల్ అయ్యాయి. ఐతే థమన్నా చేసిన స్పెషల్ సాంగ్స్ మాత్రం ఇంప్రెస్ చేశాయి. ఘఫూర్ వెబ్ సీరీస్ తో పాటు రైడ్ 2 కోసం చేసిన సాంగ్ కూడా స్పెషల్ సాంగ్ లవర్స్‌ని అలరించాయి. మిల్కీ బ్యూటీ స్పెషల్ సాంగ్‌కి పర్ఫెక్ట్ అని మరోసారి ఈ సాంగ్స్‌తో ప్రూవ్ చేసుకుంది. ఐతే మిగతా సాంగ్స్ అన్నీ కూడా భారీ హంగా మాతో వచ్చినా ఆడియన్స్‌ని ఎంగేజ్ చేయడంలో ఫెయిల్ అయ్యాయి.

# 'మోగ్లీ' జెన్యూన్ లవ్ స్టోరీ కామెడీ, యాక్షన్.. అన్ని ఎమోషన్స్ ఉన్నాయి- రోషన్ కనకాల

యంగ్ హీరో రోషన్ కనకాల తన రెండవ చిత్రం మోగ్లీ 2025తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే టీజర్, పాటలు, ట్రైలర్‌తో స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ప్రీమియర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం డిసెంబర్ 13న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో రోషన్ కనకాల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మోగ్లీ కథ ఎలా ఉండబోతుంది?**

ఇది ప్యూర్ అండ్ ఇన్నోసెన్స్ వుండే లవ్ స్టోరీ. ఒక్క క్షణం కూడా బోర్ కొట్టకుండా డైరెక్టర్ సందీప్ ఈ సినిమాకి స్క్రీన్ ప్లే డిజైన్ చేశారు. స్క్రీన్ ప్లే చాలా రేసీగా ఉంటుంది. ఇందులో హానెస్ట్ లవ్ స్టోరీ ఉంటుంది. ఆ ప్రేమ కథని అద్భుతంగా పండించాడు. ఈ కథలో కామెడీ యాక్షన్ అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. చాలా ఆర్గానిక్, జెన్యూన్‌గా రాశాడు. మోగ్లీ తన ప్రేమ కోసం దేనికైనా రెడీగా ఉంటాడు. తన ప్రేమ కథకు వచ్చిన అడ్డంకేంటి? క్రిస్టఫర్ నోలన్ నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి అనేదాన్ని బట్టి ఈ కథ ముందుకు వెళుతుంది. మోగ్లీ అందరికీ కనెక్ట్ అయ్యే క్యారెక్టర్. అందరూ కూడా ఆ క్యారెక్టర్ కి రిలేట్ అవుతారు.



**బబుల్ గమ్ తర్వాత ఈ కథ ఎంచుకున్నారు కదా.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఆడియన్స్ థియేటర్స్ కి వచ్చిన తర్వాత ఒక్క క్షణం కూడా బోర్ ఫీల్ కాకుండా ఉండే కథ కోసం ఎదురుచూస్తున్న సమయంలో సందీప్ ఈ కథతో వచ్చారు ఇది థియేటర్స్ లో ఎక్స్పీరియన్స్ చేయాల్సిన కథ.

**మోగ్లీ జస్టిఫికేషన్ ఏమిటి?**

ఈ కథ అనుకున్నప్పుడే ఈ టైటిల్ ని అనుకున్నాం. ఇది ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో జరిగే కథ. ఇందులో హీరో క్యారెక్టర్ కి ఈ టైటిల్ ఫర్ఫెక్ట్ యాప్ట్. అలాగే ప్రేమ కథ కూడా హెల్ప్ అవుతుంది.

**ఫారెస్ట్ బ్యాక్ గ్రౌండ్‌లో షూటింగ్ చేయడం చాలెంజింగ్ అనిపించిందా?**

ప్రాక్టికల్‌గా చూసుకుంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అయితే నేను అన్ని ఎంజాయ్ చేస్తూ చేశాను. చేసే పనిని ప్రేమించి చేశాను. దీంతో అంతా సరదాగ గడిచింది. 60% ఆఫ్ షూటింగ్ ఫారెస్ట్ లోనే చేశాము. సినిమాలో అన్ని రియల్ లొకేషన్స్ ఉంటాయి. ఈ సినిమా తర్వాత ఫారెస్ట్ కి చాలా డీప్ గా కనెక్ట్ అయ్యాం

**మీకు ఇంట్లో ఎలాంటి సజెషన్స్ ఇస్తుంటారు?**

నటనపరంగా నాన్నకి నాకు ఎప్పుడూ ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. అలాగే అమ్మతో కూడా మాట్లాడుతూ ఉంటాను. డిస్కషన్ ఎప్పుడు ఉండాలని కోరుకుంటాను. వాళ్ళు కూడా నాకు అవసరమైన సజెషన్స్ ఇస్తూనే ఉంటారు. ఈ సినిమాకి కూడా కొన్ని సజెషన్స్ ఇచ్చారు. అవి చాలా బాగా వర్కౌట్ అయ్యాయి. చిన్నప్పుడే సినిమా వాతావరణంలో ఉండడంతో సినిమా మీద నాకు ఒక ప్రేమ ఏర్పడిపోయింది. ఈ విషయంలో నాకు ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ ప్రయాణాన్ని నేను ఆస్వాదిస్తున్నాన. ఒక్కొక్కటి నేర్చుకుంటున్నాను.

**ఈ సినిమాలో మీది, బండి సరోజ్ గారి కాంబినేషన్ ఎలా ఉండబోతుంది?**

ఈ కథకి ఆయన చాలా పర్ఫెక్ట్ గా సింక్ అయ్యారు. ఆ క్యారెక్టర్ ని చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. మా మధ్య ఉండే సీన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి.

# హాలీవుడ్ లోకి మరో బాలీవుడ్ స్టార్..

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి చెందిన అనేక మంది నటీనటులు.. ఇప్పటికే హాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, అనుపమ్ ఖేర్ సహా పలువురు ఇప్పటికే హాలీవుడ్ చిత్రాల్లో క్యామియో రోల్స్ చేశారు. వివిధ చిత్రాల్లో నటించి తమ యాక్టింగ్ తో ఆకట్టుకున్నారు. ఇప్పుడు మరో నటుడు విద్యుత్ జమ్వాల్ అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకున్న ఆయన.. ఇప్పుడు హాలీవుడ్ లో అడుగు పెట్టనున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ ఉన్న వీడియో గేమ్ ఆధారంగా తెరకెక్కుతున్న స్ట్రీట్ ఫైటర్ అనే అమెరికన్ మార్షల్ ఆర్ట్స్ మూవీలో కీలక పాత్రలో కనిపించనున్నారు. కిటావో సకురాయి దర్శకత్వం వహిస్తున్న ఆ భారీ యాక్షన్ మూవీ నుంచి రీసెంట్‌గా రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్.. అందరినీ ఆకట్టుకున్నాయి. అందులో ముఖ్యంగా విద్యుత్ జమ్వాల్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ధల్సిమ్‌గా సినిమాలో కనిపించనున్న విద్యుత్ జమ్వాల్ మేకోవర్.. ఒక్కసారిగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించిందనే చెప్పాలి. అయితే ఫస్ట్ లుక్ లో విద్యుత్.. పూర్తి హెయిర్ షేవ్ తో కనిపించారు.



భారతీయ యోగి రూపానికి తగ్గట్టుగా మేకోవర్ చేసుకుని షాకిచ్చారు. వీడియో గేమ్స్ ప్రపంచంలో విపరీతమైన పేరు తెచ్చుకున్న ధల్సిమ్ పాత్రను ఆయన పోషించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆ రోల్ కు కంప్లీట్ ఫిజికల్ ఫిట్ నెస్, యాక్షన్ ఫ్లూయిడిటీ, బాడీ కంట్రోల్ వంటి లక్షణాలు అవసరం. ఇప్పటికే యాక్షన్ సినిమాల్లో అద్భుత స్టంట్స్ ను ప్రదర్శించిన విద్యుత్ జమ్వాల్ ఈ పాత్రకు సరిగ్గా సెట్ అయ్యాడనే అభిప్రాయం ఇప్పుడు అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ధల్సిమ్ పాత్రకు పర్ఫెక్ట్ ఫిట్ విద్యుత్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. హాలీవుడ్ లో దుమ్మురేపి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, భారత్ కు గర్వకారణం గా నిలవాలని కోరుకుంటున్నారు.

# ఏఐ పుస్తకాల రచయిత స్వామి ముద్దంకు మంత్రి శ్రీధర్ బాబు అభినందనలు

దేశంలోనే తొలిసారి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పై పుస్తకాలు రాసిన జర్నలిస్టు స్వామి ముద్దం ను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. 'ఏఐ ఫర్ యంగ్ మైండ్స్', 'ఏఐ ఇన్ మోడరన్ జర్నలిజం', 'ఆధునిక జర్నలిజం %-% ఏఐ' వంటి పుస్తకాలను ముద్దం స్వామి మంత్రి శ్రీధర్ బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏఐ పుస్తకాల ఆవిష్కరణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర స్థాయిలో విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏఐ



టెక్నాలజీ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఏఐ పుస్తకాల రచయిత స్వామి ముద్దం మాట్లాడుతూ.. తాను రాసిన పుస్తకాల సబ్జెక్టులను భారత్ ఫ్యూచర్ సిటీలోని ఏఐ యూనివర్సిటీలో ఏఐ కోర్సులకు ఉపయోగించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏఐ టెక్నాలజీకి అధిక ప్రాధాన్యమిస్తోందని, ఇది తెలంగాణ యువతకు ఉపయోగకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎన్ ప్రీతం, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, మాచర్ల కుమారస్వామి, బిజిగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# "గుర్రం పాపిరెడ్డి" ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తుంది - ప్రొడ్యూసర్స్ జయకాంత్ (బాబీ), అమర్ బురా

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా "గుర్రం పాపిరెడ్డి". ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "గుర్రం పాపిరెడ్డి" సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు ప్రొడ్యూసర్స్ జయకాంత్(బాబీ), అమర్ బురా.

**ప్రొడ్యూసర్ జయకాంత్ (బాబీ) మాట్లాడుతూ**

డైరెక్టర్ మురళీ మనోహర్ మా ఫ్రెండ్. ఆయన "గుర్రం పాపిరెడ్డి" స్టోరీ మాకు నెరేట్ చేశాడు. కథ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ప్రొడక్షన్ స్టార్ట్ చేసేందుకు ఇలాంటి కొత్త తరహా కథ కరెక్ట్ అనుకుని మూవీ స్టార్ట్ చేశాం. కొత్త ప్రొడ్యూసర్స్ అంటే ఏదైనా లవ్ స్టోరీతో, యూత్ ఫుల్ కంటెంట్ తో చేస్తుంటారు. కానీ రొటీన్ ప్రాజెక్ట్ చేయొద్దనే డార్క్ కామెడీ జానర్‌లో "గుర్రం పాపిరెడ్డి" సినిమాను నిర్మించాం. ఈ కథ విని తరుణ్ భాస్కర్ నేను లీడ్ చేస్తానని అన్నారు. అయితే ఆయనకు అప్పటికే కమిట్ అయిన ప్రాజెక్ట్స్ ఉండటం వల్ల డిలే అవుతూ వచ్చింది. మరో యంగ్ హీరోకు కూడా సబ్జెక్ట్ నచ్చింది. అతను ఆన్ బోర్డ్ రావడానికి కూడా లేట్ అయ్యింది. చైతన్య జొన్నలగడ్డ కూడా మా మూవీలో ఒక ఇంపార్టెంట్ రోల్‌కు ఓకే చెప్పాడు. నరేష్ అగస్త్య బాగుంటాడని ఆయనకు స్క్రిప్ట్ చెప్పాం. నరేష్ కూడా ఆసక్తి చూపించాడు. అతనితో ఇంటరాక్ట్ అయ్యాక మా డైరెక్టర్ మురళీ మనోహర్ కు కూడా నరేష్ ఆగస్త్య ఈ కథకు యాప్ట్ అని చెప్పాడు. నరేష్ మత్తువదలరా వంటి డిఫరెంట్ కాన్సెప్ట్స్ మూవీస్ చేసి ఉన్నాడు. అతను "గుర్రం పాపిరెడ్డి" టైటిల్ క్యారెక్టర్ లో బాగా నటించాడు.



**ప్రొడ్యూసర్ అమర్ బురా మాట్లాడుతూ**

తెలివిలేని వాళ్లు తెలివైన వాడిని ఎలా ఎదుర్కొన్నారు అనేది మా మూవీ పాయింట్. ఫన్, కామెడీతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. సందేశాలు వినేందుకు ప్రేక్షకులు థియేటర్స్ కు రారు. వాళ్లను ఆ కాసేపు ఎంటర్ టైన్ చేయాలి. మా మూవీ కంటెంట్ మీద పూర్తి నమ్మకంతో ఉన్నాం. మ్యాడ్, మ్యాడ్ 2 చూస్తున్నప్పుడు ఆ పాత్రలను చూస్తేనే ఎలా నవ్వుకున్నామో మా సినిమాలోనూ ఆర్టిస్టులను చూడగానే ఫన్‌గా ఫీలవుతారు. నరేష్ అగస్త్యకు మత్తువదలరా థియేట్రికల్‌గా మంచి పేరు తెచ్చింది. గుర్రం పాపిరెడ్డి సినిమా థియేట్రికల్ రిలీజ్ పరంగా ఆయనకు మరింత రేంజ్ తెస్తుందని నమ్ముతున్నాం.

సినిమా మేకింగ్ అంటే ప్రతి రోజూ ఒక ఛాలెంజ్. మా మూవీకి కొంత బడ్జెట్ పెరిగింది. అందుకు కథ స్పాన్‌తో పాటు స్ట్రైక్ ఎఫెక్ట్ కూడా పడింది. ఇక్కడ స్ట్రైక్ జరుగుతున్నప్పుడు మైసూర్ వెళ్లి షూట్ చేశాం. సినిమా బిజినెస్ చేయడం మామూలు విషయం కాదు. మా మూవీ కంటెంట్ ప్రతి ఒక్కరికీ నచ్చినా స్టార్ హీరో లేదు అనేది బిజినెస్ పరంగా ఇబ్బంది అయ్యింది. కంటెంట్ ను నమ్మి మా గుర్రం పాపిరెడ్డి సినిమాను 140 స్క్రీన్స్ లో రిలీజ్ చేస్తున్నాం.





# పువ్వులు.. యాపిల్ డార్లింగ్ ఏం చెబుతున్నాడు

ఈ ఉదయం నుంచి సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ప్రభాస్ కొత్త ఫోటోలే కనిపిస్తున్నాయి. బాహుబలి తర్వాత పాన్ ఇండియా స్టార్‌గా మారాక, ప్రభాస్ ఇలా ప్రత్యేకంగా కెమెరా ముందుకు వచ్చి ఫోటోషూట్‌లు చేయడం చాలా అరుదు. సినిమా లుక్స్ తప్పితే పర్సనల్‌గా ఫోటోషూట్స్‌కు దూరంగా ఉండే డార్లింగ్, సడన్‌గా చేతిలో రంగురంగుల పూలు, మరో చేతిలో ఎర్రటి యాపిల్ పట్టుకుని ఇచ్చిన ఫోజులు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. సాధారణంగా ప్రభాస్ అంటే ఈ మధ్య కాలంలో మనకు గుర్తొచ్చేది గంభీరమైన ముఖం, భారీ యాక్షన్ కటౌట్. సలార్, కల్కి లాంటి సినిమాల్లో మనం చూసింది అదే సీరియస్ నెస్. కానీ చాలా కాలం తర్వాత ప్రభాస్ చాలా కూల్‌గా, వింటేజ్ డార్లింగ్ లాగా ఈ ఫోటోల్లో కనిపిస్తున్నారు. సింపుల్ బ్లాక్ డ్రెస్ వేసుకుని, సోఫాలో క్యాజువల్‌గా కూర్చుని నవ్వుతున్న తీరు చూస్తుంటే, ఫ్యాన్స్ కు 'డార్లింగ్', 'మిస్టర్ పర్ఫెక్ట్' రోజుల నాటి ప్రభాస్ గుర్తొస్తున్నాడు. అసలు ఈ సడన్ ఫోటోషూట్ వెనుక ఉన్న సీక్రెట్ ఏంటి అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ప్రభాస్ చేతిలో యాపిల్ పట్టుకుని, దాన్ని కొరుకుతున్నట్లు ఇచ్చిన ఫోజు కేవలం స్టైల్ కోసం ఇచ్చింది కాదనిపిస్తోంది. ఇన్నాళ్లు ఫుల్ లెంగ్త్ యాక్షన్ మోడ్ లో ఉన్న తాను, ఇప్పుడు రొమాంటిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ మోడ్‌లోకి మారుతున్నానని చెప్పడానికి ఇదొక బలమైన సంకేతం కావచ్చని అంటున్నారు. కేవలం మాస్ ఆడియెన్స్ నే కాదు, తన లవర్ బాయ్ ఇమేజ్ ను ఇష్టపడే లేడీ ఫ్యాన్స్ ను, ఫ్యామిలీ ఆడియెన్స్ ను మళ్ళీ తన వైపు తిప్పుకోవాలనే ప్లాన్ ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ చేతిలోని పువ్వులు, ఆ కల్మషం లేని చిరునవ్వు చూస్తుంటే.. నేను యుద్ధాలు చేయడమే కాదు, ప్రేమించడం కూడా మర్చిపోలేదు.. అని డార్లింగ్ సైలెంట్‌గా స్టేట్మెంట్ ఇస్తున్నట్లు ఉంది. రాబోయే సంక్రాంతికి మారుతి దర్శకత్వంలో 'ది రాజా సాబ్' రిలీజ్ కానుంది. అది హారర్ కామెడీ అయినా, అందులో ప్రభాస్ చాలా జాలీగా, రొమాంటిక్‌గా కనిపించనున్నారు. ఈ ఫోటోషూట్ ఆ సినిమా మూడ్ ను ఆడియెన్స్‌లోకి తీసుకెళ్లడానికే అనిపిస్తోంది. ఆ తర్వాత ఎలాగూ హను రాఘవపూడి 'ఫౌజీ', సందీప్ వంగా 'స్పిరిట్' లాంటి సీరియస్ సినిమాలు లైన్లో ఉన్నాయి. వాటికి వెళ్లే ముందే, ఫ్యాన్స్ కు ఈ కూల్ బ్రీజ్ లాంటి ట్రీట్ ఇవ్వాలని డిసైడ్ అయినట్లున్నారు. ప్రభాస్ ను ఇలా చూడటం ఫ్యాన్స్ కు కచ్చితంగా ఒక ఫ్రెష్ వైబ్ లాంటిది. బాక్సాఫీస్ దగ్గర వందల కోట్లు కొల్లగొట్టే ఈ బాహుబలి, ఒక చిన్న యాపిల్ తో ఇంటర్నెట్ ను ఇంతలా ఆకర్షించడం ప్రభాస్ కే చెల్లింది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044